సంపుటి : 9
సంచిక : 6
పుటలు : 52
రు. 25లు
ISSN NO: 2582-8738
యు.జీ.సీ. గుర్తింపు పొందినది

గిడుగు రామమూర్తి పుట్టినరోజు (ఆగష్టు 29): తెలుగునుడి పండుగ రోజు శుభాకాంక్షలు

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగష్టు 2023







కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారి
పుట్టిన రోజు (మే18)ను
తెలుగు అభివృద్ధి దినోత్సవంగా
ప్రతియేటా నిర్వహించాలని–
నడిగూడెంలో జరిగిన శతవర్ధంతిసభ
ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఈ సందర్భంగా కొమఱ్ఱాజు విశిష్ట రచన
'తెలుగు భాషాతత్త్వము' నూ,
'శతవర్ధంతి స్మృతిసంచిక' నూ
విడుదల చేశారు

తెలుగుభాషతోనే తెలుగుజాతి ఉనికి;
కొమఱ్ఱాజు లక్ష్మణరావు శతవర్ధంతి సభలో
మంత్రివర్యుల, సాహితీవేత్తల,
మేధావుల హెచ్చరిక

అన్ని రంగాలలో తెలుగు వికాసం
తెలుగు ప్రభుత్వాల బాధ్యత;
తెలుగు భాషోద్యమకారుల పిలుపు



అన్ని చదువులూ అమ్మనుడిలోనే – ప్రధాని ప్రకటన

# కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు శతవర్ధంతి సభ దృశ్యాలు

## 13-07-2023 గురువారం-నడిగూడెం (సూర్యాపేటజిల్లా) తెలంగాణ



దీప ప్రజ్వలన చేస్తున్న శ్రీ గోరటి వెంకన్న



'తెలుగుభాషాతత్త్వం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు



ప్రసంగిస్తున్న తెలంగాణ మంత్రివర్యులు శ్రీ జి.జగదీష్‌రెడ్డి



ప్రసంగిస్తున్న తెలంగాణ మంత్రివర్యులు శ్రీ సింగిరెడ్డి నిరంజనరెడ్డి



ప్రసంగిస్తున్న సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్



అధ్యక్షోపన్యాసం చేస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు శ్రీ జూలూరి గౌరీశంకర్



తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డా.సామల రమేష్‌బాబుకు ఆత్మీయ సత్కారం



కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు శ్రీ కె.జితేంద్రబాబుకు సత్కారం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి


- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...




ఆగష్టు 2023


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. <u>హామీపత్రం తప్పనిసరి:</u> రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1–2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

### <u>లోపలి పుటలలో....</u>


| | | | |
|---|---|---|---|
| ఇవీ సంగతులు | ........................ | ............... | 07 |
| సంపాదక హృదయం | అన్ని చదువులూ అమ్మనుడిలోనే. | ........... | 09 |
| భాషల పరిరక్షణ | తెలుగు భాష. .... | రహ్మానుద్దీన్ షేక్ | 11 |
| పరిశోధన పత్రం | ప్రాచీన సాహిత్యం | మల్లిపూడి రవిచంద్ర | 14 |
| పరిశోధన పత్రం | బోనెలపాట ,...... | వప్పల వెంకటరమణ | 17 |
| సందేహాలకు–సమాధానాలు | తెలుగుభాష స్థితీ గతీ... | గారపాటి ఉమామహేశ్వరరావు | 19 |
| సభలు వార్తలు | కొమఱ్ఱాజు శతవర్ధంతి సభ. | కళ్యాణ కృష్ణ | 21 |
| చదవవలసిన పుస్తకం | గాజుల లక్ష్మీనరసు చెట్టి....... | వెన్నెలకంటి రామారావు | 35 |
| చంద్రిక కథ | సుబ్రహ్మణ్యభారతి రచన | బంగోరె ముందుమాటలు | 38 |
| సాహిత్యరంగం | మానవత్వానికి మల్లెమాట... | మధురాంతకం నరేంద్ర | 42 |
| వారసత్వ సంపద | శంకరన్ గారి తరం.... | పి.శివరామకృష్ణ 'శక్తి' | 43 |
| చంద్రిక కథ | సుబ్రహ్మణ్యభారతి రచన | బంగోరె ముందుమాటలు | 37 |
| పుస్తక సమీక్ష | భావుకత నిండిన.. | తేళ్ళ అరుణ | 48 |
| పుస్తక సమీక్ష | నాసీమ యాసే.. | ఎమ్వీశాస్త్రి | 49 |
| వెలిసిపోతున్న పదాలు: | తాళాధ్యాయం.. | జి.వి.పూర్ణచంద్ | 50 |
| ధారావాహిక | అడుగుజాడలు–ఆనవాళ్ళు–25 | ఈమని శివనాగిరెడ్డి | 45 |



| ముఖచిత్రం, | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| చిదంబరం రావు | సరసి | యన్.రాజారావు |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు

**రచనలను, వార్తలను, వాట్సాప్ పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## • బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు •

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi

+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## • చందాదారులకు సూచనలు •

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్ళలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

<u>గమనిక</u>

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## • ప్రోత్సాహకులుగా చేరండి •

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ



# 2023 ఆగష్టు 29
# గిడుగు వేంకట రామమూర్తి
# 160వ జయంతి
# తెలుగు భాషాదినోత్సవం



## పిలుపు

గిడుగు రామమూర్తిగారు 1907 నుండి 1940 వరకు మూడు తరాలకు పైగా ఒక ఉద్యమంగా తెలుగుకోసం నిర్విరామంగా చేసిన పోరాటం వాడుకభాష ఉద్యమంగా ప్రసిద్ధి చెందింది. వలసపాలనలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకోసం పోరాడుతూనే, ప్రజాసామ్యప్రభుత్వ సాధన కోసం, తెలుగును ప్రజలందరి భాషగా తీర్చిదిద్దడం కోసం సాగిన ఉద్యమం అది.

అయితే-వలసపాలన నుంచి విముక్తిచెంది, మొత్తం దేశాన్నే ప్రజాసామ్యబద్ధమైన పరిపాలనలోకి తెచ్చుకొంటున్న రోజుల్లో, భాషారాష్ట్రాలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్న ఈ రోజుల్లో నిజంగా మనభాషలో మనం పరిపాలించుకుంటున్నామా అనేది, తీరని ప్రశ్నగా, ఆవేదనగా మిగిలిపోతున్నది. నేడు సాగుతున్న తెలుగుభాషోద్యమానికి కీలకాంశం ఇదే. మాతృభాషకు, ప్రజలకు గల ప్రాణబంధాన్ని ఛిన్నాభిన్నంచేసేదిశగా ప్రభుత్వాలు వ్యవహరించడాన్ని మనం తీవ్రంగా ప్రతిఘటించాలి. పూర్తి ప్రజాసామ్యపాలనకోసం మనం మన తెలుగురాష్ట్రాల్లో అన్ని రంగాల్లో తెలుగులోనే పాలన సాగేట్లు మనం నిరంతర పోరాటం చేయవలసిందే

తెలుగులో ఆంతరంగిక సంస్కరణలకై, ప్రజాసామ్యానికై పోరాడిన గిడుగు రామమూర్తిగారిని, నేటి అవసరాలకు తగిన భాషోద్యమాన్ని నిర్మాణం చేసుకోవడానికి స్ఫూర్తిగా భాషోద్యమకారులు రెండు దశాబ్దాలకు పైగా స్వీకరించారు. కనుక- గిడుగురామమూర్తిగారి పుట్టినరోజు ఆగష్టు 29న తెలుగుభాషా దినోత్సవం (తెలుగునుడి పండుగరోజు)గా నిర్వహించుకొనే సంప్రదాయాన్ని మనం ఏర్పరచుకొన్నాం. ఈ పండుగ రోజున ప్రభుత్వాలు కూడా వివిధ కార్యక్రమాలను నడుపుతున్నాయి.

కనుక ఈ సంవత్సరం తెలుగుభాషా దినోత్సవంలో ఈ క్రింది అంశాలపై రెండు తెలుగురాష్ట్రాల్లో అన్ని చోట్ల సమావేశాలు జరపాలని కోరుతున్నాం. ముఖ్యంగా విద్యాసంస్థలలోనూ, వివిధ వృత్తి సంఘాలలోనూ, సామాజిక మాధ్యమాలలోనూ, కార్యక్రమాలను నిర్వహించి, విస్తృత ప్రచారం జరిగేట్లు శ్రద్ధ వహించాలని అన్ని తెలుగు సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

**1.బోధనామాధ్యమంగా తెలుగు ఉండాలి 2. అన్ని రంగాల్లో పాలనాభాషగా తెలుగు ఉండవలసిందే 3.వ్యాపార, వాణిజ్యరంగాల్లో తెలుగును అన్నివిధాలుగా వినియోగించాలి. 4.న్యాయస్థానాల్లో తెలుగును పూర్తిగా వినియోగించాలి. 5. సామాజిక మాధ్యమాలలో తెలుగును వినియోగించాలి. 6.వలగూడు(ఇంటర్నెట్-అంతర్జాలం), సంగణిక ఉపకరణాలలో తెలుగును వినియోగించాలి.**

డా. సామల రమేష్‌బాబు
గౌరవాధ్యక్షుడు
ఫోన్: 98480 16136

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
అధ్యక్షుడు
ఫోన్: 98661 28846

# తెలుగుభాషోద్యమ సమాఖ్య

కేంద్ర కార్యాలయం: ప్లాట్ నెం.89, ఇంటి నెం.54-1/4,1ఎ, వెటర్నరీ కాలనీ, 4వ వీధి,
2వ అడ్డరోడ్డు, విజయవాడ - 500008

# శ్రద్ధాంజలి

## ఇద్దరు తెలుగు భాషోద్యమకారులు కన్నుమూశారు





2003 ఫిబ్రవరి 21న తెలుగు భాషోద్యమ సమాఖ్యను ఏర్పరచేనాటికే చాలా కాలం ముందు నుంచే తెలుగు వికాసానికై తమదైన శైలిలో పని పనిచేసుకొంటూ సాగుతున్న ఇద్దరు పెద్దలు ఇటీవల తనువు చాలించారు.

### కె.యస్.బి.వి.కె. శివరావుగారు

2023 జూన్ 16న శ్రీ కె.యస్.బి.వి.కె. శివరావుగారు హైదరాబాదులో నిర్యాణం చెందారు. 1938 జూన్ 10వ తేదీన పుట్టిన శివరావుగారు హైదరాబాదులో రాష్ట్ర ప్రభుత్వ అధికార భాషా విభాగంలో పరిశోధక అధికారిగా పనిచేశారు.

నందమూరి రామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగు ముద్రణ ఉపకరణాలను అభివృద్ధిపరచడంలో విశిష్ట కృషి చేసినందుకు ఆయన చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య సంస్థాపక సభ్యులలో శివరావుగారు ఒక ముఖ్యవ్యక్తి. తొలుత కోశాధికారి, తర్వాత ఉపాధ్యక్షులుగా సేవలందించారు. స్నేహశీలి. అందరినీ అప్యాయంగా పలుకరించే శివరావుగారు తన 85వ ఏట చనిపోయారు. మిత్రులందరికీ ఆయన లేని లోటు తీర్చలేనిదే.

తెలుగు భాషోద్యమ సమాఖ్యకు మరువలేని, మరువరాని జ్ఞాపకంగా మిగిలిపోయారు. సమాఖ్య తొలి అధ్యక్షుడు కీ.శే సి.ధర్మారావుగారితో పాటు తొలినుండీ భాషోద్యమంలో తనను అంకితం చేసుకున్న పెద్దాయన శ్రీ శివరావుగారు.

### నంద్యాల నారాయణరెడ్డిగారు

నేటి తమిళనాడులోని హోసూరు కేంద్రం గా దశాబ్దాలుగా జరుగుతున్న తెలుగు భాషోద్యమంతో విడదీయలేని బంధంగా పెనవేసుకుపోయిన నంద్యాల నారాయణరెడ్డిగారు 2023 జులై 12వ తేదీన కన్నుమూశారు. 1942 ఆగష్టు 16న జన్మించిన నారాయణరెడ్డిగారు తెలుగు భాషోద్యమ సమాఖ్య తమిళనాడు శాఖలో హోసూరు కేంద్రంగా చేసిన కృషి సాటిలేనిది. అచ్చంగా తెలుగు ప్రాంతమైన హోసూరు భాషా రాష్ట్రాల ఏర్పాటు వల్ల మనం కోల్పోయిన ప్రాంతాలలో ఒకటి.

తమిళనాడులో జరిగినా ఆంధ్రప్రదేశ్‌లో జరిగినా, తెలుగు భాషోద్యమ సమాఖ్య చేపట్టిన అన్ని కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుగా పాల్గొనేవారు. స్థానిక తెలుగులో ఆయన రచయితగా కూడా ప్రసిద్ధులు. ఇరులదొడ్డి బతుకులు, (అనుభవాల కతలు), సొతంత్రకాల చదువులు (నవల) ఎంతో ఆదరణ పొందాయి. కన్నడం నుంచి, తమిళం నుంచి కొన్ని అనువాదాలు చేశారు. ప్రసిద్ధ తమిళ రచయితైన కీ.రాజ్‌నారాయణ్ ప్రసిద్ధ నవల 'గోపల్లె'ను తెలుగులోకి అనువదించారు. హోసూరు ప్రాంతంలో తెలుగు భాషోద్యమానికి నంద్యాల నారాయణరెడ్డిగారి మరణం తీరని లోటు. యువ కార్యకర్తలకు ఆదర్శంగా ఎప్పటికీ గుర్తుండే వ్యక్తి.

ఈ ఇరువురు కురువృద్ధులకు- తెలుగు భాషోద్యమ సమాఖ్య వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

# ఇవీ సంగతులు...

**1. ఇండో-యూరోపియన్ భాషల డేటాబేస్ ప్రతిపాదన.**
సైన్స్ పత్రికలో జూలై చివరన ఒక ప్రతిపాదన వచ్చింది. ఈ ప్రతిపాదన పత్రంలో అన్ని ఇండో-యూరోపియన్ భాషల పదాలను చేర్చి, ఒక వృక్షం రూపంలో ఒక పదాన్ని ఇచ్చినప్పుడు వేరు వేరు భాషల్లో ఆ పదం స్వరూపాన్ని ఈ డేటాబేస్ చూపిస్తుంది.
80 మంది భాషావేత్తల సహకారంతో 170 అంశాలను 161 ఇండో-యూరోపియన్ భాషలలో రూపొందించారు. ప్రస్తుతం ఇందులో 25,918 పదాలకు అన్ని 161 భాషల్లో అనుసంధానం ఏర్పరిచారు.

**2. మాతృభాషను, మాతృభూమిని ఎప్పటికీ మరవవద్దు : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.**
నాగపూర్లోని భారతీయ విద్యా భవన్ వారి సాంస్కృతిక కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాతృభాష ప్రాముఖ్యత గురించి చెప్పారు. ఆధునికత వలన కొత్త భాషలు నేర్చుకున్నా అవకాశాల కోసం దేశం వీడి వెళ్ళినా, ఎప్పటికీ మాతృభాషను, మాతృభూమిని మరవవద్దని చెప్పారు. భారతీయ సమాజాన్ని ఔన్నత్యానికి చేర్చటంలో భారతీయ భాషల పాత్ర చాలా ఉందని అన్నారు.

**3. ఫిలిప్పీన్స్‌లో మాతృభాషా మాధ్యమ విద్య- సెనేట్‌లో చర్చ.**
ఫిలిప్పీన్స్ లో మాతృభాషా మాధ్యమం అమలు ఆయా భాషల్లో బోధనాసామగ్రి లేకపోవడం వలన, విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన వలన ఆగిపోయింది. ఫిబ్రవరిలో మాతృభాషా మాధ్యమ విద్య బిల్లును నిలిపివేశారు. బోధనాసామగ్రి రూపొందాక పునఃపరిశీలన కోసం బిల్లును అట్టే ఉంచారు. ఇప్పుడు జూలై నెలలో మళ్ళీ బిల్లు అమలు సాధ్యాసాధ్యాలపై ఆ దేశపు సెనేట్ చర్చలు జరపనుంది.

**4.యుద్ధంతో కుదేలైన రష్యన్ భాష మాట్లాడే ఉక్రెయిన్ దేశ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా రష్యన్ భాష తిరస్కరణ.**
రష్యా చేస్తున్న యుద్ధం వలన నష్టపోయిన ఉక్రెయిన్ దేశపు పలు ప్రాంతాల్లో రష్యన్ భాష ప్రబలంగా ఉండేది. అయితే అక్కడి ప్రజల్లో రష్యాపై ఉన్న ద్వేషం- రష్యన్ భాష తిరస్కరణ వైపుకు మారింది. హోటళ్ళలో వెయిటర్లు, క్షురకులు, అంగళ్ళవాళ్ళు రష్యన్ భాషను మాట్లాడటం మానేశారు. రష్యన్ పుస్తకాలను ఉక్రేనియన్ పుస్తకాలతో బదిలీ చేస్తున్నారు. బహిరంగంగా రష్యన్ సాహిత్యాన్ని తిరస్కరిస్తున్నారు, ఉక్రేనియన్ సాహిత్య పుస్తకాలకు గిరాకీ బాగా పెరిగింది. రష్యన్ పుస్తకాలను టాయిలెట్ పేపర్లుగా మార్చి వాడుతున్నారు. వీధుల పేర్లను, ప్రదేశాల పేర్లను రష్యన్ పేర్ల నుంచి ఉక్రేనియన్ పేర్లకు మారుస్తున్నారు. హోటళ్ళలో అమ్మే రష్యన్ వంటకాలకు ఉక్రేనియన్ పేర్లతో వ్యవహరించడం మొదలయింది. రేడియో స్టేషన్ల నుంచి ఇంతకు ముందు వినిపించే రష్యన్ పాటల స్థానంలో ఉక్రేనియన్ పాటలు ఆడుతున్నాయి. రష్యన్ భాషను శత్రుభాషగా వ్యవహరిస్తున్నారు. యుద్ధానికి ముందు 30% ఉక్రేనియన్లు రష్యన్ భాష మాట్లాడేవారు. ఈ పర్యవసానాల వలన ఎవరూ రష్యన్ భాషను మాట్లాడేందుకు ఇష్టపడకపోవడం, ఉక్రేనియన్ భాషను నేర్చుకుని మరీ దేశభక్తిని చాటుకునేందుకు తమ భాషాగుర్తింపును చెరిపివేసుకోవటానికి వీరు సిద్ధపడ్డారు.

**5. మాతృభాషా మాధ్యమ అమలుకు నాగాలాండ్ రాష్ట్ర ప్రభుత్వ విముఖత.**
మొత్తం 17 ప్రధాన జాతులతో 20కి పైగా పెద్ద స్థాయి గిరిజన భాషలతో నాగాలాండ్ ప్రభుత్వం మాతృభాషా అమలుకు సరిపడా బోధనా సిబ్బందిని, బోధనా సామగ్రిని తయారు చేసుకోలేకపోయింది. ఆ రాష్ట్రంలో ఆంగ్ల మాధ్యమం అమలులో ఉంది. ఆ రాష్ట్ర ప్రభుత్వం నిజంగా విద్యార్థి మాతృభాషలో విద్యా బోధనామాధ్యమం అమలు చేయాలంటే 20 పైన భాషలలో బోధనాసామగ్రిని కనీసం 5వ తరగతి వరకూ రూపొందించాలి కానీ వనరుల లేమి వలన ఇది ఆ రాష్ట్రప్రభుత్వానికి సాధ్యం కావటం లేదు.

**6. పిల్లలలో భాషా వికాసానికి, భాషల పరిణామక్రమానికి మధ్య సామ్యత : యూనివర్సిటీ ఆఫ్ టొరొంటో అధ్యయనంలో వెల్లడి.**
చిన్నపిల్లలు భాషను నేర్చుకునే క్రమం, ప్రపంచ భాషల పరిణామక్రమం ఈ రెండు అంశాలలో చాలా సామ్యత ఉందని టొరొంటో విశ్వవిద్యాలయ అధ్యయనంలో వెల్లడైంది. ఈ పరిశోధన వలన ఒక పదం యొక్క అర్థం భవిష్యత్తులో ఎలా మారుతూ పోతుందో కూడా అంచనా వేయవచ్చు. పిల్లలు మాటలు నేర్చుకునే విధానాన్ని అనుకరిస్తూ ఒక మెషిన్ లెర్నింగ్ మోడల్ ను వీరు రూపొందించారు. ఈ మోడల్ ను అభివృద్ధి చేస్తున్న క్రమంలో భాషల పరిణామక్రమం కూడా ఇదే విధానంలో ఉంటుందని గమనించారు. ఈ మోడల్ ను మరింత పరిపుష్టం చేసుకుంటే పదజనకం లాంటి ఉపకరణాలను మరింత సమర్థవంతంగా తయారు చేసుకోవచ్చని తెలుస్తోంది.

**7. మలేషియాలో తెలుగు యువకులకు సదస్సు.**
తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా వారు మలేషియా దేశంలో అక్కడి తెలుగు యువతకు ఆగస్టు 12, 13 తేదీల్లో యువజన శిబిరాన్ని నిర్వహించనున్నారు. మలేషియాలో ఐదు లక్షల తెలుగువారున్నారు. ఒకప్పుడు కూలీ పని చేసుకుంటూ, పొలం పని చేసుకుంటూ ఉండిపోయిన వీరు ఇప్పుడు స్వయం ఉపాధి వైపు, ప్రధాన వృత్తులవైపు మరలుతున్నారని, అయినా మూలాలు మర్చిపోకుండా తెలుగు భాష సంస్కృతుల కోసం కృషి చేస్తున్నారని నిర్వాహకులు అన్నారు.

**8. ఉర్దూలో పోటీపరీక్షల ప్రశ్ననిధిని రూపొందించిన విద్యావేత్త**
మొన్న తెలంగాణలో జరిగిన గ్రూప్ 1 పోటీపరీక్షల్లో ఉర్దూ మీడియంలో పరీక్షను రాసేందుకు 25,000 మంది అభ్యర్థులు ఎంపిక చేసుకోగా వారిలో కేవలం 38 మంది ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఇందుకు ఉర్దూలో తయారీ సామగ్రి లేకపోవడమే అని గుర్తించిన మొహమ్మద్ ఖాజా ఉర్దూలో 5000 ప్రశ్నల నిధిని రూపొందించి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ ప్రశ్ననిధిని రూపొందించేందుకు గూగుల్ ఉపకరణాలను ఉపయోగించి, మాటతో టైపింగ్ లాంటి సాంకేతికతలను వాడారు.

9. **తెలంగాణ రాష్ట్రంలో** 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు **తెలుగును బోర్డుపరీక్షగా రాయడం తప్పనిసరి** అని తెలుగు అమలు కమిటీ స్పష్టం చేసింది.



ఇద్దరిలో ఎవరు సిగ్గుపడాలో
తేల్చుకోండి మరి!
MINISTER FOR ENGLISH
రెండవ తరగతి పాఠాన్ని
పదవ తరగతి విద్యార్థి
చదవలేకపోడానికి
సిగ్గుపడాలి!
- హైకోర్టు
సరసి



తెలుక్కి దెబ్బ కొట్టాలంటే - పాత సినిమా
పాటలన్నింటినీ ఇంగ్లీషులోకి డబ్ చేసేసి
స్కూలు పిల్లలకి నేర్పించేద్దాం సార్!!
MINISTER FOR ENGLISH
పాత సినిమా
పాటల వల్లనే
తెలుగు వృద్ధి
సరసి

సంపుటి : 9 సంచిక: 6
**అమ్మనుడి**
ఆగష్టు 2023

సంపాదక హృదయం

# అన్ని చదువులూ అమ్మనుడిలోనే-ప్రధాని ప్రకటన

నూతన జాతీయవిద్యావిధానాన్ని ప్రవేశపెట్టి మూడేళ్లవుతున్న సందర్భంగా జులై 29 శనివారం నాడు ఢిల్లీ ప్రగతిమైదానంలో జరిగిన అఖిలభారతీయ శిక్షణా సమాగంలో ప్రధాని మోదీ ఒక అద్భుతమైన సంకల్పాన్ని వెల్లడించారు. మర్నాడు పత్రికల్లో ప్రముఖంగా ఆ వివరాలను చూసి భారతీయులంతా సంతోషించారు. ఇకపై చదువులన్నీ – సామాజిక శాస్త్రం నుంచి ఇంజినీరింగ్ వరకు బోధన అంతా భారతీయ భాషలలోనే జరుగనుంది అని సాక్షాత్తూ భారత ప్రధాని ప్రకటించారు. నూతన జాతీయ విద్యావిధానం ఇందుకు దోహదపడుతుందని ఆయన చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానంతో త్వరలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని కూడా ఆయన నమ్మపలికారు. సామాజిక న్యాయసాధన దిశగా దీనిని ఒక పెద్ద ముందడుగుగా ఆయన అభివర్ణించారు. బోధన అంతా మాతృభాషలోనే జరగడంవల్ల విద్యార్థులు విజ్ఞానాన్ని బాగా పొందగలుగుతారని, అందువల్ల ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారని వివరించారు. అమ్మనుడిలో చదువు సాగకపోవడం అనేది విద్యార్థికి జరుగుతున్న అన్యాయం.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయింది. ప్రజాస్వామ్యయుగంలో ఉన్నామని, మనవి ప్రజాసామ్య ప్రభుత్వాలని చెప్పుకొంటున్నాం. మనం భాషారాష్ట్రాలను ఏర్పాటు చేసుకొని ఏడెనిమిది దశాబ్దాలవుతున్నా ఈ లక్ష్యం దిశగా ఎంతవరకు ముందుకు సాగాం! కనీసం పాఠశాల విద్యలో తొలిఅడుగులు వెయ్యడంలో తడబడుతున్న పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ప్రాథమిక విద్యను కూడా అంగ్లంలో నేర్చుకొంటేనే అభివృద్ధికి పునాది పడుతుందనేంతగా ఎందుకు దిగజారిపోయాం? వేల ఏండ్ల చరిత్ర కలిగిన మన మాతృభాషను ఎందుకు తిరస్కరిస్తున్నాం? తెలుగు రాష్ట్రాలలోనే కాదు, ఏదో ఒక స్థాయిలో భారతదేశమంతా ఈ దౌర్భాగ్య పరిస్థితి వ్యాపిస్తున్నది.

ఇన్నేళ్లకైనా ఈ పరిస్థితిని గుర్తించి, పాలక భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానంతో ముందుకు వచ్చి, మాతృభాషలో విద్యాబోధనపై ఇంత బలంగా మాట్లాడినందుకు ప్రధాని మోదీని అభినందిద్దాం.

చెప్పదలచుకొన్న విషయాన్ని బలంగా ప్రతిభావంతంగా చెప్పడంలో మన ప్రధానికి సాటివచ్చేవారు తక్కువగా ఉంటారు. సమున్నత లక్ష్యాలను ప్రతిపాదించడంలోనూ, వాటి సాధనదిశగా తన వారిని నడిపించడంలోనూ ఆయనకున్న శక్తి శ్లాఘనీయం. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ– దేశవ్యాప్తంగా సామాజికశాస్త్రం నుంచి ఇంజనీరింగ్ వరకు బోధన ఇక మాతృభాషా మాధ్యమంలోనే జరుగనుందని ప్రకటించేశారు. సామర్థ్యాన్ని పట్టించుకోకుండా కేవలం ఆంగ్ల భాషలోనే విద్యార్థి ప్రతిభను అంచనా వేస్తున్నామని, ఇందువల్ల దేశంలోని యువతకు అన్యాయం చేస్తున్నామని, దీన్ని సరిదిద్దడానికే జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చామని ప్రకటించారు. మాతృభాషలో బోధనతోనే యువప్రతిభకు వాస్తవన్యాయం జరుగుతుందని కూడా ఆయన చెప్పారు.

అభివృద్ధి చెందిన చాలా దేశాలు తమ భాషలద్వారానే ప్రగతిని సాధించాయని, అందుకు ఐరోపా దేశాలను ఉదాహరణగా చెప్పారు. ఎక్కువ భాషలు ఉండడం వెనుకబాటుతనం కాదని, అది అభివృద్ధికి గుర్తు అని ఆయన అన్నారు. 'ఇంగ్లీషు రాకపోతే ఎంత ప్రతిభావంతుడినైనా తొందరగా స్వీకరించం. గ్రామీణ భారతంలోని ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు ఈ ధోరణితో నష్టపోయారు. జాతీయ విద్యావిధానంతో ఈ హీన భావనను తొలగించే ప్రయత్నం మొదలైంది' అని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

# సంపాదక హృదయం

మాతృభాషలో చదువులవల్ల లాభాలేమిటో మన పత్రికలో కొత్తగా మళ్లీ చెప్పుకోవలసిందేమీ లేదు. 'అమ్మనుడి' అంటేనే మాతృభాష. అమ్మనుడితోనే అందలం ఎక్కగలమన్నదే మన ధీమా. ఇది అక్షరాలా నిజం. ఐతే ప్రధాని మనకిచ్చిన భరోసాను పూర్తిగా నమ్మడానికి కొన్ని సందేహాలు అడ్డువస్తున్నాయి.

భాజపా ఒకేదేశం– ఒకే భాష అనే ఆలోచనాధారను పెంచిపోషించే పార్టీ. దేశంలోని భాషలన్నిటికీ మూలం సంస్కృతం అని నమ్మే మేధావుల నాయకత్వం వారిది. దేశంలోని ప్రజలందరూ ఒకే జాతి అనే ప్రగాఢ విశ్వాసం వారిది. జాతి వేరు, దేశం వేరు అనే మాటను వారు ఒప్పుకోరు. భాషను బట్టే జాతి అంటామని, భౌగోళిక ప్రాంతం, ప్రభుత్వ ఏర్పాటును బట్టి దేశం అంటామనే వాస్తవాన్ని వారు ఒప్పుకోరు. జాతుల మధ్య, భాషల మధ్య వైవిధ్యం పట్ల వారికి గౌరవం కన్పించదు. మత విశ్వాసాల వైవిధ్యాన్ని కూడా వారు పట్టించుకోరు. కనుకనే– మాతృభాషలో విద్యాబోధన, విజ్ఞాన వాహికలుగా మాతృభాషలకున్న శక్తిపైన వారి మాటలను, సంకల్పాన్ని శంకించవలసివస్తున్నది.

విద్యార్థి నేర్చుకునే 3 భాషల్లో కనీసం రెండు భాషలు భారతీయ భాషలై ఉండాలనడం ఆచరణలో హిందీ/సంస్కృతం ఆధిపత్యానికి, క్రమంగా జాతీయ భాషగా హిందీనో, సంస్కృతాన్నో ప్రకటించాలనే ఆలోచనకు దారితీస్తుందా అనే సందేహం– నిజమైన జాతీయవాదుల్లో కొందరికి కలుగుతున్నది.

మరొక సందేహం ఏమిటంటే– భాజపా నేతృత్వంలో వున్న ప్రభుత్వం పెట్టుబడిదారీవ్యవస్థలో మునిగి తేలుతున్నది. కార్పోరేట్లకు పూర్తిగా లొంగిపోయిన నిర్మాణం వారిది. ఆ పార్టీకి మాతృకగా చెప్పదగిన భారతీయ జనసంఘ్ ఆలోచనలకూ, వీరికీ చాలా తేడా ఉన్నది. దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన 'ఏకాత్మక మానవ వాదాన్ని' తుంగలోతొక్కి, ' గాంధేయ సోషలిజం' అనే అవకాశవాద సైద్ధాంతిక భావజాలాన్ని స్వీకరించిన పార్టీ భాజపా. వారు విశ్వసించిన లక్ష్యాల సాధనకై ఎంతటి రాజకీయసాహసానికైనా వెనుదీయని విధానాలు వారివి. కనుక– ఇప్పుడు ప్రధానమంత్రి మోదీ ప్రకటించిన అద్భుతలక్ష్యసాధన ఎంతవరకు సుసాధ్యం అవుతుందో అనే సందేహం కలుగుతోంది. చిత్తశుద్ధితో ఆలోచించేవారిని, 'దేశమంటే మనుష్యులు' అనే ప్రాతిపదికన ఆలోచించేవారిని ఈ సందేహాలు బాధిస్తున్నాయి. మోదీ చెప్పినదంతా ఆచరణలో కార్యరూపం ధరించాలని, మాతృభాషలు ఆయా ప్రజాసమూహాల/జాతుల భవిష్యత్తుకు హామీగా నిలబడేట్లు మన ప్రభుత్వాలు కృషిచేస్తాయని ఆశిద్దాం.

చివరగా రెండు విన్నపాలు/హెచ్చరికలు చేయదలచాం.

ఒకటి– సామాజిక శాస్త్రంనుండి ఇంజనీరింగ్ వరకు అమ్మనుడిలోనే చదువుకోవాలన్నా, కలామ్ వంటి గొప్ప శాస్త్రజ్ఞుడిగానో, మోదీ వలె దేశ ప్రధానిగానో ఎదగాలన్నా ముందు తన పాఠశాల విద్యలో పునాది గట్టిగా పడాలి. తన భాషపై గట్టిగా పట్టును సాధిస్తే దేశీయ భాషలనయినా, విదేశీభాషలనయినా ఎన్నిటినైనా ఒక పట్టుపట్టవచ్చు. అటువంటి కీలకమైన పాఠశాల విద్యను కార్పోరేట్ల నుండి పూర్తిగా విముక్తిచేయండి. పాఠశాల విద్యను పూర్తిగా ప్రభుత్వ నిర్వహణలోనికే తీసుకొని రండి. పటిష్టంగా, ఆదర్శంగా బాధ్యతతో నడపండి. పేదవారైనా ధనికులైనా అందరికీ సమానమైన విద్యను సమాన స్థాయిలో అందించండి. విద్యాహక్కు చట్టం లక్ష్యాలను నూరు శాతం సాధించండి.

రెండు– రాజకీయరంగంలో ఉన్నవారు– ముఖ్యంగా నిర్ణయాలు చేసే అధికార హోదాల్లో ఉన్నవారు ఏ నిర్ణయం తీసుకోవలసివచ్చినా, అది రాజకీయంగా ప్రభుత్వానికి, పార్టీకి, లేదా తమ రాజకీయ భవిష్యత్తుకు ఏ విధంగా ఉపకరిస్తుంది అనే ఆలోచిస్తారు అని రాజకీయ అధికారవ్యవస్థలో ఉన్న నా మిత్రుడొకరు ఒక సందర్భంలో చెప్పారు. దీనినే ఒక్కమాటలో–'రాజకీయం' చెయ్యడం అంటారు. అయితే దేశప్రజల భవిష్యత్తుకు సంబంధించిన విషయాల్లో ఇటువంటి ఆలోచన తగదు. మోదీగారి ప్రసంగంలో 'భాషా రాజకీయాల దుకాణాలను ఇక మూసివేసుకోవచ్చు' అని తమిళనాడులోని భాషారాజకీయ నేతలను హెచ్చరించారు. ఇదే విధమైన హెచ్చరిక తమకు కూడా వర్తిస్తుంది కదా!

తేదీ:1 అగస్టు 2023

సామల రమేష్ బాబు

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# తెలుగు భాష డాక్యుమెంటేషన్

## (డాక్యుమెంటేషన్ = ఆనవాలువు/పత్రీకరణ)

ఐక్యరాజ్యసమితి విద్యా, విజ్ఞాన (శాస్త్రీయ) మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో) వారు ప్రపంచంలోని ప్రమాదంలో ఉన్న భాషల గురించిన గణాంకాలను నివేదిస్తూ ఒక పుస్తకాన్ని 1996లో మొదటిసారిగా ప్రచురించారు. ఆ రోజుల్లో ఆ పుస్తకాన్ని రెడ్ బుక్ ఆఫ్ ఎండేంజర్డ్ లాంగ్వేజెస్(ప్రమాదంలో ఉన్న భాషల ఎర్ర పుస్తకం) పేరుతో ప్రచురించారు. తాజాకరించిన పుస్తకాన్ని వెలువరిస్తూ, పేరును అట్లాస్ ఆఫ్ వరల్డ్ లాంగ్వేజెస్ ఇన్ డేంజర్ అని వెలువరించారు. ఆ రెండవ పుస్తకంతోపాటుగా వెబ్ లో వీక్షించేందుకు పటంపై ప్రాంతాల ఆధారంగా భాషల స్థితిగతులను తెలిపే ఒక వనరును వలగూడు ద్వారా పరిచయం చేసారు. అలాగే భాషలు ప్రమాదస్థాయికి చేరుకునే లక్షణాలపై విస్తృతంగా చర్చిస్తూ, ప్రమాదంలో ఉన్న భాషలను కాపాడుకునే విధానాలను సమాధానంగా ఇస్తూ చాలా ప్రచురణలు వెలువరించారు. వీటన్నిటిలోనూ ఎక్కడా తెలుగు భాష ప్రమాదంలో ఉందని మనకు అనిపించదు. కానీ ఒక విషయంలో మాత్రం తెలుగు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. ఇంకా ముఖ్యమైన విషయమేమిటంటే ఈ విషయంలో యుద్ధప్రాతిపదికన తెలుగు భాషలో కృషి జరగకపోతే తెలుగు భాష నిజంగానే కనుమరుగవుతుంది. ఈ కృషి ఒకరితో, ఇద్దరితో లేదా ఒక విశ్వవిద్యాలయంతోనో, ఒక రాష్ట్ర ప్రభుత్వంతోనో సాధ్యమయ్యే పని కాదు. కొన్ని తరాల పాటు భాష మనుగడను దృష్టిలో పెట్టుకుని, భాష మనుగడలోనే మన మనుగడ అని స్పృహ తెచ్చుకుని తెలుగుజాతి మొత్తం కలిసి పూర్తి కృషి చేసినా పూర్తి స్థాయిలో ఈ పనిని చేయలేం. అదే తెలుగు భాష అనవాలువు (Telugu Language Documentation).

అనవాలువు అంటే మామూలు అర్థంలో ఒక విషయాన్ని నిర్దిష్ట పద్ధతిలో దాచిపెట్టడం. మరి భాష విషయంలోఅనవాలువు అంటే? భాషా అనవాలువు శాస్త్రం భాషాశాస్త్రంలో ఒక ఉపవిభాగం. మానవభాషల మరియు ఆయా భాషల వ్యాకరణాల వాడుకను వివరిస్తూ భాషలను నిక్షిప్తం చేయడం, అలానే ఒక భాషను మాట్లాడే సముదాయపు భాషాపరమైన పద్ధతులను సమగ్రమైన లిఖితరూపంలో తయారు చేయడం ఈ శాస్త్రం లక్ష్యం. ఈ విధంగా చేయడం ద్వారా భాషా సముదాయంలో రాబోయే తరాలకు రాతరూపంలో భాషను అందిస్తూనే భాషా పరిపుష్టిని కూడా సాధించవచ్చు. అయితే ఈ లిఖితరూపం అందరికీ అందుబాటులో ఉండవచ్చు లేదా గోప్యంగా కొందరికి మాత్రమే అందుబాటులో ఉండవచ్చు.

అనవాలువు అంటే? – ఏదైనా అవసరమైన విషయాలను రాతలో భద్రపరచటాన్ని నిక్షిప్తీకరణ అంటారు. ఉదాహరణకు ఫ్రిజ్ లాంటి యంత్రాన్ని నడిపి, చూసుకునే విధానాన్ని చెప్పే మాన్యువల్ డాక్యుమెంట్. లేదా ఒక రోగి గురించిన ప్రస్తుత ఆరోగ్య స్థితి, గతంలో రోగికి ఎదురైన ఆరోగ్య సమస్యలు, వాడిన వైద్యం వగైరా విషయాలు తెలిపే పేషంట్ హెల్త్ రికార్డ్ డాక్యుమెంట్.

భాష అనవాలువు అంటే? – భాష నిక్షిప్తీకరణ ఒక భాష యొక్క మొత్తం స్వరూపాన్ని వివరిస్తుంది. ఇందులో భాష వాడుక, భాష వ్యాకరణం తప్పకుండా ఉండాలి. ఒక భాషను మాట్లాడే సముదాయం వివిధ ప్రాంతాల్లో, వివిధ సందర్భాల్లో సంభాషణల్లో జరిపే భాషా విశేషాలను, వైరుధ్యాలను కూలంకషంగా వివరిస్తూ రాసుకోవడమే అనవాలువు,

భాష అనవాలువులో ముఖ్యంగా భాషలోని పద్ధతులను, పదజాలాన్ని, సాంస్కృతిక నేపథ్యాన్ని సమగ్రంగా ఒక ప్రణాళికతో సేకరించి, సేకరించిన ప్రతి అంశానికి వివరణలు రాసుకొని. ఈ సేకరించిన అంశాలు, వాటి వివరణలను విశ్లేషిస్తూ రాసుకుంటూ పోవాలి.

చాలా విశ్వవిద్యాలయాల్లో భాషాశాస్త్ర విద్యార్థులు ఆ భాషలోని పదాలకు ఆంగ్లంలో అర్థాలు రాసేసుకుంటే, వ్యాకరణ సూత్రాల విశ్లేషణ ఆంగ్లంలోకి తర్జుమా చేస్తూ భాషలోని వాక్యాలను అనువాదం చేసేస్తే అనవాలువు అనుకుంటారు కానీ అది అనవాలువు కాదు.

భవిష్యత్తులో పరిశోధనలకు ఉపయోగపడేలా భాష అనవాలువు పని చేయాలి. ఒకవేళ భాష ప్రమాదస్థాయికి చేరుకుంటే తిరిగి బ్రతికించుకునేలా అనవాలువు జరగాలి. ఎప్పటికైనా తిరిగి మొత్తం భాషను పునరుద్ధరించుకునేలా అనవాలువు జరగాలి.

**అనవాలువు (డాక్యుమెంటేషన్) జరిగితే భాషకు ఒరిగేదేమిటి?**

అనవాలువు అనేది ఒక ప్రాంతానికో, కాలానికో లేదా ఒక రంగానికో పరిమితమైన భాషను నిక్షిప్తీకరించడం మాత్రమే కాదు. అక్కడితో సరిపోదు. అన్ని ప్రాంతాలకు, అన్ని కాలాలకు, అన్ని రంగాలకు సంబంధించిన సమస్త పదజాలం, భాషా స్వరూపం, వాడుక, హావభావాలననుసరించి మాటలో వచ్చే మార్పులు, పరుషంగా మాట్లాడినప్పుడు వచ్చే మాటలు, వినయంగా మాట్లాడినపుడు వచ్చే మాటలు, భాషలోని బూతు మాటలు, యువకులు వాడే క్రోడీకరించిన మాటలు, ఊతపదాలు, కులాలకు విశేషించిన మాటలు, కులవృత్తిలో వాడే మాటలు, పాటలు సమస్తం సమగ్రంగా అనవాలువీకరించాలి.

అనవాలువు ద్వారా భాషలోని వైవిధ్యాన్ని, యాసలను, మాండలికాలను, సాంస్కృతిక దృక్కోణాలను కనుమరుగు కాకుండా ఆపవచ్చు.

అనవాలువు భాషలోని వనరులు అందరికీ అందుబాటులో ఉండటం వలన ఒకానొక భవిష్యత్తు సందర్భంలో పాడుకునే పాటలో, జరుపుకునే పండగో ఆ సముదాయానికి పూర్తిగా అవగాహన లేనపుడు ఆయా వనరులను తిరిగి చూసుకొని నేర్చుకుని జరుపుకోవచ్చు. లేదా

ఒక పదం ఒక కాలంలో ఒక విధానంలో వాడి ఉంటే, అదే విధానంలో ప్రస్తుత ప్రపంచ భాషల్లో వేరే భాషలో అదే విధానంలో వాడితే, ఈ రెండు భాషా సముదాయాల సంబంధాలపై అధ్యయనం సులువవుతుంది. ఎందుకంటే ఆ కాలంలో ఆ రెండు భాషల సముదాయాలు సంపర్కంలోకి వచ్చి ఉండవచ్చు. ఇలా భాష సత్తువను నిలుపుకోవటంలో భాష అనవాలువు సహాయ పడుతుంది. భాషను తిరిగి తాజా పరుచుకోవటానికి, ఉనికి కోల్పోయిన సముదాయాల్లో తిరిగి ఉనికిని సంతరించుకోవటానికి, భాషా సముదాయాల సాంస్కృతిక వారసత్వాన్ని, అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు కావాల్సిన ఉపకరణాలను భాష అనవాలువు అందిస్తుంది.

భాష పరిశోధనలో కొత్త పరిశోధనాంశాలను అందించడంతో పాటుగా భాష విశ్లేషణ వలన ఇతర భాషలతో తులనాత్మక పరిశీలన, అధ్యయనానికి తద్వారా భాషా వికాసానికి తోడ్పడుతుంది.

**భాష డాక్యుమెంటేషన్ జరగకపోతే?**

అనవాలువు జరగని పక్షంలో భాషలు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఒక్కో భాషలో ప్రపంచాన్ని చూసే అనుభవించే విశిష్ట దృక్కోణం ఉంటుంది. ఒక ప్రాంతంలో నివసించే గిరిజనులకు వారి ప్రాంతంలో దొరికే ఔషధాల గురించి అవగాహన ఉంటుంది, ఆ ప్రాంతంలో ఉండే విషప్రాణుల గురించిన విశేషాలూ తెలుస్తాయి. ఆ భాష అనవాలువు జరిగితే భాష తెలీని వారు ఆ ప్రాంతానికి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. అదే భాష అనవాలువు జరగని పక్షంలో ఆ గిరిజనులు వలసవెళిపోతే ఆ వారు కొత్త ప్రాంతంలోని పెద్ద భాషలను నేర్చుకుంటారు. వారి భాషను మర్చిపోతారు. తిరిగి తమ ప్రాంతాలకు వచ్చిన ఆ కొత్తగా నేర్చిన భాషా పదజాలంలో వీరి నడవడిక గురించి పదాలు లేకపోతే ఆయా అంశాల గురించిన జ్ఞానాన్ని ఆ సముదాయం వారు కోల్పోతారు. వారే కాదు, మొత్తం ప్రపంచమే ఆ సాంస్కృతిక వారసత్వాన్ని కోల్పోతుంది.

అనవాలువు జరగని భాషల్లో బోధనాసామగ్రిని రూపొందించడం, చదువులు చెప్పడం కష్టమవుతుంది. చదువుల కోసం వేరే పెద్ద భాషను ఆశ్రయించాలి. అలా జరిగితే తమకు తెలీని భాషలో విద్యార్థులు చదువుకుంటారు. ఇది వారి మానసిక వికాసానికి, అవగాహనాశక్తికి అడ్డుకట్ట అయి ఆ విద్యార్థులు నిష్ప్రయోజకులు అవుతారు. మెల్లిగా ఆ భాష కుంటుపడుతుంది, తరువాతి కాలంలో కనుమరుగైపోతుంది. అంటే ఆ భాష సంస్కృతి నాశనమైపోతుంది. అందువలన భాష అనవాలువు చాలా ముఖ్యం. అయితే ఈ భాష అనవాలువు విధానం ఏమిటి?

ఇది మూడు మెట్లలో ఉంటుంది.

మొదటి మెట్టు : సమాచార సేకరణ

రెండవ మెట్టు : సేకరించిన సమాచారానికి వివరణలు రాస్తూ, విశ్లేషించుకోవడం.

మూడవ మెట్టు : సేకరించిన సమాచారాన్ని, ఆ సమాచారంపై రాసుకున్న వివరణలను, విశ్లేషణలను భద్రపరిచి అందరికీ అందుబాటులోకి తేవడం.

సమాచార సేకరణ అంటే భాషలోని ప్రతి అంశాన్ని సేకరించాలి – మాటలను, పలికే విధానాలను, వాటి వెనుక ఉన్న వ్యాకరణ సూత్రాలను వగైరా. మాట్లాడే వ్యక్తిని బట్టి, ప్రాంతాన్ని బట్టి, కాలాన్ని బట్టి, కులాన్ని బట్టి ఈ మాటలో మార్పులుంటాయి. అవన్నీ కూడా సేకరించాలి. ఆడియో రూపంలో, వీడియో రూపంలో, రాతరూపంలో, పాఠ్యాంశాల రూపంలో సేకరించాలి. నిఘంటువులను, వ్యాకరణాలను, పదజాలాన్ని తెలిపే కథలను, నవలలను, కవితలను అన్నీ సేకరించాలి.

సేకరించిన సమాచారంలోని మాటలలో భాషాపరమైన, వ్యాకరణపరమైన, పదాలపరమైన తీరులను, సంగతులను గుర్తించి వివరణలు రాసుకోవాలి. ఈ వివరణల ఆధారంగా విశ్లేషణలు రాయాలి. ఇక చివరగా పేరొందిన ఆర్కైవుల్లో సమాచారనిధులలో సేకరించిన, వివరించిన, విశ్లేషించిన భాషా సమాచారాన్ని భద్రపరిచి అందరికీ అందుబాటులో ఉంచాలి.

తెలుగు భాష సందర్భంలో భాష అనవాలువు ఎప్పటినుంచో జరుగుతూనే ఉంది.

11వ శతాబ్దిలో ఆదికవి నన్నయ్య రాసిన ఆంధ్రశబ్ద చింతామణి తెలుగు పదాలను, వ్యాకరణాన్ని వివరిస్తూ సంస్కృతంలో రాసిన విశ్లేషణ. నన్నయ్య చెప్పిన అభిప్రాయాలను, ఆలోచనలను కొన్నిటిని తీసుకొని, 19వ శతాబ్దిలో పరవస్తు చిన్నయసూరి సంస్కృతభూయిష్ట తెలుగులో వ్యాకరణాలు రాస్తే, బ్రౌన్ దొర తెలుగు సంభాషణలను, వాణిజ్య పదాలను, వ్యాకరణాలను సేకరించి ప్రచురించారు. ఈ విషయంలో బ్రౌన్ దొర చేసిన విస్తృత స్థాయి పని తెలుగులో ప్రతి ఏడాది జరగాలి. ఈ కింది వనరులు తెలుగులో త్వరిత గతిన మనం తయారు చేసుకోవాలి, అలానే ఎప్పటికప్పుడు కనీసం ఏడాదికొకసారి తాజాపరచుకోవాలి:

1. లెక్సికల్ వనరులు – మనుషులు కంప్యూటర్లు ఏకకాలంలో చదవగలిగే నిఘంటువులు.

2. లింగ్విస్టిక్ కార్పొరా (పదనిధి)– తెలుగు భాషా పదాల, మాటల, వాక్యాల, కథల, పాటల రాతరూపంలో కంప్యూటరులో నిక్షిప్తం చేసిన కార్పస్ నిధి.

3. భాషాపరమైన డేటాబేస్‌లు – తెలుగు భాషలోని పదనిధులను, మిగతా ప్రపంచ భాషలతో పొంతన చేసిన అనుసంధానిత సమాచారం.

4. లింగ్విస్టిక్ అన్నోటేటర్లు – ఒక మాట, సన్నివేశంలో భాషాపరంగా ఉన్న అన్ని వివరాలను ఒక పైపొరగా వెనుకతలంలో నిక్షిప్తం చేసే ఉపకరణాలు.

5. పై సమాచారాన్ని వెతికి తెచ్చిపెట్టే ఉపకరణాలు.

6. భాషపైన పరి–సమాచారం(మెటాడేటా) తయారు చేసే ఉపకరణాలు. ఈ ఉపకరణాలలో కొన్నిటికి ఎవరైనా వ్యక్తి కూర్చొని పనిచేయాల్సి ఉంటుంది. కొన్ని ఉపకరణాలు మానవప్రమేయం లేకుండా తమంతట తామే ఈ మెటాడేటాను తయారు చేసేస్తాయి. కొన్ని ఉపకరణాలలో కాస్త మానవశ్రమ, కాస్త మషిన్ల పని కలిపి ఉంటుంది.

ఇవి కాక సాంకేతికంగా భాషాశాస్త్రపరమైన ఈ కింది వనరులు కూడా తెలుగులో ఎప్పటికప్పుడు తయారుచేసి తాజాపరుస్తూ ఉండాలి:

1. ఉచ్చారణ నిఘంటువులు – తెలుగులో పదాలను పలికే విధానాన్ని వివరించే నిఘంటువులు.

2. ఫోనాలజీ నిఘంటువులు – తెలుగులో శబ్దాల వ్యవస్థ వాటిని పలికే విధానాలను వివరించే నిఘంటువులు.

3. మార్ఫాలజీ నిఘంటువులు – పదాల అంతరంగిక నిర్మితిని తెలిపే నిఘంటువులు.

4. వాక్యవిన్యాస నిఘంటువులు – భాషలో మాటల్లో, వాక్యాల్లో వచ్చే పదాల అమరికను తెలిపే నిఘంటువులు.

5. శబ్దార్థశాస్త్ర నిఘంటువులు – భాషలో వాక్యాల్లో మాటల అమరికను బట్టి వచ్చే అర్థంలో మార్పులను తెలిపే నిఘంటువులు.

6. చారిత్రక నిఘంటువులు – భాషలో చారిత్రకంగా ఉన్న పదాల, వ్యాకరణ సూత్రాల సామ్యతను గుర్తిస్తూ పదాల రచనను, పదజాలాన్ని, వాక్యవిన్యాసాన్ని అధ్యయనం చేసే నిఘంటువులు.

7. సంకేతప్రయోగ నిఘంటువులు – భాషను మాట్లాడే వివిధ సముదాయాలు భాషను ఎలా వాడుకుంటున్నాయి అని తెలిపే నిఘంటువులు.

8. వ్యావహారిక నిఘంటువులు – జనం సాధారణంగా మాట్లాడే మాటల నిఘంటువులు.

9. శైలీ నిఘంటువులు – భాషలోని పదాలు సందర్భానుసారం శైలిని మార్చుకుంటాయి. ఈ వివిధ శైలులను అనవాలువు చేసే నిఘంటువులు.

10. సామెతల, ఊతపదాల నిఘంటువులు.

భాష నిక్షిప్తీకరణకు పైన నిర్దేశించిన పద్ధతి ఒక ప్రతిపాదన మాత్రమే. మనకున్న పరిధుల వలన, సాంకేతిక సాధ్యాసాధ్యాల వలన అనవాలువు పద్ధతిని మార్చుకొని చేసుకోవాలి. కానీ, అదంతా ఒక ప్రణాళిక రూపొందించుకొని ఆ ప్రణాళికాబద్ధంగా జరగాలి. తరువాతి పరిశోధకులు ముందు జరిగిన ప్రణాళికను చూసుకొని తమ మార్పులు చేసుకొని కొత్త ప్రణాళిక రూపొందించుకునేందుకు ఇది సహాయపడుతుంది. పైన నేను తెలుగుకు అనవాలువుకు ఆంగ్లాన్ని వెనుతల భాషగా వాడటాన్ని తప్పని అభిప్రాయపడ్డాను. ఎందుకనేది ఒక ఉదాహరణతో చెప్పుకుందాం. తెలుగులో దూడ అని అనగానే ఆ పదం ఆవు లేదా గేదె/బర్రె పిల్ల అని తెలుస్తుందా. ఆంగ్లం వెనుతలంలో ఉన్నపుడు ఆ పదం calf అని వ్యవహరింపబడుతుంది. తమిళంలోని ఒక కావ్యంలో గుర్రపుపిల్ల అనే పదం వాడారు కానీ వెనుతలంలో ఆంగ్లం ఉంటే తెలుగులో ఆ సందర్భం గుర్రపుపిల్ల అని కాకుండా ఆవుపిల్ల/బర్రెపిల్ల అనే పెడర్థం వచ్చే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఆంగ్లంలో calf అంటే గుర్రపుపిల్ల కూడా. అందుకని బహుభాషా అనుసంధానిత నిఘంటువులు ఉంటే తప్ప ఇలాంటి అపోహలు, అపార్థాలు, అయోమయాలు అధిగమించలేము.

భాష నిక్షిప్తీకరణలో పాల్గొనే పరిశోధకులు సాధారణంగా క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పని చేయాల్సి ఉంటుంది. పూర్తి అపరిచితులను వీడియోలు తీయడం, వారి ఆడియోలు రికార్డ్ చేయటం చేయాలి. ఇది ఆ వ్యక్తుల వ్యక్తిగత క్షేత్రంలోకి చొరబాటుగా ఈ రోజుల్లో పరిగణించబడుతుంది. అందుకని పరిశోధనలో పాల్గొనే ఔత్సాహికుల నుంచి తగిన అనుమతి పొందిన తర్వాతే వారిని పరిశోధనలోకి తీసుకోవాలి. ఔత్సాహికుల వ్యక్తిగత విషయాలు కాకుండా భాషాపరమైన సంగతులు సేకరించే వైపు ఎక్కువ శ్రమ ఒనర్చాలి. సేకరించిన సమాచారాన్ని ఎలాంటి రూపంలో కంప్యూటరులో నిక్షిప్తం చేయాలోనన్న విషయమై వివిధ ప్రపంచ సంస్థలు వారి వారి ప్రమాణాలను ప్రచురించాయి. ఆ ప్రమాణాలలో సందర్భానుసారం ఏది పనికొస్తుందో ప్రణాళికా స్థాయిలోనే నిర్ణయం తీసుకొని అనుసరించాలి. ఇందుకు ఖర్చులు, పనిచేసే క్షేత్రంలోని పరిమితులు దృష్టిలో ఉంచుకోవాలి. కుదిరినంత అత్యధిక నాణ్యతతో రికార్డింగ్ చేయాలి. మనం రికార్డ్ చేసే పరికరం ఇవ్వగలిగిన అత్యధిక నాణ్యతను ఇందుకు ఎంచుకోవాలి. రికార్డింగ్ చేసే ఉపకరణాల పనితనాన్ని పూర్తిగా ముందే పరీక్షించుకోవాలి. వెనుతలంలో వినిపించే శబ్దాలను కలిపేసి రికార్డ్ చేసే పరికరాలకన్నా, స్పష్టంగా వెనుతల శబ్దాలను తీసివేసి రికార్డ్ చేయగలిగే పరికరాలను ఉపయోగించటం మేలు. ఎక్కువ నాణ్యతతో కుదుపులతో వీడియో రికార్డ్ చేసేకన్నా కుదుపులు కదుపులు లేకుండా చిన్నపాటి ట్రైపాడ్ స్టాండ్ తో మొబైల్ నుంచి రికార్డ్ చేసిన వీడియో మెరుగుగా వస్తుంది. రెండవదే ఆచరణీయం.

రికార్డ్ చేసిన వీడియోలో మాట్లాడే మాటలను పాఠ్యరూపంలో రాసుకోవటం ఒక పొర. వీడియోలో కనిపించే సన్నివేశాన్ని వివరిస్తూ రాసే పాఠ్యం రెండో పొర. మాట్లాడుతున్న వ్యక్తుల హావభావాలను, సందర్భాన్ని పాఠ్యంలో రాసే మూడోపొర. ఇలా ఒకే వీడియోకి ఎన్నైనా పాఠ్యపు వివరణలు రాసుకోవాలి. కనీసం పై మూడు.

పాఠ్యరూపంలో వచ్చిన పదాలను వివరణలు రాసుకుంటూ విశ్లేషించడం తరువాతి పని. మాటను పాఠ్యంగా మార్చుకునేందుకు మనకు నేడు సాఫ్టువేరులున్నాయి, అవి మనిషి ప్రమేయం లేకుండా చేసేస్తాయి. వీడియో సన్నివేశంలో ఉన్న వస్తువులను, వెనుతలాన్ని గుర్తుపట్టగలిగే సాఫ్టువేర్లున్నాయి, మనుషులు మాట్లాడుతుంటే వారి హావభావాలను గుర్తించే సాఫ్టువేర్లు కూడా, అయినా కొన్ని విషయాలను ఒక వ్యక్తి సాఫ్టువేర్ల ప్రమేయం లేకుండా చేయాల్సిందే.

ముందు చెప్పుకున్నట్టు సమాచార సేకరణ, వివరణ, విశ్లేషణ జరిగాక ఆ పూర్తి సమాచారాన్ని ఆర్కైవ్ చేసుకోవాలి. ఆ ఆర్కైవును కచ్చితంగా డిజిటల్ రూపంలోకి మార్చి భద్రపరచాలి.

ఎన్నో విశ్వవిద్యాలయాలలో భాషా వనరులు ఎన్నో డిజిటల్ కాని రూపంలో భద్రపరిచి ఉన్నాయి. వాటన్నిటినీ సేకరించి డిజిటీకరించడం కూడా ఒక మహాయజ్ఞమే. కాలం జారిపోకముందే ఈ డిజిటల్ కాని రూపంలో భద్రపరిచిన ఆర్కైవులను డిజిటల్ చేయాలి, లేదంటే వాటిని నష్టపోతాము.

పత్రీకరించిన వనరులను వెనువెంటనే బోధనకు ఉపయోగించడం ద్వారా అనవాలువు ప్రభావవంతంగా జరిగిందో లేదో పరీక్షించవచ్చు. సంస్కృతిని, వారసత్వాన్ని అర్థం చేసుకునేందుకు అనవాలువీకృత భాషా వనరులను వాడాలి.

2021లో డ్రీమింగ్ ఆఫ్ వర్డ్స్ పేరుతో ఒక చలనచిత్రం వచ్చింది. ఇది ఒక భాషాఅనవాలువుకు సంబంధించిన కథ. నాలుగవ తరగతిలో బడి మానేసిన శ్రీధరన్ ఎలా 25 ఏళ్ళ పాటు ఐదు దక్షిణభారత రాష్ట్రాలలో తిరుగుతూ మలయాళం, తెలుగు, తమిళం, కన్నడం భాషల నాలుగు భాషల నిఘంటువు రూపొందించాడో చెప్పే సినిమా. భాష అనవాలువు గురించిన ప్రాముఖ్యతను ఈ చలనచిత్రం ద్వారా తెలుసుకోవచ్చు.

**మిగతా 16వ పేజీలో...**

పరిశోధన పత్రం

మల్లిపూడి రవిచంద్ర
సెల్: 9573449282

# ప్రాచీన సాహిత్యం : భాషాధ్యయన దృక్పథం

**సంక్షిప్తి**

తెలుగుప్రాచీన సాహిత్యాన్ని ఎటువంటి దృష్టితో అధ్యయనం చేస్తే ప్రస్తుతం సమాజానికి ఎక్కువ ప్రయోజనకరం? ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంలోని భాషపై అధునిక భాషాశాస్త్ర దృక్పథంతో పరిశోధన ఎలా చేయాలి? అలా చేస్తే కలిగే ప్రయోజనాలు ఏంటి? అనే విషయాలను ప్రస్తావించడం ఈ పత్రం యొక్క ప్రధానోద్దేశ్యం.

## 1. పరిచయం

తెలుగులో ప్రాచీన సాహిత్యం అనగానే పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలు… ఇలా అనేక ప్రక్రియలు మనకు స్ఫురణకు వస్తాయి. ఇవన్నీ కూడా తెలుగుసాహిత్యానికి పట్టుకొమ్మల్లాంటివి. ప్రాచీన సాహిత్యంపై తెలుగులో చాలా పరిశోధనలు జరిగాయి. ఇప్పటికీ కొన్ని జరుగుతున్నాయి. కానీ అందులో ఇంకా నిగ్గు తేల్చాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. పైగా సామాజిక శాస్త్రాల (Social Science) సాంకేతిక శాస్త్రాల (Technology) దృష్టి కోణం నుంచి పరిశోధించవలసిన అవసరం ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఇటువంటి తరుణంలో మునుపటికంటే పరిశోధనలు పెరగవలసినది పోయి నానాటికీ తగ్గిపోతున్నాయి. దానికి నేటితరం పరిశోధకులకు ప్రాచీన సాహిత్యం పట్ల అవగాహన కొరవడడం, ఆసక్తి సన్నగిల్లడం, ప్రాచీన సాహిత్యం అంటే పనికి రాని సాహిత్యం అనే భావన పాతుకుపోవడం కారణాలుగా కనిపిస్తాయి.ఎంత అధునాతన సాహిత్యమైనా కొన్ని తరాలు గడిచేనాటికి ప్రాచీనం కాక మానదు. అలాగే ఏ సాహిత్యంలోనైనా సార్వకాలికమైన విషయాలు ఉండక మానవు. అలా లేనప్పుడు అది సాహిత్యం అనిపించుకోదు. ప్రాచీన సాహిత్యంలో ఎన్నో విషయాలు నేటి సమాజానికి పనికి వచ్చేవి ఉన్నాయి. ఆ దృష్టితో పరిశోధన చేయాల్సిన బాధ్యత నేటితరం పరిశోధకులపై ఉంది. పైగా శాస్త్ర సాంకేతికరంగాలలో అభివృద్ధి చెందుతున్న కాలంలో ఆ కోణం నుంచి పరిశోధన చేయటం మూలంగా కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ.

## 2. ప్రాచీనసాహిత్యం: భాషాధ్యయనం

ప్రాచీన సాహిత్యంపై జరిగిన పరిశోధనలన్నీ దాదాపుసాహిత్య స్పృహతో జరిగినవే. భాషపై జరిగిన పరిశోధనలు చాలా తక్కువ.సాహిత్య స్పృహతో జరిగిన పరిశోధనల కన్నా, భాషపై జరిగిన పరిశోధనల వల్ల కలిగేప్రయోజనాలు నేరుగా తెలుగుభాషాసాహిత్యాలకు ఉపయోగపడతాయి. దానికితోడు ఆధునిక భాషాశాస్త్ర దృక్పథాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్నికూడా జోడించగలిగే మెరుగైన ఫలితాలను సాధించవచ్చు. ప్రాచీన సాహిత్యాన్ని భాషాశాస్త్రదృష్టితో పరిశోధన చేసేవాళ్ళు ఈకింది మార్గాలలో పరిశోధన చేస్తే భాషకు ఎక్కువ మేలు చేసినవాళ్ళవుతారు.

2.1వర్ణనాత్మక వ్యాకరణాలు (Descriptive Grammars)

ప్రాచీన కావ్యాలన్నిటికీ (వీలైతే ప్రతి కవి ఒక్కొక్క రచనకు లేదా రచనలన్నిటికీ) ఆధునిక భాషాశాస్త్ర దృష్టితో వర్ణనాత్మక వ్యాకరణాలు రాయాలి. వర్ణనాత్మక వ్యాకరణం అంటే– భాష ప్రవర్తిల్లే వివిధ స్థాయిలను (వర్ణ, పద, వాక్య, అర్థ) అధ్యయనం చేయటం. ఇలా అధ్యయనం చేయటం మూలంగా ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించిన భాషాప్రయోగ రీతిని శాస్త్రీయపద్ధతిలో నిరూపించవచ్చు. తరువాత అలా తయారు చేసిన ఒకే కవికి చెందిన రెండు వేరువేరు రచనలవ్యాకరణాలను గానీ, ఒకే కాలానికి చెందిన ఇద్దరు కవుల రచనల వ్యాకరణాలనుగానీ లేదా రెండు వేరువేరు కాలాలకు చెందిన కవుల రచనలకు సంబంధించిన వ్యాకరణాలనుగానీ తులనాత్మక అధ్యయనం (Comparative Study/Grammar) చేయవచ్చు. దాని మూలంగా భాషలో కలిగిన మార్పులను, భాషా క్రమ వికాసాన్ని గుర్తించడ సులభం అవుతుంది. అంతే కాకుండా ఇలాంటి వర్ణనాత్మక వ్యాకరణాలన్నిటి సహాయంతో తెలుగు భాషకు ఒక గొప్ప చారిత్రక వ్యాకరణాన్ని (Historical Grammar) తయారు చేయవచ్చు. తెలుగుభాషకు సమగ్రమైన భాషాచరిత్రను కూడా అందించవచ్చు.

ఇప్పటి వరకూ ప్రాచీన కావ్యాలపై భాషాపరిశోధనలు చాలా జరిగాయి. కానీ, వర్ణనాత్మక వ్యాకరణాలు సమగ్రంగా రాసింది చాలా తక్కువమంది. కె. నాగభూషణరావుగారు నన్నయ భాషకు (1965), ఎల్. బి. శంకరరావుగారు నన్నెచోడుని కుమారసంభవానికి (1967), పి. ఎల్. శ్రీనివాసరెడ్డిగారు శ్రీనాథుని భాషకు (ఆంగ్లం– 1977), నేతి అనంత రామశాస్త్రిగారు శ్రీనాథుని భాషకు (1978), ఆదెప్పగారు పోతన భాగవతానికి (1985), పి.శశికళగారు నాచన సోముని ఉత్తరహరివంశానికి (1986), పి. నరసింహారెడ్డిగారు ఆముక్తమాల్యదకు (1979), ఎన్.వెంకటేశ్వరరావుగారు తిక్కన నిర్వచనోత్తర రామాయణానికి (1993), కె. బాలకృష్ణగారు అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతికి (2003), పమ్మి పవన్‌కుమార్‌గారు కట్టా వరదరాజు ద్విపద రామాయణానికి (2003) వర్ణనాత్మక వ్యాకరణాలు, డా.మల్లిపూడి రవిచంద్ర కూచిమంచి తిమ్మకవి రచనలు: భాష, సాహిత్యానుశీలన (2017) రాశారు. ప్రస్తుతం కొన్నివిశ్వవిద్యాలయాల్లో పరిశోధకులు ప్రాచీనసాహిత్యాన్ని వర్ణనాత్మకవ్యాకరణం దృష్టితో అధ్యయనంచేస్తున్నారు. ఇది మంచిపరిణామం.

## 2. నిఘంటువుల (Dictionaries)) నిర్మాణం

తెలుగులో ఇప్పటికే చాలారకాల నిఘంటువులు ఉన్నాయి. గణపవరపు వేంకటకవి వేంకటేశాంధ్రం,పైడిపాటి లక్షణకవి ఆంధ్రనామసంగ్రహం, కసూర్తి రంగకవి సాంబ నిఘంటువు, అడిదం సూరకవి ఆంధ్రనామ శేషం… వంటివి పద్యరూపంలో వెలువడిన నిఘంటువులు.శబ్దరత్నాకరం, బ్రౌణ్యం, ఆంధ్రశబ్దరత్నాకరం,

ఆంధ్రవాచస్పత్యం...వంటివిశబ్దార్థనిఘంటువులు. ఇవేకాక పర్యాయపద నిఘంటువులు, నానార్థ నిఘంటువులు...మొదలైనవెన్నో ఉన్న సమయంలోనే వెలుగు చూడనిపదాలు అనేకం ఉండడంతో శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు రూపకల్పన జరిగింది. వీటన్నిటిలో చేరని పదాలతో శ్రీహరి నిఘంటువు తయారయ్యింది. అచ్చతెలుగు కోశాలు, మాండలిక వృత్తి పదకోశాలు, వ్యుత్పత్తి పదకోశాలు...ఇలా ఎన్ని నిఘంటువులు ఉన్నా ఇప్పటికీ వెలుగు చూడని పదాలు ఉన్నాయి.

ఉదా. తునె అనే పదం నిఘంటువుల్లో లేదు. దానిని కవి నంజుడు తునెల్వండి (భర్గ-34) అనిసమాసంలో ప్రయోగించడం వల్ల నంజుడు అంటే మాంసం కాబట్టి తునె అంటే ముక్క అని అర్థం అవుతుంది.

**అన్యార్థ స్ఫురణ కలిగిన పదాలు -**

ఉదా. కంకేళి (శ్రీకృష్ణ.పుట:6) అనే పదాన్ని అశోకవృక్షానికి పర్యాయపదంగా నిఘంటువుల్లో (పర్యాయ. పు:26) ఇచ్చారు. కవి కూడా వృక్ష సంబంధమైన అర్థంలోనే వాడాడు. కానీ గోదావరి జిల్లాల్లో కంకేళి, కంకేళిముడి అనే పదాలు జానపదుల వాడకంలో ఉన్నాయి. అవి ఆస్తి (ధన, వస్తు, ధాన్య, పదార్థాలు) అనే విశేషార్థ ప్రయోగంగా కనిపిస్తాయి.

రూపాంతరాలు-

ఉదా. భిల్లగభల్ల (శ్రీకృష్ణ. పుట:6)= లొద్దుగ చెట్టు (పర్యాయ.పు:29).వృక్షసంబంధంగా భల్ల అనే రూపమే నిఘంటువుల్లో లేదు.

ఇలాంటి పదాలు అనేకం కావ్యాల్లో ఉన్నాయి. ఆ దృష్టితో ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఒక్కో పరిశోధకుడు కనీసం 10-20 కొత్త పదాలను అందించినా అది చాలా గొప్ప మేలు (Contribution) అవుతుంది.

**2. పదప్రయోగ సూచుల (Concordances) తయారీ**

పదప్రయోగ సూచులుకూడా ఒక రకమైన కావ్య పరిశోధనే. ప్రతి కావ్యానికి భాషాశాస్త్ర కోణం నుండి పదప్రయోగ సూచులు తయారు చేయాలి. ఇలా చేయడం ద్వారా ఏయేపదాలు ఎటువంటి పదాలతో కలసి సంధులు, సమాసాలు, వాక్యాలుగా (Combinations) ఏర్పడుతున్నాయనే విషయం బోధపడుతుంది.పదాలను ప్రయోగించటంలో కవి ఒక కావ్యానికీ, మరో కావ్యానికీ చూపించిన వ్యత్యాసం ఏంటి? అలా ఒక కవి ప్రయోగానికీ, మరో కవి ప్రయోగానికి ఉన్న వ్యత్యాసం ఏంటి? అనే విషయం బోధపడుతుంది. ఆ వ్యత్యాసమే ఒకరిని మహాకవిని చేస్తే, మరొకరిని సాధారణ కవిగా నిలబెడుతుంది.

పదప్రయోగ సూచులు నిఘంటువుల కంటే భిన్నమైనవి. ఇక్కడ ఆరోపం, అది ప్రయోగింపబడిన వాక్యం ఉంటాయి. అర్థాన్ని ఇవ్వనవసరం లేదు. నిఘంటువుల్లో మాదిరి పదాలు ( నామ, క్రియా పదాలు), -లోన్, -తోడ వంటి ప్రత్యయాలు,-చోన్, -తెంచు, -ఉన్న వంటి అనుయోగ క్రియలు, -కాన్, -గాన్వంటివిశేష్యవిశేణాలపైవచ్చే ప్రత్యయాలు, -తనము, -రికము వంటి కృత్తద్ధితరూపాలు, -ఏ, -ఓ వంటిఏవార్థక, ఎదాది, ప్రశ్నార్థకాలుకూడా ఆరోపాలుగాఉంటాయి. అంతేకాక ప్రత్యయంతో కూడిన పదాలు (వచ్చుచోన్, ఇడుచున్న, చిన్నతనము, పెద్దరికము), శబ్దపల్లవాలు, బహుపద ఘటిత సమాసాలు, వచ్చెన్ వంటి ద్రుతరూపాలు, పూచెc, పూచెం వంటి వ్యాకరణ రూపాలు ఒకే ఆరోపంగా ఇవ్వబడతాయి. (చూడు. తిక్కన పదప్రయోగ కోశము)

**2. పదకోశాల (Glossaries) సృష్టి**

ప్రత్యేకశాస్త్రానికి, రంగానికి సంబంధించిన పదాలనో, ప్రత్యేక ప్రయోజనం కోసం కొత్తగా సృష్టించిన పదాలనో, వాడుకలోలేని పదాలనో ఒక్కచోట కూర్చితే అదిపదకోశం అవుతుంది. అలాగే ఒకశాస్త్రానికి సంబంధించిన పారిభాషికపదజాలాన్ని ఒక కోశంగా తయారుచేస్తే అది ఆ శాస్త్రపదకోశం అవుతుంది. ఇక్కడ పదాన్ని ఆరోపంగా ఇచ్చి, దాని అర్థాన్ని, వాక్య ప్రయోగాన్ని, అవసరమైతే నిర్వచన ప్రాయమైన వివరణను కూడా ఇవ్వడం జరుగుతుంది. ఇలాంటి ప్రత్యేకతను బట్టి పదకోశం నిఘంటువులు, పదప్రయోగసూచుల కంటే భిన్నం.

ప్రాచీనసాహిత్యంలోని ఒక్కోరచనకో (కావ్యం, శతకం... మొ.వి), ఒక్కోకవి మొత్తం రచనలకో పదకోశాలను తయారుచేయవచ్చు. అందులోఅన్యదేశ్యాలుగానీ, నేడు మాండలికాలుగా మాత్రమే చెలామణిలో ఉన్నపదాలుగానీ ఎక్కువ దొరికితే వాటినికూడాప్రత్యేక కోశాలుగా కూర్చవచ్చు.

పదకోశాలు తయారుచేసే క్రమంలో పదస్వరూపాన్ని, వ్యుత్పత్తిని తెలుసుకొంటే పారిభాషిక పదజాలం (Technical Terminologhy) వంటివాటిని తయారుచేయటం చాలాసులభం. తెలుగులో వ్యుత్పత్తికోశాలు ఉన్నా సంస్కృతకోశాలు సంస్కృతపదాల వ్యుత్పత్తిని తెలియజేసినట్టుగా తెలుగుపదాలకు తెలియజేయటంలేదు. తెలుగు పదాలకు వ్యుత్పత్తినిగానీ కనుక్కోగలిగతే, తెలుగు అనువాదరంగంలో ఉన్నపదాల, పారిభాషిక పదాల కొరతను కూడా తీర్చవచ్చు.

తెలుగులో ఇప్పటికే నిఘంటువులు, పదకోశాలు (వృత్తి, మాండలిక... మొ. వి), వ్యుత్పత్తి కోశాలు ఇలా అనేకం ఉన్నాయి. ఏదీ సమగ్రం కాదు, అలాగని అసమగ్రమూ కాదు. ముందు వీటన్నిటినీ కేవలం పుస్తకరూపానికే పరిమితం చేయకుండా సాంకేతిక రంగం (Technology) సహాయంతో అంతర్జాలం (Internet) లో ఒక్కచోట పెట్టగలిగితే, అది మొత్తం ప్రపంచమంతటా అందుబాటులో ఉంటుంది. దాని వాడకం కూడా ఎక్కువగా ఉంటుంది. పైగా ఉన్న నిఘంటువులు, కోశాలన్నిటినీ అంతర్జాలంలో ఒక్కచోటచేర్చడంవల్ల వాటిలోని పునరుక్తులను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సులభంగా తొలగించవచ్చు. ఆ పని కొంత జరిగింది. తెలుగులో వెలువడిన చాలా నిఘంటువులతో ఆంధ్రభారతి అనే ఆన్‌లైన్ హన్నిఘంటువు ఒకటితయారయ్యింది. అది ఇప్పుడు అందుబాటులోఉంది. నిజానికి అది చాలా గొప్పకృషి. అటువంటి కృషికి తోడుగా ఎప్పటికప్పుడు ప్రాచీన సాహిత్యంపై పరిశోధన చేసి, తయారు చేసిన, చేస్తోన్న నిఘంటువులు, పదప్రయోగ సూచులు, పదకోశాలను కలిపి సమగ్రం (Update) చేయాలి. అలా చేయటం వల్ల భాష పరిపుష్టం అవుతుంది. (Oxford Dictionary) లాంటి సమగ్రమైన మహానిఘంటువును తెలుగులో కూడా రూపొందించవచ్చు. అంతేకాక పద, ప్రత్యయాలను, ధాతురూపాలను, నుడికారాలు, సామెతలు, అన్యదేశ్యాలను కూడా ఆరోపాలుగాఇచ్చి, అవసంమయిన దగ్గ చిత్రాలను జోడిస్తే, దానిని

ఒక విజ్ఞానసర్వస్వంగా (Encyclopaedia) రూపొందించవచ్చు. (తెలుగు భారతి: 2015:44)

కోశాలు, సూచులు, నిఘంటువులతోపాటు ఇప్పటివరకూ లభిస్తోన్న ప్రాచీన సాహిత్యాన్ని (అన్ని ప్రక్రియలకూ సంబంధించిన) అంతటినీ సంశుద్ధరూపంలో అంతర్జాలంలో అందుబాటులో ఉంచితే అది ప్రపంచంలోని పరిశోధకులకందరికీ, ప్రాచీన సాహిత్యంపై పరిశోధన చేయదలచుకొన్నవాళ్ళకు సామగ్రి (Corpus) గా తక్షణం అందుబాటులోఉంటుంది. ఆ సామగ్రి సహాయంతో అధ్యయనం చేయటం మూలంగా ఫలితాలు నిక్కచ్చిగా ఉంటాయి. ఇది పరిశోధకులశక్తి, సమయ, ధన వ్యయాలను తగ్గించే అనుకూలమైన మార్గం. దానితో తెలుగులో ప్రాచీన సాహిత్యంపై పరిశోధనలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది.

### 3. ఉపయుక్త గ్రంథసూచి


1. తిమ్మకవి, కూచిమంచి. 1924. శ్రీకృష్ణదండకము. బరంపురం: ఆంధ్రలక్ష్మీ ముద్రాక్షరశాల.

2. ................. 1982. శ్రీభర్గశతకము (అధిక్షేపశతకములు). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

3. నిత్యానందరావు, వెలుదండ. 2013. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైదరాబాదు: శ్రీమతి గీతారాణి ప్రచురణలు.

4. బుద్ధ ప్రసాద్, మండలి (సంపాదకులు). 2015. తెలుగు భారతి (పరిశోధక వ్యాస సంకలనం) విజయవాడ: కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణ

5. రవిచంద్ర, మల్లిపూడి. 2013. కూచిమంచి తిమ్మకవి శివలీలావిలాసము: భాషాపరిశీలన(హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖకు ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన పరిశోధన వ్యాసం)

6. రామకృష్ణారావు, అబ్బూరి (సంపాదకులు). 1974. తిక్కన పదప్రయోగ కోశము (సంపుటం –2). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

7. రెడ్డి, జి. ఎన్. 2014. తెలుగుపర్యాయపదనిఘంటువు (పదవముద్రణ). హైదరాబాదు: ప్రగతిపబ్లిషర్స్.

8. శివారెడ్డి, ఎల్లూరి (ప్రధాన సంపాదకులు) 2012. నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.


**సంకేతపదాలు: వివరణ**

పర్యాయ. = పర్యాయపదనిఘంటువు; పు.= పుట

భర్గ.= శ్రీభర్గశతకము; శ్రీకృష్ణ.= శ్రీకృష్ణదండకము

## .. 13వ పేజీ తరువాయి

నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద పెద్ద విశ్వవిద్యాలయాలు, దేశ దేశాల ప్రభుత్వాలు భాషల అనవాలువుకు పెద్ద నిధులను ఏర్పాటు చేసాయి. ప్రతిపాదనలను ప్రోత్సహిస్తూ భాష అనవాలువుకు కావాల్సిన సాఫ్టువేర్, హార్డ్వేర్ వనరులను అందిస్తున్నాయి.

భాష అనవాలువులో ఇప్పటివరకూ కొన్ని చెప్పుకోదగ్గ విజయాలున్నాయి.

1. ది రొసెట్టా ప్రాజెక్టు మానవ భాషల డిజిటల్ గ్రంథాలయాన్ని రూపొందించాలనే ధ్యేయంతో పనిచేస్తున్న సంస్థ. 1500 పైగా భాషల పాఠాలు, రికార్డింగులు, నిఘంటువులు ఈ ప్రాజెక్టు కింద రూపొందాయి.

2. ఐకుమా ప్రాజెక్టు జనభాషల అనవాలువుకు, భాషల పునరుజ్జీవనకు పని చేస్తోంది. వీరు ఐకుమా మొబైల్ ఆప్ ను రూపొందించారు. ఈ ఆప్ ద్వారా ప్రమాదంలో ఉన్న భాషలను రికార్డ్ చేసి, రికార్డ్ చేసిన అంశాల పాఠ్యాలను రాసుకొని, అనువదించి, భద్రపరిచి పంచుకునే అవకాశం ఉంది.

3. లివింగ్ టంగ్స్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎండేంజర్డ్ లాంగ్వేజెస్ ప్రాజెక్టు ప్రపంచవ్యాప్తంగా ప్రమాదంలో ఉన్న భాషల అనవాలువుకు సహాయ పడుతోంది. క్షేత్రస్థాయి సముదాయాలతో కలిసి పని చేసి అక్కడి భాషల అనవాలువులో, నిఘంటు నిర్మాణంలో, బోధనా సామగ్రి రూపకల్పనలో సహాయం అందిస్తున్నారు. చమకోకో, కోరో భాషల పునరుజ్జీవనానికి సహాయపడింది.

4. ది ఎండేంజర్డ్ లాంగ్వేజెస్ ఆర్కైవ్(ELAR). ఇది లండన్ విశ్వవిద్యాలయం వారి కార్యక్రమం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులకు, వ్యక్తులకు ప్రమాదస్థాయిలో ఉన్న భాషల వనరులను, అనవాలువు ఉపకరణాలను అందించి సమాచారాన్ని అందుబాటులో ఉంచుతుంది.

5. DoBes: ఇది జర్మనీ అందించే కార్యక్రమం. ఈ కార్యక్రమం ద్వారా నిధులు పొంది ప్రమాదస్థాయిలో ఉన్న భాషలకు వనరులను తయారు చేసి, ఆ భాషల అనవాలువులో పాల్గొనవచ్చు.

6. ది డిజిటల్ హిమాలయా ప్రాజెక్టు : హిమాలయాల్లో నివసించే అనేకానేక సముదాయాల సంస్కృతిని, భాషలను, నడవడికను నిక్షిప్తం చేసేందుకు ఉపయోగిస్తున్న ప్రాజెక్టు. హిమాలయాల్లోని భాషల సంస్కృతుల మల్టీమీడియా వనరులు, బొమ్మలు, పాఠాలు నిక్షిప్తం చేశారు. తెలుగు భాషా అనవాలువు ఇక మన ముందున్న పెద్ద అవకాశం. చిన్నా పెద్దా అందరూ ఇందులో పాల్గొనాలి. ఇది ఒక విశ్వవిద్యాలయంలోనో, ప్రభుత్వం ద్వారానో జరిగే పని అని మిగతావారు నిరుత్సాహ పడనక్కరలేదు. వ్యక్తిగత స్థాయిలో తమకు తెలిసిన మాటలను telugupadam.org కి చేర్చవచ్చు. విజ్ఞానసర్వస్వ సంబంధ భాషా విషయాలను te.wikipedia.org లో పొందుపరచవచ్చు. **అమ్మనుడి** పత్రిక ద్వారా మీ ప్రాంతంలోని యాసలోని విశేషాలను గురించి రాయవచ్చు. యూట్యూబులో మాట్లాడి పొందుపరచవచ్చు. ఎన్.టి.ఆర్. ట్రస్ట్ వారు 2017లో కోటిమాటల కోట అని ఇలాంటి ఒక కార్యక్రమాన్ని చేపట్టారు. కానీ అది ఆగిపోయింది. విజయవాడలో డిసెంబర్ 2022 లో జరిగిన ప్రపంచ రచయితల మహాసభల్లో సిలికాన్ ఆంధ్ర కూచిభొట్ల ఆనంద్ ఇదే పేరుతో కోటి మాటల కోట అని ప్రకటించారు. ఆచరణలో ఈ విషయంలో జరగాల్సింది చాలా ఉంది. ప్రతి ఒక్కరం కలిసి కనీసబాధ్యతగా మన భాషకు చేసుకోగలిగింది చేద్దాం. అన్నింటా తెలుగు, అంతటా తెలుగు అన్న ధ్యేయంతో మన రోజువారీ మాటల్లో చేతల్లో తెలుగును వాడటం మొదలుపెడదాం. భాష అనవాలువుకు మనకు చేతనైనంత సహకారం ఇద్దాం.

వప్పల వెంకటరమణ
9491811710

# బోనెల పాట (జముకుల కథ) - పరిశీలన

ఇది ఉత్తరాంధ్రకు చెందిన అతి ప్రాచీనమైన జానపద కళారూపం. జముకుల కథకులు అనాదిగా ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందారు. ఇది బుడబుడక్క మని మ్రోగే మనోహరమైన వాయిద్యం. శ్రీకాకుళం జిల్లాలో నేటి జముకుల కథ పూర్వ నామం బుణికి పాట అని, బోనుల పాటని, టమకటమా అని, బుడబుక్కల పాటని నామాంతరాలు కలవు.

బుడికి వాయిద్యాన్ని 'బోను' అని కూడా అంటారు. అందుకే అది బోనుల పాట అయింది. బుడికి చేసే శబ్దం కాబట్టి బుడబుక్కల పాట అని కూడా అంటారు. మొత్తం మీద ఇది వాయిద్య ప్రధానమైన కళారూపం. ఈ జముకల కథలో వీర, కరుణ, శృంగార రసాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈనాటికీ ఈ కళ ఉత్తరాంధ్రలో సజీవంగానే ఉన్నప్పటికీ మరికొద్ది రోజులలో కనుమరుగు అవటం ఖాయం. వృత్తిగా ఈ కళారూపాన్ని స్వీకరించిన అనేకమంది కళాకారులుగా జీవనం సాగిస్తున్నారు. దీనిని వృత్తిగా భావించిన వారు జముకుల కథను పవిత్రంగా భావిస్తారు. ఈ కళారూపంలో జముక వాయిద్యం గూర్చి కళాకారులు ఒక కథ చెబుతారు. సుకేతుడు అనే రాక్షసుని సంహారం అనంతరం ఎల్లమ్మ దేవి ఆ రాక్షసుడు వెన్నుమీద చర్మాన్ని ఒలిపించి ఒక డబ్బాను మూతగా అమరింప చేసిందని, వెన్నునరం ఏకనరంగా తాడును తయారు చేయించిందని, కాలి మూలుగు దుమ్ము బిల్లగా తయారు చేయించిందని, ఇలా తయారయ్యిందే జముకుని పురాణ గాథ. అంతేకాదు జానపదుల్లో ఈ జముకుల కథకు సంబంధించి మరో నమ్మకం కూడా ఉంది. ఈ జముకు ధ్వని వినిపించినంత మేర గాలి, దయ్యం, పిశాచం లాంటివి ఏమీ రావని, వాటి ప్రభావం పడదని నమ్ముతుంటారు.

జముకులు వాయించే ఈ వాయిద్యం కుంచం ఆకారంలో ఉంటుంది. కొన్ని ఇత్తడితోనూ, మరికొన్ని కొయ్యవి, ఇంకొన్ని కర్ర, రేకు, కంచుతో తయారు చేస్తారు. దానిని ఒక ప్రక్కభాగం సన్నని పొరలాంటి గేదెల బక్కి చర్మంతోనూ, మధ్య భాగంలో చిన్న రంధ్రం చేసి నరాన్ని కట్టి, లోపలి భాగము నుంచి రెండవ ప్రక్క ఒక కర్ర ముక్కకు కట్టి, ఆ కర్రకు చివర మువ్వలు కట్టి, చేతిలో దానిని లాగిపెట్టి లోపల భాగంలో ఆ నరాన్ని మ్రోగించినట్లయితే శ్రావ్యమైన శబ్దాలు వస్తాయి. కర్రతో దాన్ని బిగుతుగా లాగి వదులుతుంటే ఒక రకమైన ధ్వని వస్తుంది.

జముకుల కథ ప్రదర్శనానికి ఏ విధమైన రంగస్థలం అవసరం లేదు. గ్రామం మధ్యలో చిన్న పందిరి వేసి రెండు లైట్లు కడితే సరిపోతుంది. ప్రదర్శన కారులు ముగ్గురు. అందులో మధ్య వ్యక్తి కథకుడు. వంతదారుల్లో ఒకరు హాస్యం, రెండోవారు వ్యాఖ్యానం, వేషధారణలో కథకుడు నల్లకోటు, తెల్ల కట్టు పంచ, తలగుడ్డ చుట్టి చక్కగా నృత్యం చేస్తూ కలియ తిరుగుతాడు. స్త్రీ పాత్రలు కథా విధానంలో వచ్చినప్పుడు అక్షరాల స్త్రీ అభినయాన్ని కథకుడు చేస్తూ ఉంటాడు. వంతదారులు రెండు జముకులను శ్రావ్యంగా వాయిస్తూ ఉంటారు. ఈనాడు ఒక్కరే వచ్చి ఇంటింటా ప్రదర్శిస్తూ ఆనందింప చేస్తున్నారు.

ఉత్తరాంధ్రలో దళిత కులానికి చెందినవారు కొద్దిపాటి అక్షర జ్ఞానంతో పాడుతూ, ఎన్నో తరాల నుండి వీటిని జీవింప చేస్తున్నారు. కానీ నేటి కాలానికి ఈ కళ ఇంచుమించు కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. సామాన్య గ్రామీణ ప్రజలకు, ప్రాంతానికి తగ్గట్లు భాష, యాస, మాండలికాలతో పాడుతూ ప్రజలను రంజింపజేసేవారు. అణగారిన వర్గాల, అక్షర జ్ఞానం లేని ప్రజలకు అణగారిన కులాల కళాకారులచే పాటలు పాడి భారత, రామాయణ గాధలను సామాన్యులకు వినిపించేవారు. నిజంగా ఆ రోజులలో గ్రామీణ ప్రజలకు రామాయణ, మహాభారతం గాధల్ని ఇటువంటి జానపద కళాకారుల ద్వారానే తెలిసేవి. నేటి తరానికి అవి లభించుటలేదు. సినిమా, టీవీలు, సెల్ఫోన్ల విజృంభణతో ఈ కళలు అడుగంటి పోతున్నాయి. నిరుపేదలైన ఈ కళాకారులకు పాట పెట్టించేవారు కట్నాలు, భత్యం, బట్టలు ఇచ్చేవారు. ఇదే కళాకారులకు భృతి. కథ విన్న ఇతరులు కూడా డబ్బులు ఇచ్చి పొగిడించుకునేవారు.

బుడికి కథలో కథకునికి రుమాలు ఒక అవయవం లాంటిది. అది చేతిలో లేకపోతే చెయ్యి విరిగిపోయినట్లే. ఆయా సన్నివేశాల్లో అది ఒక పాత్రగానే వ్యవహరిస్తుంది. ఒక్కోసారి కర్పూరం వెలిగించిన పళ్లెమవుతుందట, వాయినం అందించే పాత్రగా మారుతుందట, ఒక్కోసారి ఆకాశంలో చందమామగా, మరోసారి సిగ్గును దాచుకోవడానికి, మరోసారి గుర్రాలను అదలించే చర్నాకోలగా రూపొందుతుంది. ఇంకోసారి రాయబారాన్ని పంపే హంసగా, పావురంగా, చివరకు ఉత్తరంగా, దుఃఖ రసంలో కళ్ళు అద్దు కోడానికి, శృంగారంలో వయ్యారంగా ఊగించడానికి, ఇలా ఎన్నో విధాల ఆయా రసాల, అభినయాల, సన్నివేశాల కనుగుణంగా చేతిలోని రుమాలు ప్రముఖ పాత్ర వహిస్తుంది.

ఈ కళా రూపాన్ని గ్రామాలలో కూడలి వద్ద, నలుగురు కూర్చుండే రచ్చబండల వద్ద ప్రదర్శిస్తారు. కథ ప్రారంభమై తెల్లవార్లు నడుస్తుంది. ప్రదర్శన రంగస్థలములో ఒక దీపపు స్తంభాన్ని పాతుతారు. దీనిని 'గిరడ' అని పిలుస్తారు. ఈ గిరడ చుట్టూ వలయాకారంగా తిరుగుతూ పాడుతూ, కథకుడు నృత్యం చేస్తూ కథ చెబుతాడు. ముందుగా కథకుడు గిరడకు ఎదురుగా నిలబడి ప్రార్థన చేసి, నెమ్మదిగా నాట్యం ప్రారంభించి, అప్పటివరకు కప్పుకున్న మేలి ముసుగును తొలగించి, అనంతరం సంభాషణ ద్వారా ఏ యే కథలు తాము చెప్పగలరో, ఏ కథ కావాలో ప్రేక్షకుల్నే ప్రశ్నించి, వారు చెప్పమన్న కథను ప్రారంభిస్తారు. కథలన్నీ పౌరాణికాలే. కథంతా పూర్తయిన తర్వాత

ప్రేక్షకులు కోరిన మీదట సుదీర్ఘమైన పాటలు పాడతారు. వీటిల్లో చెప్పుకోదగినవి మందులోడి పాట, కామమ్మ కథ పాట, రెల్లమ్మ పాట, మాలోల మంగమ్మ పాట మొదలైనవే కాక, ఆయా ప్రాంతాల్లో జరిగిన సంఘర్షణలు కూడా పాటలు కట్టి పాడుతారు.

ఈ కథలు చెప్పే కళాకారులు దాదాపు అందరూ సంచార జీవనులే. ఒక గ్రామంలో కథ చెప్పి మరో గ్రామం పోయి నెలల తరబడి గ్రామాలలో కథలు చెప్పి కొంత సొమ్ము కూడబెట్టుకుని స్వగ్రామం చేరుకుంటారు. అక్కడ సేకరించిన వివరాలన్నీ ఆ ప్రాంతంలో ఉన్న ఒక బృందం చెప్పిన వివరాలన్నిటిని కథా రూపంలో చెబుతారు.

జముకుల కథ కళారూపాన్ని దేశ ప్రయోజనాలకు ప్రథమంగా మార్చిన వ్యక్తి, విజయవాడ కమ్యూనిస్టు కార్యకర్త, ప్రజానాట్యమండలి సభ్యుడు కీర్తిశేషులు పీసా లక్ష్మణరావు. మహారాజుల వ్యవస్థలో ప్రబలిన దారుణ హింసకాండను, సాంఘిక దురాచారాలను ఉదహరిస్తూ జముకుల కథలు రాసి మంచి బాణీలను ఏర్చి కూర్చి రసవత్తరంగా గానం చేసేవారు. ఆయన వంతదారుగా రాజకీయ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తే, నరసింహారావు కథకుడిగా, తొక్కిడి సింహాచలం హాస్యాన్ని అందించేవాడు. అది అద్భుతమైన కథగా, నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులన్నిటికీ అద్దం పట్టింది.

నవరసాలను ప్రతిబింబించే ఈ జముకుల కథను, రసవత్తరమైన ఈ జముకల కథను నాటి ప్రజానాట్య మండలి స్థాపకులలో ముఖ్యులైన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, మాచినేని వెంకటేశ్వరరావు, పట్టం శెట్టి ఉమామహేశ్వరరావు మొదలైన వారు లక్ష్మణరావు గారి వద్ద నేర్చుకొని దానిని ప్రజానాట్యమండలి ముఖ్య కళారూపంగా తీర్చిదిద్దారు. ఈ దళంలో కథకుడు మిక్కిలినేని రాజకీయం, ఉమామహేశ్వరరావు హాస్యం, మాచినేని తర్వాత కర్నాటి లక్ష్మీ నరసయ్య హాస్యం చెప్పారు. ప్రజానాట్యమండలి ఆంధ్ర రాష్ట్రంతో పాటు మద్రాస్, సోలాపూర్, పూనా, బొంబాయి, అహ్మదాబాద్ మొదలైన ఇతర ప్రాంతాల్లో చెప్పబడి అధిక ప్రశంసలను అందుకుంది.

ఈ జముకల కథను శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనోత్సవం, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన రోజుల్లో కామ్రేడ్స్ వెంపటాపు సత్యం, అరికే సోములు, దుప్పల గోవిందరావులు ఆ ఉద్యమాన్ని చిత్రిస్తూ తమకు చేతనైన పద్ధతుల్లో జముకుల కథగా చెప్పేవారు. దానిని ఉత్తమంగా తీర్చిదిద్ది సుబ్బారావు పాణిగ్రాహి, నిమ్మల కృష్ణమూర్తి మొదలైన వారు శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటానికి మద్దతుగా కథలు చెప్పి ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఇది ఆనాడే కాదు ఈనాడు వర్ధిల్లవలసిన ఉత్తమ కళారూపం.

వామపక్ష పార్టీలు, విప్లవ పార్టీల జముకుల కథలకు ముఖ్యంగా ఉత్తరాంధ్రలో విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి కూడా ఈ బోనేల పాటల బాణీల ద్వారానే జముకుల కథను ప్రజల వద్దకు తీసుకు వెళ్లారనడంలో అతిశయోక్తి లేదు. జముకుల కథలో.

శ్రీకాకుళం రా! వీర శ్రీకాకుళం రా!
వీర యోధులనే కన్న గడ్డ శ్రీకాకుళం రా!
అదిగదిగో శ్రీకాకుళం అదేనంట, ఉద్దానం
అదేనంట ఉద్దానం ఉద్దానం కాదురా ఉద్యానవనం రా,

అనే ఈ పాటతో, పాటు అనేక పాటలు బోనేల పాట బాణీలో ఉండటం బట్టి, ఈ పాట యొక్క ప్రాధాన్యతను గుర్తించవచ్చు. ఈ పాట పాడే కళాకారులు ఇప్పటికీ అనేకమంది ఉన్నారు. కానీ కళకు ఆదరణ తగ్గిపోవడంతో అనేక తరాల నుండి వస్తున్న ఈ కళ కనుమరుగైపోతున్నది. శ్రీకాకుళం జిల్లా పాలకొండ దరి వన్నలి గ్రామానికి చెందిన బోనెల దుర్గారావు సోదరులు, దుగ్గివలసకు చెందిన రావాడ అప్పల దాసు రచించిన పాటలతో సైతం జముకుల కథలు చెబుతున్నారు.

ఈ కళకు సంబంధించి, కళాకారులు ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే కాకుండా, శ్రీకాకుళం జిల్లా సరిహద్దుగా ఉన్న ఒరిస్సా రాష్ట్రం పర్లాకిమిడి దరి జంగాలపాడు శేఖరాపురంలో కూడా ఉన్నారు. ముఖ్యంగా జంగాలపాడుకు చెందిన తొంప రాములు 'బోనెల రామన్నగా' పేరు పొందారు. ఈయన గొప్ప జముకుల కళాకారుడు. ఉద్దానం గ్రామాలలో ఈయన పాటకు గొప్ప గిరాకీ ఉండేది.

ఈ జముకుల కథల ప్రదర్శనలలో సామర్లకోటకు చెందిన నూలు సూర్యరావు, దొంతం శెట్టి సూర్యనారాయణ, నూలు భానుమూర్తి మొదలగువారు ఒక దళంగా ఏర్పడి సారంగధర కథనం, లవకుశ కథలు, సీతా కళ్యాణం అనేక కథలను ఉత్తరాంధ్ర దేశంలో విరివిగా ప్రదర్శనలు ఇచ్చారు.

ఈ జముకుల కళా ప్రదర్శనలలో జాతీయ కవి భూషణ బిరుదాంకితులు శ్రీ వారణాసి సత్యనారాయణ గారు. కీర్తిశేషులు పుట్టా సుబ్బారావు గారు, శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి గారు, శ్రీ భక్తుల విశ్వనాథం గారు, సన్యాసమ్మ బృందం విజయనగరం వారు, ఎద్దు పైడితల్లి బృందం విజయనగరం- వారు, లక్కిదాం సన్యాసమ్మ బృందం విజయనగరం అనేక భారత, భాగవత, రామాయణ, పురాణ గాధలను కథలుగా నవరసభరితంగా పాటలు పాడారు.

ఎంతో ప్రజాదరణ పొందిన ఈ జముకుల కథలను ఆదరించి బ్రతికించవలసిన బాధ్యత ఈనాటి ప్రభుత్వాలు, ప్రజలు, కళాకారులు, కళాపోషకులు, స్వచ్ఛంద సంస్థలు మరియు మన అందరి పైన ఉన్నది.

ఆధార గ్రంధాలు:

1.తెలుగు వారి జానపద కళారూపాలు - డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1992.
2.ఉత్తరాంధ్ర జానపద కళలు - బద్రి కూర్మారావు, శ్రీకాకుళం, 2005.
3.జానపద కళా సంపద - తూమాటి దొణప్ప, నిర్మల పబ్లికేషన్స్, విశాఖపట్నం, 1975.
4.జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2006.
5.మహతి వ్యాస సంకలనం - యువభారతి, సికింద్రాబాద్, 1972.

వ్యాసరచయిత డా. వప్పల వెంకటరమణ
ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# తెలుగు భాష స్థితీగతీ- సందేహాలు

**త**ల్లిదండ్రులు కొందరికి తెలుగు మాధ్యమ అవసరంపై సందేహాలు ఉన్నాయి. రాజకీయనాయకుల స్వార్థరాజకీయాల వల్ల ఈ సందేహాలు మరింత పెరుగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పోటాపోటీగా ఈ దుష్టఆచారానికి ఒడిగడుతున్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ఇస్తున్న సమాధానాలు చూడండి.

*ప్రశ్న: ఇంగ్లీష్ మాధ్యమ చదువుల వల్ల, మనం మన మాతృభాష తెలుగునూ దాని ఉనికినీ కోల్పోతున్నాం. ఇలా కాకుండా ఉండటానికి మీ సలహాలు ఏమిటి?*

జవాబు: ఔను. ఇంగ్లీషు మాధ్యమం చదువుల వలన మనం మన తెలుగును చదవడానికీ రాయడానికీ అవసరమైన కౌశలాలనూ కోల్పోవడమే కాకుండా, తెలుగు ఒక వాడుక భాషగా తన ఉనికినే కోల్పోతోంది.

*ప్ర: ఇన్ని కోట్లమందిమి తెలుగువాళ్ళం ఉన్నాం గదా, ఇంగ్లీషులో చదువుకుంటే తెలుగుకు వచ్చే నష్టం ఏమిటి?*

జ: ఔను, చాలా మంది ఇలాగే అనుకుంటారు. కోట్లమంది మాట్లాడే తెలుగుకు వచ్చిన నష్టం ఏమిటి అని. కానీ ఈ వాదనా, ఇలాంటి ఆలోచనా తప్పు. సమాజంలో భాషల స్థితిగతుల గురించి ఏమాత్రం అవగాహన లేనివారు మాట్లాడే మాటలే ఇవి. ఈ ఆధునిక ప్రజాస్వామ్యంలో చదువు సార్వజనీనం అయినప్పుడు అందరూ అక్షరాస్యులు అవ్వాలి. చదువు ద్వారానే జీవనమూ జీవితమూ. అందరూ చదువుకోవాలి. అందరి బడి చదువులూ మాతృభాషలో ఉండాలి. అలా లేకుంటే రెండుమూడు దశాబ్దాలలో యువత అంతా తెలుగుకు దూరమవుతారు. యువత మాతృభాషకు దూరమైతే ఆ భాష మాట్లాడుతున్న సమాజం ఆ భాషను కోల్పోతున్నట్లే.

*ప్ర: 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో మనం సాధించిన అక్షరాస్యత 74% మాత్రమే. వీరిలో 52% ప్రాథమిక విద్య దాటనివారు. ఇక సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమయ్యేనా?*

జ: నూట నలభై కోట్ల మంది ఉన్న భారత దేశంలో అందరికీ విద్య- సునాయాసంగా, తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో, అలవోకగా నేర్చుకోవడం మాతృభాషా మాధ్యమంలో మాత్రమే సాధ్యం. ఆలిండియా విద్యా సర్వేక్షణలో ప్రతి దశాబ్దానికీ సుమారు ప్రాథమికవిద్యలో 8% పైగా వృద్ధితో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెడుతున్నట్లు తెలుస్తోంది. దీనితో బడిమానేసే పిల్లల శాతం పెరుగుతూ రావడం మన అక్షరాస్యత అనుకున్నంతగా పెరగకపోవడానికి ఒక కారణం.

*ప్ర: మాతృభాషలో విద్యాబోధన కంటే ఆంగ్లమాధ్యమంద్వారా నేర్చుకుంటే గుణాత్మకమైన విద్యార్జన జరుగుతుందంటారు. ఎంతవరకు నిజం?*

జ: మాతృభాషలో నేర్చుకోవడంలో బడిలోనే కాదు ఇంటిలోనూ, బంధువులూ స్నేహితులూ తన చుట్టూతా ఉన్న ప్రతివారూ తెలియనివాటి గురించి తెలిసేటట్లు విడమరిచి చెప్పగలుగుతారు. అదే ఇంగ్లీషులో సమస్యలు ఉంటే అతి కొద్దిమంది మాత్రమే సహకరిస్తారు. తెలుగును అమ్మ ఒడిలోనే నేర్చుకొంటాం. బడిలో నేర్పే విషయ పరిజ్ఞానం తెలుగులో ఉంటే నేర్చుకోవడం సులువు. ఇంగ్లీషు రాక ముందే విషయపరిజ్ఞానం ఇంగ్లీషులో నేర్చుకోవడం సాధ్యంకాదు. ఇంగ్లీషు నేర్చుకొంటూ ఇంగ్లీషులో చదువు ఎట్లా సాగుతుంది. చదువు కుంటుపడుతుంది. గురువులకూ ఇంగ్లీషు పరిజ్ఞానం అంతంతే. విద్యార్థులకు అసలే తెలియదు. తన చుట్టు పక్కల వారికి అంతకంటే రాదు. గుణాత్మకమైన విద్యార్జన మాతృభాషతోనే సాధ్యం.

*ప్ర: తెలుగు రాష్ట్రాలలో బడిమానేసే పిల్లలు ఎక్కువ ఉండటానికి కారణం ఏమంటారు?*

జ: బడిమానేసే పిల్లలు ఎక్కువ ఉండటానికి కారణాలు ఇంకా ఉండొచ్చు కానీ తెలుగు రాష్ట్రాలలో ఇంగ్లీషు మీడియం వలన ప్రతి ఏటా సుమారు పదిహేను లక్షల మంది ఒకటవ తరగతిలో చేరితే, ఇంటర్ మీడియేట్‌కి వచ్చేపాటికి సుమారు పది లక్షల మంది మిగులుతున్నారు. అంటే మూడవ వంతు మంది బడి మానేస్తున్నారు. బడి మానేయడానికి ఇంగ్లీషు ఒక ముఖ్యకారణం.

*ప్ర: ఇంగ్లీషు మాధ్యమ చదువులవలన సమాజంలో ఎటువంటి మార్పులు వస్తాయంటారు?*

జ: పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో చదువుతుంటే వారి తరగతి పుస్తకాలేగాక, ఇతర సమాచార ప్రసార ప్రచార సాధనాలన్నీ ఇంగ్లీషులో ఉంటై. ఇంగ్లీషు పుస్తకాలు కొంటారు, ఇంగ్లీషు సినిమాలు చూపిస్తారు, ఇంగ్లీషు పాటలూ, ఇంగ్లీషు సంగీతం, ఇంగ్లీషు సాహిత్యం- సర్వం ఇంగ్లీషు మయం ఐపోతుంది. వీళ్ళందరూ ముంగిట్లో ఇంగ్లీషు, అంగట్లో ఇంగ్లీషు, హోటళ్ళలో ఇంగ్లీషు, ఇంటా బైటా ఇంగ్లీషులో మాట్లాడడానికే ప్రయత్నిస్తారు.

*ప్ర: ఇంగ్లీషు మాధ్యమ చదువులతో తెలుగుకు నష్టం అంటారా?*

జ: ఏడాదికి పదిహేను లక్షల మంది పిల్లలు కేజీ టు పీజీ ఇంగ్లీషు మాధ్యమంలో చదువుతుంటే, 20ఏండ్లలో సుమారు మూడు కోట్లమంది ఇంగ్లీషు పిల్లలు తయారవుతారు, తెలుగు పిల్లలు కారు. పేరుకే తెలుగు. ఈ వింత– మన సమాజం మీద విపరీతమైన ప్రభావం చూపిస్తుంది. తెలుగులో మాట్లాడటం, చదవడం, రాయడం అనాగరికం అనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆంగ్లప్రదేశ్ గానూ తెలంగాణ ఆంగ్లాణగానూ మారిపోతై. ఇంగ్లీషు రాని పెద్దలూ ఇంగ్లీషు మాత్రమే వచ్చిన పిల్లలూ, అంటే ఇంగ్లీషు రానివారూ ఇంగ్లీషులో మాట్లాడేవారు అంటూ రెండు భాగాలుగా విడిపోతారు.

*ప్ర: ఇంగ్లీషు మాధ్యమ చదువులు తెలుగు సమాజం మీద ఆర్థికంగా ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తై?*

జ: తెలుగు భాష ఆధారిత పరిశ్రమలు అన్నీ మూలబడతాయి. ఉదా. లక్షలాదిమందికి జీవనోపాధి కల్పిస్తున్న తెలుగుచిత్ర పరిశ్రమ, బుల్లితెర పరిశ్రమ, ముద్రణారంగం, వార్తాపత్రికల పరిశ్రమలూ, ప్రకటనా పరిశ్రమ, రచయితలూ, గ్రంథకర్తలూ, ప్రచురణకర్తలూ, కథకులూ, కథారచయితలూ, నవలా రచయితలూ, గేయ రచయితలూ, గాయకులూ, నటీనటులూ, సాంకేతిక నిపుణులూ, తెలుగు అంతర్జాల రచనలూ, ఇతర సామాజిక మాధ్యమాలూ మొత్తం కుప్పకూలిపోతాయి. లక్షల మంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు పోగొట్టుకుంటారు. అంతా ఆంగ్లమే కావడంతో ఉద్యోగాలు ఉపాధి అవకాశాలూ తగ్గిపోతాయి. ఇంగ్లీషు బాగా వచ్చినవారికే అవకాశాలు. ఆ అవకాశం బ్రిటిష్, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా,వారికే ముందు. తెలుగు భాషలో బోధన లేదు కాబట్టి తెలుగు పత్రికలూ, ప్రచురణకర్తలూ తెలుగు సినిమాలూ, తెలుగుప్రకటనా రంగం, తెలుగులో బోధించే ఉపాధ్యాయులూ ఇలా వందలాది పరిశ్రమలలో ఉద్యోగాలూ హుళక్కే.

*ప్ర: ఇలా ఉద్యోగాలు పోతాయనుకున్నవారికి ఇంగ్లీషు భాషలో చిన్నపాటి శిక్షణ ఇచ్చి ఇంగ్లీషు ఉపాధ్యాయులుగా నియమించగూడదా?*

జ: ఇప్పుడైతే లక్షల్లో తెలుగులో బోధించే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంగ్లీషు మాధ్యమ బోధనతో వీరి అవసరం ఉండదు. వీళ్ళకే మూణ్ణెల్లో ఆర్నెల్లో ఇంగ్లీషు శిక్షణ ఇచ్చి ఇంగ్లీషులో బోధన చేయగలరనుకుంటే అంతకంటే అమాయకత్వం ఉండదు. అయినా మన పాలకులు అదే చేస్తారు. మన పిల్లలు నోట్సులు బట్టీపట్టి చదువుతారు. మార్కులు తెచ్చుకుంటారు. మన పిల్లల్లో సృజనాత్మక శక్తి తగ్గిపోతుంది. ఆలోచన కంటే గంటల తరబడి ఆటాపాటా లేకుండా చదవడం రాయడం పైనే ఆసక్తి కనబరుస్తారు. సృజనాత్మకత కొరవడి బ్లూకాలర్ ఉద్యోగాలను సంపాదిస్తారు.

*ప్ర: ఇంగ్లీషు మాధ్యమంలో చదివిన పిల్లలు మాతృభాషా మాధ్యమంలో చదివినవారికంటే తెలివిగా ఉంటారనుకుంటా?*

జ: ఆంగ్లభాషామాధ్యమ బోధనలో చదివిన పిల్లల్లో ప్రశ్నించే ధైర్యం, అవకాశం, సాహసం తగ్గి, జంకు, సిగ్గు, మొహమాటం పెరుగుతాయి.

*ప్ర: ఈ దురంతాన్ని ఆపుచేయడానికి ఏం చేయాలి:*

జ: ప్రజల్లో, ముఖ్యంగా తల్లిదండ్రులకూ, విద్యార్థులకూ మాతృభాషా మాధ్యమ బోధనపై అవగాహన కల్పించాలి. అందరికీ బడి భాషగా తెలుగు ఉండాలి అనే భావన కలగాలి. కేజీ–టు–పీజీ ఆంగ్లభాషా మాధ్యమ విద్యతో లాభాలకంటే నష్టాలే ఎక్కువ అని తెలియజెప్పాలి. ఇన్ని కోట్లమంది మాట్లాడే తెలుగు భాషను బోధనాభాషగా బడినుంచి తొలగించటం అవగాహనా రాహిత్యం, కుసంస్కారం, ప్రపంచంలో ఎక్కడా లేనిదీ, భారత దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనిదీ– తెలుగు రాష్ట్రాలలోనే ఎందుకు జరుగుతోందో తెలియజెప్పాలి. తెలుగు భాషామాధ్యమ ఉద్యమం సాగాలి. ఆధునిక సమాజంలో బడి భాషగా ఉండని భాష బతకలేదు. **ఆ సమాజం కత్తీ, నెత్తురు,లేకుండానే బోధనా మాధ్యమంగా ఆంగ్ల భాషతో అంతరిస్తుంది.**

*ప్ర: బోధనా మాధ్యమానికి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి ఎలా ఉంది?*

జ: స్థూల జాతీయోత్పత్తిలోనూ, అక్షరాస్యతలోనూ మనకంటే మిన్నగా ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వం గానీ, తమిళనాడు ప్రభుత్వం గానీ, కర్ణాటక ప్రభుత్వం గానీ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం గానీ మరే రాష్ట్రంలోనూ ఇలాంటి అనాగరిక, అనైతిక, అశాస్త్రీయ బుద్ధిహీన చర్య చేపట్టలేదు. మరి తెలుగు రాష్ట్రాలలోనే ఏమిటి ఈ వైపరీత్యం!?

*ప్ర: బోధనా మాధ్యమంగా లేకుండా ఇంగ్లీషును బాగా నేర్చుకోడానికి వీలవుతుందా?*

జ: వీలుఅవుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నది అదే. ఇంగ్లీషును ఒక విషయంగా(సబ్జెక్టుగా) నేర్చుకోవాలి. **ఇంగ్లీషును ఇంగ్లీషువాడికి నేర్పినట్టుగాకుండా ఆంగ్లభాషేతరులకు రెండవభాషగా నేర్పే విధానంలో నేర్పాలి.** అంతేగాక **అపసరణ వ్యాకరణ పద్ధతిలో నేర్పాలి.** మాతృభాషతో విభేదించే వ్యాకరణభాగాన్ని మాత్రమే నేర్పితే సరిపోతుంది.

ప్ర: కార్పొరేట్ ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో 25% ప్రవేశాలు రిజర్వేషన్లను అమలుచేయాలి.

ప్ర: తెలుగు మాధ్యమం ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటే సరిపోతుందా?

జ: సరిపోదు. కార్పొరేట్ ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో అన్నింటా బోధనాభాషగా మాతృభాషలే ఉండాలి. అర్ధ శతాబ్దం పైగా ఇదే విషయాన్ని ఆచరణలో పెట్టమని ఐరాసవారి విద్యా వైజ్ఞానిక సంఘం ప్రతియేటా వివిధ దేశాల ప్రభుత్వాలకు తాఖీదులు పంపుతూనే ఉంది. **వలసదేశాలుగా ఉండిన దేశాలు తప్ప మిగిలిన అన్ని దేశాలూ ఆచరణలో పెట్టి 90%-100% అక్షరాస్యతను సాధించినై.** వలసదేశాలుగా ఉండిన మన దేశంలాంటి దేశాలు సంపూర్ణ అక్షరాస్యతను సాధించలేకపోవటానికి కారణం ఆంగ్లభాషా మాధ్యమాన్ని ప్రవేశపెట్టడమే.

# నడిగూడెం (సూర్యాపేట జిల్లా-తెలంగాణ)లో జులై 13న చారిత్రాత్మకంగా జరిగిన కొమఱ్ఱాజు లక్ష్మణరావు శతవర్ధంతి సభ




కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారి శతవర్ధంతి సభ సూర్యాపేట జిల్లా నడిగూడెంలో కళాప్రపూర్ణ నాయని వెంకట రంగారావు భవనంలో 2023 జులై 13న వైభవంగా జరిగింది. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు సాహితీ సాంస్కృతిక సమాఖ్య నిర్వహణలో జరిగిన ఈ సభకు తెలంగాణ సాహిత్య పరిషత్ అధ్యక్షులు శ్రీ జూలూరి గౌరీశంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా భారత జాగృతి అధ్యక్షురాలు శాసనమండలి సభ్యురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రివర్యులు, శాసనసభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ పాల్గొనవలసి వుండగా కల్వకుంట్ల కవిత ఇతర అత్యవసర పనుల వల్ల రాలేకపోయారు. విశిష్ట అతిధులుగా తెలంగాణ వ్యవసాయ శాఖా మాత్యులు శ్రీ సింగిరెడ్డి నిరంజన రెడ్డి, తెలంగాణా విద్యుత్ శాఖామాత్యులు శ్రీ జి.జగదీశ్వరరెడ్డి, ప్రముఖ కవి, వాగ్గేయకారులు శ్రీ గోరటి వెంకన్న పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా శ్రీ జస్టిస్ రామలింగేశ్వరరావు (హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి) బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీ సోము భరత్‌కుమార్, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు, 'అమ్మనుడి' పత్రిక సంపాదకులు డా.సామల రమేష్‌బాబు, సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, సమాఖ్య ఉపాధ్యక్షులు, విశ్రాంత ఐ.ఏ.ఎస్ అధికారి శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు, ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ మాశర్మ, డా. గుమ్మా సాంబశివరావు మున్నగువారు పాల్గొన్నారు. అందరూ చక్కటి ప్రసంగాలు చేశారు.సభలో పెద్దసంఖ్యలో ఉన్నత విద్యావంతులు, భాషాసాహితీ రంగాల్లో విశిష్ట కృషిచేస్తున్నవారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన 'కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు శతవర్ధంతి స్మృతి సంచిక' పేరిట ఒక ఉద్గ్రంథాన్ని, లక్ష్మణరావుగారి ప్రత్యేక రచన- 'తెలుగు భాషాతత్వము'నూ విడుదల చేశారు. నడిగూడెంలో జరిగిన ఈ సభను మొత్తం వీక్షించిన వారంతా ముమ్ముందు ఇదొక గొప్ప భాషాసాహితీ కేంద్రంగా విలసిల్లగలదనే అభిప్రాయంతో, ఒక చారిత్రాత్మక సభలో పాల్గొన్న సంతృప్తిని వెల్లడించారు.

ఈ మొత్తం కార్యక్రమాల నిర్వాహణకు బాధ్యులైన సమాఖ్య అధ్యక్షులు శ్రీ.కె.జితేంద్రబాబు, దక్కన్ ఆర్కైవ్& అండ్ కల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి కన్నెగంటి హిమబిందు అందరి అభినందనలకు పాత్రులైనారు.

## సభాధ్యక్షులు శ్రీ జూలూరి గౌరీశంకర్ ప్రసంగం



కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారి శత వర్ధంతి ఉత్సవాలను కొమఱ్ఱాజు లక్ష్మణ రావు సాహిత్య సాంస్కృతిక సమాఖ్య, దక్కన్ ఆర్కైవ్స్, నడిగూడెం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం నిజంగా ఈ ప్రాంతంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ఆనందించవలసిన విషయం. ఈ కార్యక్రమానికి ప్రారంభకులుగా విచ్చేసినటువంటి విద్యుత్ శాఖామాత్యులు గుంతకల్ జగదీశ్వర్ రెడ్డి గారికి, వేదిక మీద ఉన్నటువంటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శాసన మండలి సభ్యులు గోరటి వెంకన్న గారికి, సాహిత్యం అంటే ప్రాణంగా జీవిస్తున్న మాజీ మంత్రివర్యులు, అలాగే ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషనర్ అయిన జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు గారికి నా హృదయపూర్వక నమస్సులు. నల్గొండ ఉమ్మడి జిల్లాకు కలెక్టర్‌గా పని చేసిన మాజీ ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు గారికి, తెలుగు భాష గురించి కొన్ని దశాబ్దాలుగా పత్రికలు నిర్వహిస్తూ నడిపిస్తున్న డా.సామల రమేష్ బాబు గారికి, సీనియర్ పాత్రికేయులు ఆంధ్ర పత్రిక సంపాదకులు మాశర్మ గారికి, కార్యక్రమం నిర్వహిస్తున్నటువంటి శ్రీ జితేంద్రబాబు గారికి నమస్సులు. ఈ నడిగూడెం కేంద్రంగా అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ గా ఉన్నటువంటి శ్రీమతి హిమబిందు గారికి ప్రత్యేకంగా ఈ ఊరువాసిగా అభినందిస్తున్నాను.

ముఖ్యంగా ఈరోజు కొమర్రాజు గారిని స్మరించుకుంటూ ఇక్కడికి రావడం, గొప్పగా ఈ సదస్సులు నిర్వహించుకోవడం ఆనందదాయకం. ఇంత గొప్ప సదస్సు మనం నడిగూడెంలో నిర్వహించుకుంటున్నప్పటికీ ఈ విషయాన్ని ప్రపంచం మొత్తం తెలియచేయటానికి కావలసినటువంటి కార్యక్రమంగా దీనిని చూడాలి. ఈ నడిగూడెంకు, మునగాల పరగణాకి కూడా గొప్ప చారిత్రక వారసత్వం ఉంది. అంటే నడిగూడెం చారిత్రక వారసత్వాన్ని కూడా మననం చేసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నడిగూడానికి ఉన్నటువంటి చరిత్ర చాలా గొప్పది. నడిగూడానికి పోరాట వారసత్వం ఉంది. సాహిత్య సాంస్కృతిక రంగాల్లో ఎంత ఉన్నతమైనటువంటి స్థాయి 100 సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతంలో జరిగింది. అది అందరూ గర్వించాల్సిన విషయం. సాంస్కృతిక రంగాలకు వారు చేసినటువంటి ఎనలేని సేవను ఈరోజు మనం గుర్తు చేసుకోవాలి. తెలుగు భాషకు, తెలుగు భాషలో ఉన్నటువంటి విశేషాలు చరిత్ర అంటే ఎంత గొప్పదో, గతం కూడా అంతే గొప్పది. గతానికి, వర్తమానానికి సంబంధించిన అంశాన్ని క్రోడీకరించుకుంటే మాత్రమే అది భవిష్యత్తుకు కావలసినటువంటి ఒక దృష్టిని ఇస్తుంది. ఒక వంద సంవత్సరాల క్రితం మనిషి గురించి, వంద సంవత్సరాల క్రితం జరిగినటువంటి సంఘటన గురించి -ఎందుకు మాట్లాడుకుంటున్నామంటే ఒక దార్శనికత ఉన్నటువంటి మనిషి కొమఱ్ఱాజు వారు. చాలామంది వర్తమానంలోకూడా కనిపిస్తారు. అటువంటి వారే నాయిని వెంకట రంగారావు గారు, మా నడిగూడెం మునగాల పరగణా వారే! ఇక్కడ ఉన్నటువంటి శక్తి ఏమిటంటే, తుపాకులకు, తూటాలకు మాటలు నేర్పినటువంటి కేంద్రం కూడా ఈ నడిగూడ ప్రాంతము, మునగాల పరగణాయే!

సాహిత్యానికి సంబంధించి గొప్ప దార్శనికతను కూడా అందించింది నడిగూడెం. నడిగూడెం ప్రాంతం నుంచి విచ్చేసిన ఒక కార్యక్రమం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంగా హైదరాబాదు నడిబొడ్డున వెలయటం, వరంగల్లో రాజరాజ నరేంద్ర గ్రంథాలయంగా వెలయడం, తెలంగాణలో 125 గ్రంథాలయాలు నడపడం, తెలుగుభాష కోసం కృషి చేయడం, తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలను అచ్చు వేయడం, ఇక్కడ ఈ ప్రాంతం చేసిన గొప్ప భాషా సేవ. ఈరోజు నేను చాలా గర్వపడుతున్నా, కొమఱ్ఱాజు లక్ష్మణరావు నడయాడినటువంటి ప్రదేశం లో నేను పుట్టాను. అదే ప్రాంతంలో తిరిగాము. ఇక్కడ నడియాడిన సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నాము. ఇది నిజంగా కొమర్రాజు గారు చేసినటువంటి కృషి. ఎక్కడో తెలుగువాడిగా ఉన్నవాడు, మహారాష్ట్రకు వెళ్లడమేమిటి? నాగపూర్ లో చదువుకోవటం ఏంటి ? నాగపూర్ లో బిఎ, ఎంఎ చదువుకోవడం, అక్కడ మరాఠీ నేర్చుకోవడం, అక్కడ మరాఠీ పత్రికకు ఉపసంపాదకుడిగా పని చేయడం, మరాఠీ పత్రికకు సంబంధించి అనేక రకాల సాహిత్య సృష్టి చేయడం, ఇప్పటికి నాగపూర్ లో ఆయన ఫోటోకి నమస్కరిస్తూ పూజ చేస్తున్న పరిస్థితి ఉండడం చాలా గొప్ప విషయం.

దివాన్‌జీగా కొమఱ్ఱాజు గారు ఇక్కడికి రావడం, ఆ రాక వెనుక ఉన్న కారణాలను వేదిక మీద ఉన్న పెద్దలందరూ కూడా వివరిస్తారు. కొమఱ్ఱాజు గారు చాలా గొప్ప సాహిత్య సృష్టి చేశారు. ఈరోజు అంటే చాలా వరకు ప్రచార, ప్రసార సాధనాలు ఉన్నాయి కాబట్టి అన్ని విషయాలను ఇట్టే చెప్పగలుగుతున్నాం. కానీ 100 సంవత్సరాల క్రితం ఇంగ్లీషులో ఉన్న ఒక పుస్తకాన్ని, తెలుగులోకి అనువదించి అది తెలుగుజాతికి అంకితం చేసినటువంటి పరిస్థితి అప్పుడే ఉందంటే ఆలోచించాల్సిన అంశమే! అబ్రహం లింకన్ మీద తొలిసారి అనువాదాన్ని వెలువరించారు. ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రప్రదేశ్ కు, మొత్తం తెలుగుజాతికి సంబంధించినటువంటి ఒక గొప్ప ఔన్నత్యాన్ని అందించినటువంటి చరిత్ర ఈ ఊరికి, ఈ ప్రాంతానికి ఉంది. దానిని మననం చేసుకోవడం ఆనందదాయకం.

46 సంవత్సరాలు జీవించినటువంటి ఒక వ్యక్తి ఇన్ని గొప్ప పనులు ఎలా చేయగలిగాడు? అన్న విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వయసు రావడం గొప్ప విషయం కాదు, సంవత్సరాలు పెరగడం అంతకన్నా గొప్ప విషయం కాదు, శ్రీ శ్రీ అన్నట్టు తారీఖులు దస్తావేజులు కాదు. వాళ్ల సాహిత్యం కోసం చేసినటువంటి ఒక గొప్ప కృషి మాత్రం మనం మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మీది ఏ ఊరు అంటే తెలంగాణలో ప్రతి ఊరికి ఒక చరిత్ర ఉంది. మాది నడిగూడెం అని చెప్పుకుంటే చాలా గర్వంగా చెప్పుకుంటాను. నేను రాయలసీమ, తెలంగాణ మొత్తం ప్రాంతాలు తిరిగాను. మీది ఏ ఊరు అని ఎవరైనా అడిగితే మాది నడిగూడెం అనే విషయం చెప్పేవాడిని. నడిగూడెం అంటే ఒక సాహిత్య,

సాంస్కృతిక చరిత్ర. ఇక్కడ ఒక మిళితమైన భిన్నమైన చరిత్ర. ఈ ప్రాంతానికి పోరాట చరిత్ర కూడా ఉంది. ఈ నడిగూడెం ప్రాంతం మునగాల పరగణాలో ఘనమైన వారిని తన ఒడిలో పెట్టుకొని దేశానికి, ప్రపంచానికి అందించింది. అలా అందించిన వారిలో కొమఱ్ఱాజు లక్ష్మణ్ రావు గారు ముఖ్యులు. చాలా గొప్ప సాహితీవేత్త ఈ నడిగూడెం ప్రాంతం నుంచి వచ్చారు. నాయని వెంకట రంగారావు కూడా చాలా గొప్ప సేవ చేశారు. ఇవాళా రేపూ పత్రికలు నడపటానికి, అచ్చు వేయటానికి పుస్తకాలు ప్రచురించడానికి తెలుగుభాష కోసం చాలా డబ్బును వ్యయం చేశారు. కాబట్టి అందరినీ కోరేదేమిటంటే సాహిత్య పోషకుడుగా ఉన్నవారు కాలగర్భంలో కలిసిపోరు. ఎప్పుడూ చిరస్థాయిగా నిలుస్తారు అనడానికి ఈ సదస్సు ఒక ఉదాహరణ. కార్యక్రమ నిర్వాహకులైన కొమఱ్ఱాజు లక్ష్మణరావు సాహిత్య సాంస్కృతిక సమాఖ్య వారికి దక్కన్ ఆర్కైవ్స్, నడిగూడెం వారికి అభినందనలు.
(గమనిక: సభాధ్యక్షులు అతిథులందరినీ పేరు పేరునా ప్రస్తావించి తమ గౌరవాభినందనలు తెలియజేశారు.స్థల విస్తరణ భీతితో తక్కిన పెద్దల ప్రసంగాలలో వారి పేర్లను ప్రస్తావించడం లేదు.)

**శ్రీ మండలి బుద్ధప్రసాద్, మాజీ మంత్రివర్యులు**

తెలుగుజాతి చరిత్రలో గుర్తుంచుకోవలసిన రోజు. కానీ తెలుగు ప్రజలందరికీ గుర్తులేదు.



తెలుగుజాతి వైతాళికులలో ఒకరైన కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు అస్తమించి వంద సంవత్సరాలు అయింది. ఈరోజు తెలుగుజాతి ఎక్కడ ఉన్నా కూడా ఆయనను స్మరించుకోవలసిన రోజు. కానీ మన జాతిలో పుట్టిన మహనీయులను మర్చిపోవడం నేటి మన జాతి లక్షణం అయ్యింది. కానీ ఇవాళ యావత్ తెలుగుజాతికి చెందిన అనేక సాహితీవేత్తలు, మంత్రివర్యులు రావడం జరిగింది ఈ నడిగూడెం ప్రాంగణంలో చాలామంది అడుగుపెడితే ఏదో తెలియని స్ఫూర్తి మనలో ప్రవేశిస్తుంది. ఇలాంటి పుణ్యభూమికి మమ్మల్ని అందరినీ ఆహ్వానించారు. ఇది ఆనందదాయకమైన విషయం. ఈ ప్రాంగణం తెలుగుజాతి ప్రభావానికి పునాది వేసిన ప్రాంతం ఇది. రాజా నాయిని రంగారావు గారు, శ్రీకృష్ణదేవరాయల్లాగా ఒక రాజరాజనరేంద్రుడిలాగా యుగంలో గుర్తించుకోవాల్సిన వ్యక్తి. రాజా నాయిని రంగారావుగారు విరాళమివ్వని సంస్థగానీ, వ్యక్తులుగానీ ఉండేవారు కాదు. ఇక్కడే వ్యవసాయ శాస్త్రం రాశారు. కొత్త వంగడాలని రూపొందించారు మునగాల క్షేత్రంలో. మహాత్మాగాంధీ కోరిక మేరకు పింగళి వెంకయ్యగారిచేత త్రివర్ణ పతాకము తయారుచేయించి ఇచ్చారు నాయిని వెంకట రంగారావు గారు. అలాగే సమగ్ర తెలుగుజాతి చరిత్రను మనం తయారు చేసుకోలేకపోయాము. ఈనాటికి కూడా శాసన పరిష్కారాన్ని కనుగొనే పరిస్థితుల్లోనే ఉన్నాము. అంటే ఆయన ఆశించిన లక్ష్యాల్ని అందిపుచ్చుకొని నడిపించలేకపోయాము. ఇది మనం ఆలోచించవలసిన అంశము అని తెలియజేస్తున్నాను. శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలుగు రావాలని కొమఱ్ఱాజు వారు ఆశించారు. కానీ ఇప్పుడు మాతృభాషలో బోధనే ఆంధ్రప్రదేశ్‌లో గగనం అయిపోయింది. తెలంగాణలో తెలుగు గురించి ఇంకా పాటు పడుతున్నారు, కానీ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమాన్ని తీసివేసే పరిస్థితి వచ్చింది. అంతేకాదు ఆంధ్రప్రదేశ్‌లో పిల్లలు తమ పేర్లను తెలుగులో రాసే పరిస్థితుల్లో లేరు. ఇదేనా కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు గారు ఆశించింది? అనేది ఒక్కసారి ఆలోచించవలసిన విషయం. ఒకప్పుడు యూనివర్సిటీ అంటే సర్వమత ఆవాసం అని రాసేవారు పూర్వం. కానీ దానికి విశ్వవిద్యాలయం అనే పదాన్ని సృష్టించింది కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు గారు. ఇప్పుడు ఏ పత్రిక చూసినా సంపాదకీయం అని పెడుతున్నారు, కానీ పూర్వం పత్రికాధిపతి అని పెట్టేవారు. సంపాదకుడు అనే పదాన్ని సృష్టించింది కూడా కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారే. ఇలా అనేక పదాల సృష్టికర్త ఆయన, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన నిఘంటువు ఏర్పడాలని సరైన పదజాలం రూపొందించాలని చాలా తాపత్రయపడేవారు. ఆంధ్రపత్రిక సంచికలో పురాతన భాష అవసరమా? కానే కాదు కాదు అంటూ ఒక వ్యాసం రాశారు. ఆరోజు ఆ వ్యాసం మనకు ఆధారం అయింది. ప్రాచీన భాషగా గుర్తించాలని చెప్పి మనం అడగగలిగామంటే, మూల ద్రవిడ భాషల్లో తెలుగు ఏ విధంగా ప్రాచీనము అన్న విషయాన్ని ఆయన ఉదాహరణలతో సహా ఆ వ్యాసంలో చెప్పటం జరిగింది.

ఒక నదిలో పాయ చీలినప్పుడు పేర్లు వేరైనప్పటికీ అన్నీ సమానమే! అదే విధంగా మన భాష ప్రాచీనమైనది. ఫలానా భాష ప్రాచీనమైనది కాదు అని చెప్పడం సమంజసం కాదని దాంట్లో చెప్పడం జరిగింది. ఆయన రాసిన 70 ఏళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం తమిళాన్ని ప్రాచీనభాషగా గుర్తించడం జరిగింది. దానికి 80 ఏళ్లకు పూర్వమే ఇటువంటి పరిస్థితి వస్తుందని, ఊహించి మూల ద్రావిడ భాషల్లో తెలుగే ప్రాచీనమైనది అని నిరూపించిన మహోన్నత వ్యక్తి కొమఱ్ఱాజు వారు. దాని ఆధారంగానే మాది సంస్కృత జన్యమైన భాష కాదు అని కేంద్ర సాహిత్య అకాడమీ తేల్చి చెప్పింది. తెలుగు సంస్కృత జన్యమైన భాష అవునా కాదా అనే మీమాంస నడుస్తున్నప్పుడు మనం కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారిని స్ఫూర్తిగా తీసుకోవలసిన అవసరం తెలుగుజాతి మొత్తానికి ఉందని తెలియజేస్తున్నాను. ప్రాచీన భాషగా తెలుగు గుర్తించబడటం కాదు, ప్రపంచ భాషగా తెలుగు వర్ధిల్లే విధంగా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలుగు వ్యక్తి పైన ఉందని, అప్పుడే కొమఱ్ఱాజు వారికి నిజమైన ఆత్మశాంతి కలుగుతుందని మనవి చేస్తున్నాను. అతను చాలా దూరదృష్టి కలిగిన వ్యక్తి. అప్పట్లో తెలుగు ప్రాచీన కావ్యాల మీద మాత్రమే పరిశోధన జరుగుతూ ఉండేది. ప్రాచీన కావ్యాల గురించే మాట్లాడటం జరిగేది. తెలుగు వారికి ప్రాపంచక దృష్టిని పరిచయం చేసి, ఇతర దేశాల్లో ఉన్న నాయకుల గురించి, ఇతర రాష్ట్రాల్లో ఉన్న పెద్దల గురించి తెలియజెప్పిన వ్యక్తి కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు. ఆ వయసులో శ్రీకృష్ణదేవరాయల పేరిట ఆంధ్రభాషా నిలయాన్ని హైదరాబాదులో స్థాపింపచేసి, కృష్ణదేవరాయల మూర్తి ఇలా ఉంటుందని జాతికి తెలియజేసిన వ్యక్తి కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారు. ఆయన మనకు ప్రాతఃస్మరణీయుడు కావాలి. వారి యొక్క స్ఫూర్తితో తెలుగు భాషను మనం ముందుకు తీసుకువెళ్ళినప్పుడు, ఆయన కోరుకున్న విధంగానే శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలుగు

వికసించినప్పుడు, మాతృభాషలో విద్యాబోధన జరిగినప్పుడు మాత్రమే వారికి మనం అందించే గొప్ప నివాళి అవుతుంది. నాకు ఈ అవకాశాన్ని కల్పించి, ఈ మాటలు పంచుకునే అవకాశాన్ని నాకు ఇచ్చిన జితేంద్రగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

**శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు గారు**



చాలాకాలం క్రితం రాసిన ఒక సంపాదకీయంలోని వాక్యం ఈ సందర్భంగా మీతో పంచుకోవాలనుకుంటున్నాను. అప్పటి తరానికి, ఇప్పటి తరానికి తేడా ఏమిటంటే, అప్పటి వారంతా దేశం కోసం జీవితాన్ని ధారపోశారు. నేటి తరం వారు తమ కోసం దేశాన్ని ధారపోస్తున్నారు.

కందుకూరి వీరేశలింగం, పింగళి వెంకయ్య, నాయిని వెంకట రంగారావు వంటి ఎందరో మహానుభావులందరూ ఆ రోజుల్లో ఏమి ఆలోచన చేశారు? ఎలా జీవించారన్న విషయాలపై చర్చించి మనల్ని మనం సంస్కరించుకోవడానికి ఇదొక వేదికగా నేను భావిస్తున్నాను. మనం ఒక జాతిగా సంతోషపడతాం, ఒక జాతిగా స్ఫూర్తిని పొందుతాం, ఒక జాతిగా అనుభూతి చెందుతాం, ఒక జాతిగా ఆత్మగౌరవాన్ని పొందుతాం. జాతి నిర్మాణంలో మనం నేర్చుకోవాల్సింది, నేర్పించాల్సింది ఏమిటంటే జాతి నిర్మాణంలో మహానుభావులు చేసినటువంటి కృషి, వారు చేసిన త్యాగాలు గురించి మాత్రమే! అలా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముఖ్యంగా కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులు గారి 'హిందూ మతాంగం' అనేటువంటి పుస్తకం చాలా గొప్ప పుస్తకం. ఆ పుస్తకం ఏన్షియంట్ ఇండియన్ హిస్టరీని పరిచయం చేయడమే కాకుండా, నలమహారాజు కాలమాన పరిస్థితులు ఆనాటి సామాజిక పరిస్థితులు జీవనము అప్పటి ప్రజల జీవితంలో ప్రభువుకి, ప్రజలకి మధ్య ఉన్నటువంటి అసమాన మమతానురాగాలు అన్నీ ప్రస్తావనకు వస్తాయి. ఇంకొకటి ఏమిటంటే ప్రపంచంలో జరుగుతున్నటువంటి అనేక సంఘటనలు దాని మీద శాస్త్ర విజ్ఞానము, ఈ ప్రజలకు ఏం కావాలి, ఇవన్నీ వంద సంవత్సరాలు క్రితం కొమఱ్ఱాజు వారు రాయడం జరిగింది. అంటే 100 సంవత్సరాలకు పూర్వమే ఆయన ప్రపంచ శాస్త్ర విజ్ఞానాన్ని మన గడపలో నిలబెట్టారు. మన ఇంట్లోకి చొప్పించారు. అయితే మనం ఇప్పుడు ప్రతిదానికీ సెర్చ్‌కి వెళుతున్నాం. ఇది జరుగుతున్నటువంటి వాస్తవం. అయితే కొమఱ్ఱాజు పంతులు గారిని ఎందుకు జ్ఞాపకం చేసుకోవాలి అంటే తెలుగువారి జాతి ఔన్నత్యాన్ని, తెలుగువారి విజ్ఞాన వికాసాన్ని పెంచడం కోసం ఆయన చేసినటువంటి కృషి, అటు చరిత్రని, ఇటు విజ్ఞాన శాస్త్రాన్ని పరిచయం చేసినటువంటి మహానుభావుడు, 'విజ్ఞానచంద్రిక' నుంచి ఆయన చాలా పబ్లికేషన్స్ తీసుకొచ్చారు. అలాగే విజ్ఞానకోశం నిర్మించడానికి కూడా చాలా విలువైన కృషి చేశారు. ఆయన రాసిన ఒక్కొక్క పదం వింటుంటే ఆ రోజుల్లో ఎంత శ్రమకోర్చారో అర్థమవుతుంది. సాధు వెంకట సుబ్రహ్మణ్యం గారు తిరుమల తిరుపతి శాసన పరిష్కారం రాత్రి 11:00 నుండి కూర్చొని చేసేవారు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు అన్నమాచార్యుల కీర్తనల పరిష్కారం కోసం రోజు కడుపులో నొప్పిని తట్టుకొని కృషిచేశారు. అలాంటి వైతాళికులని, మనం గుర్తు చేసుకున్న సమయంలో ఒక మంచి పరిస్థితి అంశాన్ని పరిచయం చేసి ముగిస్తాను. ఒక కళాకారుడు యొక్క ఉత్తమత్వం ఎలా ఉంటుంది అనేదానికి కొమఱ్ఱాజు వారు ఒక ఉదాహరణ చెప్పారు. ఎక్కడో ఎవరో పాశ్చాత్యులు మన చిత్రకారుల మీద పుస్తకాల రాస్తూ, వీరి చిత్రాలు మనుషుల రూపాలకి దగ్గరగా ఉండవు, భారతీయులది ఒక పిచ్చి చిత్రకళ అన్నారు. దాని మీద ఆయనకు కోపం వచ్చి చిత్రకళ రెండు రకాలుగా ఉంటుందని, అందులో ఒకటి సహజ చిత్రకళ, మన దగ్గర కూడా చాలా ఉంది. చిత్రాలు చాలా ఉన్నాయి, మరొకటి ఆధునిక చిత్రకళ, ఆగమశాస్త్రంపై ఆధారపడి ఉంటుంది. ఆదిదేవతలు వంటి వ్యక్తుల యొక్క రూపాలకు సంబంధించిన రూపఛాయ శాస్త్రం వంటివి ఉన్నాయి. వాటి గురించి మీకు తెలియక మీరు చెబుతున్నారు అని సమాధానం చెప్పడం జరిగింది. అంతటి లోతైన పరిశోధనాత్మకత వారిది.

మరొక చోట, ఆంగిక అభినయం గురించి చెబుతూ, దుష్యంతుని చూసిన తర్వాత తిరిగి వెళ్తున్న శకుంతల వెనక్కి వెళ్తూ వెళ్తూ వెనక్కి చూసింది అన్న వాక్యాన్ని మరింత లోతుగా ఒక సీన్ ని రాసేశారు కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు. అసలు భారతదేశంలోని విద్యా విధానంలోనే మొట్టమొదటి సూత్రం ఏమిటంటే నీకు తెలిసిన విద్యను పదిమందికి నేర్పాలి నేర్పకపోతే పాపం చేసినట్లు. ఇది భారతీయ ధర్మం. ఆ ధర్మం ప్రకారం జీవించినటువంటి మహానుభావుడు కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు ఒకరు. అలాంటి గొప్ప వారు ఈ కాలంలో ఉండరు గనుక వారిని గుర్తు పెట్టుకుందాం, అభిమానిద్దాం, చర్చిద్దాం, వారిని గౌరవిద్దాం లోకానికి ఇంత జ్ఞాన సంపద అందిస్తున్న మహాపురుషుల్ని గౌరవిద్దాం అనే ఒక నిర్ణయం తీసుకున్నట్లయితే, అదే కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారికి నిజమైన నివాళి!

**వాగ్గేయకారులు శ్రీ గోరటి వెంకన్న**



గౌరవనీయులైన సభకు విచ్చేసిన పెద్దలందరికీ నా నమస్కారం. 1994 లోనే ఈ నడిగూడెం ప్రజలతో ఇక్కడి నాయకులతో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. శివసాగరు, త్రిపురనేని శ్రీనివాస్, ఖాదర్ మొయిద్దీన్ , ప్రసేన్ తదితరులు 1994 లో సాహిత్య సభలు పెట్టి తెలంగాణ అస్థిత్వ ఉద్యమాలపై చర్చించినప్పుడు నేనూ పాల్గొన్నాను. నాకు మంచి మిత్రులు, నేను గురువుగా భావించే జితేంద్రగారి ఆధ్వర్యంలో కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారి శతవర్ధంతి కార్యక్రమం జరుగుతుండడం ఆనందదాయకం. ఇప్పుడు లక్ష్మణరావుగారి ప్రాసంగికత ఎందుకు అనే అనుమానం కొంతమందికి ఉండవచ్చు. మల్లంపల్లి సోమశేఖర్ శర్మ 'మహమ్మదీయులు' అనే పుస్తకాన్ని రాస్తూ మహమ్మదీయులంతా చెడ్డవారు, హిందువులంతా గొప్పవారు అని విభేదించడం సమంజసం

కాదు, ఎందుకంటే అందులో మంచి ఉంటుంది ఇందులో చెడు ఉంటుంది అన్నారు. ఆలాగే ప్రాంతీయ ఘర్షణలు వద్దని గాంధేయవాదం తెలుగు నేల మీద వేళ్ళూనుకోక ముందే ఎలుగెత్తి చాటిన వారు కొమర్రాజు లక్ష్మణరావుగారు. జాషువా కంటే ముందే మంగిపూడి వెంకట శర్మ అస్పృశ్యత జాతిని ఎలా పట్టి పీడిస్తుందనే విషయాన్ని ఎత్తి చూపి, ఆ జాడ్యం వదలకుంటే జరిగే అనర్థాలని వివరించారు. అదే విధానంలో కొమర్రాజు లక్ష్మణరావు గారు కూడా అస్పృశ్యత నివారణకు సంబంధించి ప్రస్తావించారు. అందుకని కొమర్రాజు గారి ప్రాసంగికత ప్రస్తుతం అవసరం.

ప్రపంచీకరణ పేరుతోటి భాష, జాతుల అస్తిత్వాన్ని నాశనం చేస్తున్న నేటి సమాజంలో కొమర్రాజు లక్ష్మణరావు గారి వంటి భాషాభిమానుల అవసరం ఎంతైనా ఉంది. అలాంటి వారిలో జితేంద్ర గారు కూడా ముఖ్యులు. ఎందుకంటే భాష అంటే ఉనికి, భాష-మనిషి అవి వేరు వేరు కాదు . మనిషి అస్తిత్వం, ఉనికి,స్వాభిమానం, జీవన ప్రయాణం అన్నీ కూడా భాషతో ముడిపడి ఉంటాయి. కనుక విదేశీ శక్తులు మొట్టమొదట దాడి చేసింది భాష మీదనే! అదే తరహాలో ప్రపంచంలోనే అనేక భాషలు, అనేక జాతులను నాశనం చేశారు. కనుక భాషను కాపాడడం అంటే మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమే!

నా ఉద్దేశంలో జాతి, భాష ఒక్కటే! తెలుగు భాషలో ఒక వేమన ఉంటాడు. ఆయన రాసిన తాత్త్వికత సామ్రాజ్యవాదులందరికీ ఇష్టం ఉండదు. భాషను పాడు చేస్తే, భాష ద్వారా ఉనికిని పాడు చేస్తే, మనుషులను మార్కెట్లోకి అనుగుణంగా మార్చుకోవచ్చు అనేది సామ్రాజ్యవాదుల కుట్ర. మార్కెట్ శక్తులను అధిపత్యాన్ని ధిక్కరించడం అవసరం. అప్పుడే భాష సజీవంగా, జీవభాషగా నిలబడుతుంది. దానికి ఉదాహరణ హిందీ భాషా పెద్దలను ధిక్కరించిన తమిళ భాషాభిమానం. దానివల్లే భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే ఒక ప్రత్యామ్నాయ భాషగా ఎదిగింది అన్నది వాస్తవం. వారు తిరుక్కోలు రాసినా, బహిరంగ ప్రదేశాల్లో ఏదైనా కొటేషన్ రాసినా- వారి భాషలోనే కనిపిస్తుంది.

జాతి వినాశనానికి సామ్రాజ్యవాదుల కుట్రలను గమనిస్తే, భోగరాజు పట్టాభి సీతారామయ్య పెట్టిన ఆంధ్రాబ్యాంక్ ఇప్పుడు లేకుండ పోయింది. హైదరాబాద్ బ్యాంకు పేరు మారిపోయింది. విశాఖ ఉక్కు కర్మాగారం తన అస్థిత్వాన్ని కోల్పోబోతొంది. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? ఎందుకు మారిపోతున్నాయి, ఎవరికోసం మారుతున్నాయి? సామ్రాజ్యవాదులు మన భాషని, మనుషులని శత్రువులుగా పరిగణించి దాడి చేస్తున్నారు. కనుక రచయితల కన్నులు కచ్చితంగా ఇలాంటి దుశ్చర్యలపై దృష్టి సారించాలి. ఆధిపత్యాన్ని ధిక్కరించే సంస్కృతి మన జీవితంలో, మన ఆచరణలో భాగం కావాలి. విజ్ఞాన చంద్రికా మండలిని చెన్నైలో నెలకొల్పినా, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం హైదరాబాదులో స్థాపించినా తనకున్న చిన్న జీతంతోనే ఎన్నో ప్రయాసలకోర్చి కేవలం భాషమీద మమకారంతో, భాష కోసం, ప్రత్యామ్నాయ విలువల కోసం తపనపడిన వ్యక్తి, కేవలం 46 సంవత్సరాల లోపే కాలం చేసిన నిస్వార్థ భాషాసేవకుడు, మహానుభావుడు కొమర్రాజు వేంకట లక్ష్మణరావుని వారి శతవర్ధంతి సందర్భంగా గుర్తుచేసుకోవడం సముచితం.

తెలంగాణలో 1400 యక్షగానాలు ఉన్నాయంటే కొమర్రాజు వారికంటే పూర్వమే తెలుగు భాషాభిమానం ఏ స్థాయిలో ఉండేదో అర్థమవుతుంది. ప్రశ్నించే సంస్కృతి తెలంగాణ వాదుల్లో ఉందంటే వారికి ఉన్న భాషాభిమానం అంత గట్టిది. అలాంటి భాషాభిమానం ఉన్నవారు ఒక ఉద్యమకారుడుగా మారతాడు. **అందుకే కొమర్రాజు వారి లాంటి భాషాభిమానుల్ని ప్రతి ఊర్లో ఒకరినైనా తయారు చేస్తూ తెలుగు భాషను కాపాడుకునే ఉద్యమం తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల్లో అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్ర, తెలంగాణ భౌగోళికంగా వేరు వేరైనా, తెలుగుజాతి మొత్తం ఒకటే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి. మాండలికాల్లో కొంత తేడా ఉండవచ్చు, కానీ తెలుగు భాష ఎప్పటికీ ఒకటే అన్న విషయం మననం చేసుకుంటుండాలి. మన భాషను కాపాడుకోవడం మన అందరి బాధ్యతగా గుర్తించాలి.**

**డా.సామల రమేష్‌బాబు**



తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోకముందు మనందరం కలిసి ఒకే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవాళ్ళం- అది కూడా ఏర్పడక ముందు మొత్తం కలిపి మద్రాసు కేంద్రంగా మద్రాసు రాష్ట్రం లో వుండేవాళ్ళం. అప్పట్లో మన తెలుగు వాళ్ళు దేశమంతా వ్యాపించి ఉండేవారు. అన్ని రాష్ట్రాల్లో ఉండేవారు. ఆ కాలానికి సంబంధించిన గొప్ప వ్యక్తులలో ఒకరైన లక్ష్మణరావు గారి శతవర్ధంతి సందర్భంగా ఆయన గురించి మాట్లాడుకుంటున్నాం. ఆయన బతికున్నప్పుడు సమైక్య రాష్ట్రమూ లేదు, రెండు రాష్ట్రాలూ లేవు. భాషారాష్ట్రం కోసం మొట్టమొదట పోరాడిన వారు తెలుగు వారే, కానీ భాషా రాష్ట్రాలుగా విడిపోయాక తెలుగు జాతికి తీవ్రమైన నష్టం జరిగింది. లక్ష్మణరావుగారు, ఇక్కడ పుట్టి పెరిగి వేరే రాష్ట్రానికి వెళ్లి తన ప్రతిభ చూపించి మళ్లీ ఇక్కడికి వచ్చి తెలుగు భాషకి ఎంతో కృషి చేశారు. అలా కృషి చేసిన వారు చాలా మందే ఉన్నారు. అలాంటి వారిలో డా.ఆచంట లక్ష్మీపతిగారు ఒకరు. వారు మా గురువు గారు. విజ్ఞాన చంద్రికాగ్రంథమండలిని లక్ష్మణరావు స్థాపించారు. ఆయన నైతికత గురించి మా గురువు గారు గొప్పగా చెప్పారు. ఆయన్ను చూడలేకపోయాను. జాతి నిర్మాణం కావాలంటే, శాస్త్రీయమైన దృష్టి, ప్రేమతత్వం అవసరం అని చెప్పేవారు మా గురువు గారు. ఆయన చెప్తే లక్ష్మణరావు గారు చెప్పినట్టే! ఎందుకంటే వీరంతా ఒకటే, వీరంతా తెలుగు భాషకు విశేష కృషి చేశారు.

తెలుగుజాతి గొప్పది, ప్రాచీనమైనది. భారతదేశం మొత్తం మీద తెలుగువారి సంఖ్య ఇప్పుడు 20 కోట్లు ఉంటుందని అంచనా. కానీ ఏలికలు లెక్క తేల్చింది 10 కోట్ల నుంచి 12 కోట్లు. కర్ణాటక ఎన్నికల్లో కన్నడిగులు 112 మంది గెలిస్తే తెలుగువారు 69మంది గెలిచారు. అమ్మనుడి ఈనెల పత్రికలో ఆ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించాం. అలాగే మన చుట్టుప్రక్కల ఉన్న అన్ని రాష్ట్రాలలో తెలుగువారున్నారు. తమిళనాడులో ఈ రోజుకి కూడా 42 శాతం మంది తెలుగువారు ఉన్నారు. అదే విధంగా ఇతర రాష్ట్రాలలో కూడా. మహారాష్ట్ర లో 20 శాతం మంది తెలుగువారున్నారంటారు, కానీ

దురదృష్టవశాత్తూ వారికి ఇప్పుడు తెలుగు భాష రాదు.

ఈ రోజు ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోయి ఇన్నేళ్ళయినా దౌర్భాగ్యం ఏమంటే, మనం తెలుగు సరిగ్గా రాయలేం. పిల్లలకు తెలుగు రాదు. టెక్స్ట్ బుక్స్ ఇంగ్లీష్ లో ఉంటాయి. డా. గారపాటి ఉమామహేశ్వర రావు గారు ఒక చోట గణాంకాలతో సహా ఇచ్చారు. ఇంగ్లీష్ పుస్తకాలని దిగుమతి చేసుకుంటున్నాం. ఆ డబ్బులతో భారతదేశంలో ప్రింట్ చేయచ్చు.

ఈతరం పిల్లలకి తమ పేర్లు రాయడం కూడా రాదు. ఇది గమనించి నేను చెప్పేదేమిటంటే, తెలుగు లేనప్పుడు తెలుగు రాష్ట్రాలు దండగ. ఆంధ్ర లేదు, తెలంగాణా లేదు. అందరూ కొట్టుకోవడం దండగ. మన భాషే పోయిన తర్వాత మనకి భాషా రాష్ట్రాలెందుకు? ఇవి కూడా ఇతర రాష్ట్రాలతో కలిసిపోయుంటే సరిపోతుంది. భాష మూలాలు దెబ్బతిన్నాయ్, జాతి మూలాలు దెబ్బతింటున్నాయ్. దీని వల్ల రాష్ట్రాలు నాశనమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

తెలంగాణలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు ఉత్సవాలు జరిగినపుడు నేను చెప్పింది ఒక్కటే, భాష అస్థిత్వం కోల్పోవడం కాదు, మన అస్థిత్వానికే ప్రమాదం ముంచుకొస్తోంది. దాని వల్ల చరిత్ర, సంస్కృతి అన్నీ నాశనమై పోతాయి. మనం ఎక్కడికి పోతున్నాం? తెలుగు భాషోద్యమ సమాఖ్య పెట్టి ఉద్యమం చేసి ఎన్నో సాధించాం. తెలుగు కోసం జివోలు విడుదలవ్వడంలో సమాఖ్య పాత్ర ఉంది.

కొమర్రాజు లక్ష్మణరావు గారి జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికార కార్యక్రమంగా ప్రతి ఏడూ చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని ఈ సభాముఖంగా కోరుతున్నాను. దీనికై ఈ సభలో ఆసీనులైన గౌరవ మంత్రులు,గోరటి వెంకన్న గారు, సాహిత్య అకాడమీ అధ్యక్షులు, తదితర ముఖ్యులు కృషిచేయాలని కోరుతున్నాను..

ఈ విషయమై సోదరుడు జితేంద్రబాబు గారు పూనుకోవాలని కోరుతున్నాను. నడిగూడెం-తెలుగు విజ్ఞాన కేంద్రంగా విలసిల్లాలని ఆశిస్తున్నాను.

**జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు**

సాధారణముగా ఇలాంటి సమావేశాలు మొక్కుబడిగా ఏ హైదరాబాదులోనో చేస్తుంటారు. కానీ కొమర్రాజు వారు నడయాడి



నటువంటి ఈ ప్రదేశంలో చేయడం చాలా సముచితంగా ఉందని భావిస్తున్నాను.అంతే కాకుండ, ఈ సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరు కూడా ఆయన మీద అభిమానంతోటి, సాహిత్యం మీద ఇష్టం తోటి ఇక్కడికి వచ్చారు. ఆయన మనలని వదిలిపెట్టి వంద సంవత్సరాలు పూర్తయ్యింది.మరో నాలుగు సంవత్సరాలలో 180 వ జయంతిని కూడా జరుపుకోబోతున్నాం. వంద సంవత్సరాల క్రితం మనల్ని వదిలి వెళ్ళిన మనిషి గురించి మనం ఎన్నో విషయాలు తెలుసుకోవాల్సి ఉంది. ఇప్పటిదాకా ఎంతోమంది వక్తలు చెప్పారు. ఒక్క విషయం మనవి చేయదలుచుకున్నాను. ఈ ఊరికి నడిగూడెం అనే పేరు ఎలా వచ్చిందో చెబితే బావుంటుందనిపిస్తుంది. ఎందుకంటే బహుశా తెలుగు రాష్ట్రాలు విడిపోతాయని కొమర్రాజు వారు అప్పుడే ఊహించారేమో ఈ నడిగూడెం రెండు రాష్ట్రాల నడి బొడ్డు అవుతుందేమోనని. నాకా సందేహం వచ్చింది. కాబట్టి ఈ ప్రాంతం ఇంకా ప్రవర్ధమానమై భాషా, సాంస్కృతిక ఉద్యమాలకు కేంద్రం కావాలని నేను ఆశిస్తున్నాను.

ఇక్కడ బుద్ధ ప్రసాద్ గారు గానీ, సామల రమేష్ బాబు గారు కానీ భాష ..భాష అని అంటున్నారు. ఇక్కడ ఒక విషయం అందరూ గమనించాల్సి ఉంది. ఇప్పుడు కృత్రిమ మేధోపరంగా మనిషి కనుమరుగైపోతున్నాడు. రేపటి కాలంలో న్యూస్ రీడర్స్ కూడా మనిషి రూపంలో ఉండే రూపంలో రోబో చదవబోతున్నారు. కాబట్టి గుర్తుంచుకోండి మనిషిని రక్షించుకోండి. మనిషిని రక్షించాక భాషని రక్షించుకోవచ్చు. మనిషేలేనప్పుడు భాష ఉండదు.ఈ మధ్యనే నేను ఒక వ్యాసం చదివాను. ప్రధానమంత్రి సెక్రటరియట్లో ఉన్న సెక్రటరీ ఒకరు ఒక వ్యాసం రాశారు భవిష్యత్తులో పాఠశాలలన్నీ కూడా కనుమరుగైపోతాయని, మీరు ఆశ్చర్యపోవచ్చు. ఏ విధంగా అలా జరుగుతుంది అని అంటే ఇటుక, సిమెంట్ తో కట్టిన పాఠశాలలు ఉండవు. విద్యా బోధన అంతా డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. ఉపాధ్యాయులు డిజిటల్ పద్ధతిలో చెప్పిన పాఠాలు పిల్లలు ఇంట్లో కూర్చొని నేర్చుకుంటారు అని ఆ వ్యాసం సారాంశం. వచ్చే పదేళ్ళలో ఇదంతా జరగబోతుంది. అయితే మనం ఎప్పుడూ గతం గురించి మాట్లాడుకుంటాం కానీ, భవిష్యత్తు గురించి కూడా ఆలోచించవలసి ఉంది, అప్పట్లో లక్ష్మణ్ రావు గారు భాషకు సేవ చేయడానికి అవకాశం ఉంది, అడ్డు లేకుండా జరిగింది. అప్పుడూ బ్రిటిష్ వారున్న సమయంలో సాహిత్య సేవ అనర్గళంగా జరిగింది. ఎక్కడైనా ఇబ్బంది కలిగినప్పుడు తప్పించుకుని పోయే వారు. ఇప్పుడు మన స్వరాజ్యం వచ్చింది, కానీ ఇప్పుడు మనం ఏ విధంగా భాషకి సంస్కృతికి విలువిస్తున్నామో మీరే ఆలోచించుకోవాలి. ఇంతకన్న చెప్పకూడదు. కవిత గారికి, మండలి బుద్ధ ప్రసాద్ గారికి నేను ఒక విషయం మనవి చేద్దాం అనుకుంటున్నాను. వారిద్దరూ రాజకీయాలు వదిలేసి భాషా, సంస్కృతి మీద కృషి చేసి, వాటిని ముందుకు తీసుకెళ్తే బావుంటుందని, రెండు రాష్ట్రాల్లో భాషా సంస్కృతి కాపాడుకోవచ్చు అని కోరుకుంటున్నాను.

**మంత్రివర్యులు శ్రీ జి.జగదీశ్వరరెడ్డి**



తెలుగు భాష వైతాళికులు కేవలం తెలుగు భాషే కాదు మరాఠీ హిందీ భాషలను కూడా అవపోసన పట్టిన ఒక ప్రజ్ఞాశాలి. ఇవాళ మనం అందరం ఇక్కడ కూర్చోవడానికి 100 సంవత్సరాల క్రితమే బీజం వేసిన మహనీయుడు కొమర్రాజు లక్ష్మణరావు గారి శత వర్ధంతి వేడుకల్ని మునగాల జమిందారిగారి బంగ్లాలో జరుపుకుంటున్నాము. మిత్రులు కార్యక్రమ అతిథులు గోరటి వెంకన్న గారు, పెద్దలు మండలి బుద్ధప్రసాద్గారు, ముక్తేశ్వరరావుగారు, రామలింగేశ్వరరావుగారు, డా.సామల రమేష్ బాబుగారు, ఉమామహేశ్వరరావు గారికి అభినందనలు. ఈ కార్యక్రమానికి ఆనాడే

బీజం వేసింది కొమఱ్ఱాజు గారైతే, ఇవాళ ఆరోజు వారు చెప్పిన దాన్ని ప్రాధాన్యతను మరొకసారి  తెలుగు ప్రపంచానికి గుర్తు చేయాల్సిన అవసరం ఉందని ఆ బాధ్యతను నెత్తిన వేసుకొని ఎక్కడెక్కడో ఉన్న మనందరిని ఈ మట్టికి తీసుకొచ్చి కూర్చోబెట్టిన మిత్రులు జితేంద్ర బాబు గారికి, సభకు హాజరైన పెద్దలకు మిత్రులకు అందరికీ నా నమస్కారాలు. వాస్తవానికి ఇలాంటి కార్యక్రమాల్లో  ఉపన్యాసాలు ఇవ్వడానికి ఎవరూ రారు, నాకు తెలుసు. న్యాయంగా నాకు ఉపన్యాసం ఇవ్వాలని కూడా లేదు. నిజానికి నాకు సాహిత్యం మీద అవగాహన ఉంది అన్నది పూర్తిగా అబద్ధం. ఒకటి మాత్రం ఉంది అది అమ్మ మీద ప్రేమ ఉంది, దాన్ని వ్యక్తీకరించగల అమ్మభాష మీద ప్రేమ ఉంది. భాష మీద అభిమానం, ప్రేమ మాత్రమే కాదు, భాష ఒక అవసరం. ఒక ప్రాణి జీవించడానికి అమ్మ ఎంత అవసరమో, మనుగడ సాగించడానికి భాష , అది కూడా అమ్మ భాష అంతే అవసరం. అందులో సందేహం లేదు. భాష భావాన్ని తెలియజేయడానికే తప్ప భాషకు ఇంకో ప్రయోజనం ఏమీ లేదు. కానీ ఇవాళ ఈ ప్రపంచం మార్కెట్ దోవలోకి అడుగుపెట్టిందో, ఇప్పుడు భాష కూడా ఒక వస్తువు అయింది. దాంట్లో ఏ భాష అయితే ఎక్కువ మార్కెట్ చేయగలుగుతుందో అది మిగతా వాటిని తొక్కేస్తుంది, నాశనం చేస్తుంది. ఎలా అయితే పెద్ద వ్యాపార సంస్థ, చిన్న వ్యాపార సంస్థలని ఎలా నాశనం చేస్తుందో అలాగే ఇవాళ ఆ భాషలు ప్రపంచం మీద పడి  ఇవాళ ఇంగ్లీషు భాషగా కనిపిస్తోంది. మనం తెలుగు వాళ్ళం కాబట్టి మన తెలుగు భాష మీద ప్రేమ ఉండాల్సిన అవసరం ఉంది. ఎక్కడైనా ఎవరికైనా మాతృ భాష మాత్రమే ఉండాలని చెప్పి కోరుకోవాలి. దానికి కారణాలను పెద్దలు చాలానే వివరించారు. ఎందుకు మాతృభాషను నిలబెట్టుకోవాలని ప్రయత్నాలు పోరాటాలు చేస్తున్నాము.

ఇంగ్లీషులో ఉన్నది ఉన్నట్లుగా చెప్పగలిగిన వారు ఈ సభలో ఎవరైనా ఉన్నారా అంటే, ఉండరు. ఎందుకంటే ఈ ప్రాంతంలో ఉన్నారు కాబట్టి ఈ ప్రాంతానికి భాషకు సంబంధం ఉంది .రాజకీయానికి భాషకు సంబంధం ఉంది స్పర్శకు ఎంత విలువ ఉందో భాషకు అంతే విలువ ఉంది.ఇది ఎవరు కాదనలేని సత్యం. పరాయి భాష పట్ల మోజు ఎక్కువై మాతృభాషని కించపరిచే స్థాయికి పిల్లల్ని తీసుకొస్తున్నారు.

ఈ సందర్భంలో నా జీవితంలో జరిగిన ఒక సంఘటనని మీముందుంచుతాను. నాకు తెలిసో తెలియకో నేను పాఠశాలలో చదువుకునేటప్పుడూ మా ఇంగ్లీషు మాస్టారికి నాకు చిన్న వాగ్వాదం నడిచింది. ఆయన చాలా బాగా చెప్పేవారు. కానీ నాకు అందులో మార్కులు తక్కువ వచ్చేవి. నేను ఇంగ్లీషు బాగా చదవడం లేదని ఒక రోజు మా మాస్టారు నన్ను పిలిచి నువ్వు అన్నింట్లో ముందు ఉంటావు,ఇంగ్లీషులో మాత్రం వెనకబడుతున్నావ్ అంటూ నిలదీశారు. అంటే నాకు ఆ భాష రాదు, నాకు ఇష్టం ఉన్నదే నేను చదువుతానని చెప్పాను. ఇంగ్లీష్ ఎందుకు ఇష్టం లేదు అన్నారు.  బ్రిటిష్ వారు మనల్ని దుర్మార్గంగా 200 ఏళ్లకు పైగా పరిపాలించారని మీరే చెప్పారు కదా, అలాంటప్పుడు  వారి భాష నేనెందుకు చదవాలి, నేను చదవను అని కరాకండిగా చెప్పాను.  ఇంగ్లీష్ చదివితే కలెక్టర్ అవుతావు అన్నారు మా మాస్టారు. కలెక్టర్ అయినా జాగీర్దారే కదా. నేను కలెక్టర్ అవ్వను



అని చెప్పాను. అయితే ఏం చేస్తావని అడిగారు, వ్యవసాయం చేస్తానన్నాను.వ్యవసాయానికి ఇంగ్లీష్ అవసరం లేదు కదా అన్నాన్నేను. నువ్వు టెన్త్ వరకు కష్టపడి చదివితే వ్యవసాయం ఎందుకు అన్నారు. అయితే నేను లాయర్ అవుతాను అని చెప్పాను. లాయర్ అవ్వడానికి కూడా ఇంగ్లీష్ కావాలి రా అని మాస్టర్ అన్నారు. అయినా సరే నేను తెలుగులోనే చదువుతాను అని వాదించాను. తర్వాత కొట్టిండు, మా నాన్నగారికి చెప్పిండు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే చరిత్రలో నేను నేర్చుకున్న విషయాలు, నాకు వారి భాషపట్ల మోజు కలగలేదు. అలాగని ఆ భాషపట్ల వ్యతిరేకత లేదు.

ఇప్పటి సందర్భంలో మాతృభాష ఔచిత్యమేమిటి? మాతృభాషను బతికించుకోవడం ఎలా ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేను మొదటిసారిగా విద్యాశాఖ మంత్రిగా పనిచేసే అవకాశం వచ్చింది. అప్పుడు వరుసగా అధికారులతో సాధారణ సమావేశాలు నిర్వహించాను. అక్కడ మాట్లాడుతూ ఇంగ్లీష్ గురించి చర్చ వచ్చింది. అనంతరం మన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య ఎందుకు తగ్గుతుందని నేను వారిని ప్రశ్నించాను. మనం ఇంగ్లీష్ మీడియం పెట్టలేదు అందుకని మన పాఠశాలలకు విద్యార్థులు రావడం లేదు. దానికోసమే అందరూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు అన్నారు. సందర్భం అలా ఉంది కనుక చెప్తున్నది ఏమిటంటే ఇంగ్లీషులో పరాయి భాషను ఒక అవసరంగా మాత్రమే నేర్చుకోండి, అంతే తప్ప, అమ్మ భాషను వదలకండి జీవితాన్ని వదులుకున్నట్లు అవుతుంది అని చెప్పాను. అది తరువాత రోజు అన్ని పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. ఆ తర్వాత ఈనాడు సంపాదకులు రామోజీరావు గారి దగ్గర నుంచి పర్సనల్ గా నాకు ఒక ఉత్తరం వచ్చింది. నాకు ధైర్యం వచ్చింది, నాకు విశ్వాసం వచ్చింది, తెలంగాణలో తెలుగు బతికే ఉంటుంది, తెలుగు భాషను గుర్తించి విద్యాశాఖ మంత్రిగా మీరు చేసిన వ్యాఖ్య నాకు బాగా ఆనందం కలిగించింది అని వారు రాసిన ఉత్తరం సారాంశం. కనుక ఇవాళ భాషకు సంస్కృతికి, భాషకు సంప్రదాయానికి, భాషకు విలువలకి, అన్నిటికి మించి భాషకు ఉత్పత్తికి సంబంధం ఉంది.

ఇవాళ మనం అనేక పదాలు వాడుతుంటాం. పూలలో మొగ్గలు పత్రా అని ఎవరికైనా చెబితే దీనిని వాడు ఏ భాషలో అడుగుతాడు? ఇంగ్లీషు భాషలో నా భాషలో వ్యక్తీకరించే అన్ని పదాలకు సరైన పదాలు ఆ నిఘంటువులో దొరుకుతాయా? ఈ ప్రాంత ఉత్పత్తికి సంబంధించి ఈ భాషలోకి రకరకాల పదాలు వస్తాయి. ఎక్కడైనా సరే వారు ఉండొచ్చు, కానీ వారి ప్రాంతీయ భాష, వారి ప్రాంతీయ పదాలు ఎంత చదివినా ఇంగ్లీషులో అది రాదు, అది దొరకదు. అందుకే తప్పకుండా మాతృభాష ఉండి తీరాలి. మాతృభాష బ్రతకాలి. మనం మనుషులుగా బ్రతకాలంటే మాతృభాషను బతికించుకు తీరాలి. ఇంతకుముందు పెద్దలు మాట్లాడుతూ చెప్పారు. అదే విషయాన్ని నేను చాలా చోట్ల ప్రస్తావించాను. కానీ ఇలాంటి సభలో ప్రస్తావించడం సముచితంగా అనిపిస్తోంది. ఒకవేళ భాష నిజం కాకపోతే, భాషకు ప్రాధాన్యత లేకపోతే, ప్రాంతాలు, రాష్ట్రాలే కాదు దేశాలు కూడా అనవసరం. భాష లేకుండా దేశాలు కూడా మనలేవు. వాస్తవానికి మనం చరిత్రను తవ్వితీస్తే ఒకే భాష మాట్లాడే వారే, ఒక ప్రాంతంలో ఉన్నారు. అది వాస్తవం. ఆ తర్వాత వారి సంఖ్య పెరగడం, రెండు జాతుల మధ్య దండయాత్రలు జరగడం, ఎక్కడికి వెళ్ళినా వారి భాషే వారి గుర్తింపుగనుక భాషను లేకుండా నాశనం చేశారు.

ఇవాళ వస్తున్నది కూడా అదే పరిస్థితి. అందుకే తప్పకుండా మన భాషను మనం బ్రతికించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది. ఈ విషయాన్ని గమనించడం కాదు ,వంద సంవత్సరాలు క్రితం గమనించిన అనేకమంది మహనీయులు ఈరోజు మనం తలుచుకుంటున్నటువంటి వారిలో కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారు ఒకరు. వారు నడయాడిన నేలలో మనం ఈ సమావేశాన్ని జరుపుకోవడానికి, అవకాశం కల్పించిన మిత్రులు అందరికీ మనస్ఫూర్తిగా వందనాలు తెలియజేస్తూ అందరం తప్పకుండా మన పరిధిలో, మనకున్న అవకాశాల మేరకు, మన జీవితాల్లోనైనా మన మాతృభాషను బతికించుకుందామని తెలియజేస్తూ. ధన్యవాదాలు.

**బహుభాషావేత్త శ్రీ నలిమెల భాస్కర్ :**



కన్నడంలో ఒక సామెత ఉంది, దాన్ని నేను తెలుగులో అనువదించి చెబుతాను, ఇక్కడ వచ్చిన మహానుభావులకు తెలుసు, ఆ సామెత ఏమిటంటే, దేశం అయినా చూడు లేదా కోశం అయినా చూడు దేశం అంటే మనందరికి తెలుసు, దేశం చూడు అంటే, మనం పుట్టినప్పటి నుండి మనం దేశం చుట్టి వచ్చినట్టయితే లేదా సంచరించి వచ్చినట్లయితే, ఏదో ఒక క్షణంలో మన ఆలోచన సరళి మారుతుంది, అదేవిధంగా మన మాతృభాషలోని నిఘంటువును తిరగవేస్తే, ఆ నిఘంటువు నిర్మించే సమయం వరకు సమాజం, సంస్కృతికి సంబంధించిన ఎన్నో విషయాలు ఆ నిఘంటువులో ఉంటాయి. అందుకే కన్నడిగులు చెప్పేది ఏమిటంటే, మీరు దేశం అంత తిరిగిఅయినా జ్ఞానం సంపాదించండి లేదా మీరు ఇంట్లో ఉండదలుచుకోవాలనుకుంటే మీరు అక్కడ ఉన్న కోశాలు మరియు నిఘంటువులను చదివితే మీరు ఆచార్యులు అవుతారు అని అంటారు. తెలుగులో ఇంకొక సామెత ఉంది, అమరం నెమరం వెయ్యడం వస్తే కావ్యాలెందుకు కాంచనా అని అంటారు. అంటే అమరం నెమరు వెయ్యడం వస్తే, ఇంకా కావ్యాలెందుకు అంటే అన్ని శ్లోకాలను గుర్తించుకుంటే ఇంకా కావ్యాలు రాయడం ఎందుకు అని.

కొమర్రాజుగారు అయితే దేశాన్ని చూసారు, దానితో పాటు ఇంకా కోశాన్ని కూడా చూసారు. కోశాన్ని చూసిన వారిలో కొమర్రాజు గారి లాగా ఎవ్వరూ లేరు. ఎవరైన ఉంటే ఉండవచ్చు ఏమో కాని, నలభై ఆరేళ్ళ వయసుస్సులో ఇంత కీర్తిని, విఖ్యాతిని ఎలా సంపాదించాగలిగారు ? ఎందుకంటే పెనుగంచిప్రోలులో పుట్టారు. చిన్ననాటే తండ్రి పోయారు, అయినా జీవితం ఎలా మలుచుకున్నారు? తప్పనిసరి పరిస్తితుల్లో దేవరకొండకో, భువనగిరికో వచ్చారు, అక్కడ నుంచి నాగపూర్ కి అంటే మహారాష్ట్రకు వెళ్ళారు. అక్కడ ఏం చేసారు, నేర్చుకున్నారు, మరాఠీ నేర్చుకున్నారు, కవిత్వం రాసారు. అసలు భద్రాచలంలోని అక్కడి పండిత దిగ్గజాలతో వాదించి పర్ణశాల ఇదే అని రుజువుచేసారు. ఇదేదో ఆవేశంతో చెప్పిన మాటలు కావు,

సాక్ష్యాలతో, శోధించి, చారిత్రిక దిగ్దంతులతో వాదించి, మెప్పించి పర్ణశాల ఇదేనని రుజువుచేసారు. ఒకటి కాదు ఇలా అనేకం చేసారు. అక్కడ భారత కర్ణ పర్వాన్ని పరిష్కరించారు. మరాఠీలో తనకు ఉన్న అధికారంతో సాధికారంగా చేశారు. అలాగే దేశీయంగా తనకు వచ్చిన జ్ఞానాన్ని మరాఠీ నుంచి తెలుగుకు అనువదించారు. అక్కడి నుంచి ఎమ్ ఏ కలకత్తాలో చేసారు.

ఆయనకు బెంగాలీ, ఒడియా, కన్నడ భాషలు కూడా వచ్చు. తరువాత తనతోబుట్టువు అచ్చమాంబకు, అదే సమయంలో తనకు కూడా తన తల్లి బాల్యవివాహం చేద్దాం అని అంటే, అమ్మ నేను అమ్మగా నీకు గౌరవం ఇస్తాను గాని, బాల్యవివాహానికి నేను ఒప్పుకోను అని అన్నారట. నేను కాశికి వెళ్తాను రా నాయన అని అమ్మ అంటే, అమ్మా నీ ఇష్టం వెళ్ళిరా అనిధైర్యంగా చెప్పినటువంటి సాహసి. తల్లి అంటే ప్రేమ ఉన్నా కానీ, ఇలాంటి వాళ్లలా ముందుకు వచ్చి ఆచరించే వారెవరు? అందుకే కందుకూరి వీరేశలింగం గారిపై ఎంతో ప్రేమతో ఆయన జీవిత చరిత్ర బయటికి తేవడానికి ఎంతగానో ప్రయత్నించారు. ఇలాంటి ఎందరో వైతాళికుల ఆధునిక భావాలే తెలుగువారికి మార్గదర్శకాలై మిగిలినై.

సెలవు, ధన్యవాదములు.

**సాహితీవేత్త డా. గుమ్మా సాంబశివరావు**



సభకు నమస్కారం. మిత్రులు జితేంద్ర బాబు గారి ఆహ్వానం మేరకు, ఈ సభకు నన్ను తీసుకొచ్చిన డా. సింగారావు గారికి ముందుగా ధన్యవాదాలు. ఆయన లేకపోతే నేను ఈ సభకు వచ్చేవాన్ని కాదు. ఈరోజున ఒక మంచి సభలో పాల్గొనిన అనుభూతిని కల్గించారు. ఎన్ని పనుల వత్తిళ్ళు ఉన్నా, మండలి బుద్ధప్రసాద్ గారు వస్తారు అని అనుకున్నాను. కాని, ఈరోజు విద్యుత్ శాఖ మంత్రి మరియు వ్యవసాయ శాఖ మంత్రి ఇద్దరు వచ్చి సభలో ఆసాంతం ఉన్నటువంటి వారి సంస్కారానికి నమస్కరిస్తున్నాను. శివాజీ చరిత్ర జాతీయ స్ఫూర్తి అనే వ్యాసాన్ని నాతో రాయించి ఆ స్ఫూర్తిని కలిగించినటువంటి జితేంద్రబాబు గారికి ముందుగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. లక్ష్మణరావుగారు యాభై సంవత్సరాలు నిండకుండానే వంద సంవత్సరాల వరకు కూడా గుర్తున్నారు అంటే ఆయన చేసినటువంటి సాహిత్య సేవయే ప్రధానమైనటువంటి కారణం. సమాజంలో ఆరోజున సంఘ సంస్కరణ, జాతీయ సాంస్కృతిక పునరుజ్జీవన విధానం అలాగే జాతీయ భావన అనే మూడు భావాలతో ఉద్యమాలు సాగుతూ ఉంటే దానికి ప్రధానమైనటువంటి కారకుడిగా మనం రాజా రామ్ మోహన్ రాయ్ గారిని చెప్పుకుంటాము. బెంగాల్ లో ఆయన సాధించినటువంటి ఉద్యమానికి బలంగా తెలుగునాట ఈ మూడు ఉద్యమాలకి సంగమంగా నిలిచారు. (స్మృతి సంచికలో వీరి వ్యాసాన్ని చదువగలరు.)

**ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు:**

కొమర్రాజురాజు వేంకట లక్ష్మణరావుగారి శతవర్ధంతి సభలో మిమ్మల్ని అందరిని కలుసుకున్నందుకు



సంతోషంగాఉంది. ఈ సభ సంతృప్తికరమైన సభగా మిగిలిపోతుంది మీజీవితంలో. దీనికికారణం కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారు తనదైనపాత్ర వహించి అందులోనూ తక్కువకాలమే జీవించి అంటే, అరవయ్యేళ్ళో ఎనభయ్యో, తొంభయ్యేళ్లో కాకుండా నలభయ్యారేండ్లకే కనుమరుగయ్యారు. ఆయన గురించి ఒక్క వాక్యంలో చెప్పుకోవాలంటే,"ఆయననూరు ఏండ్లతర్వాతపుట్టాల్సినమనిషి", నూరు ఏండ్లకుముందేపుట్టి ఒక రకంగాశుష్కించిఉన్న తెలుగు నేలని పుష్పింపచేసి తెలుగు మాగాణాన కొత్త విత్తనాలు చల్లి సిరుల పంట పండించడానికి ఆయన ముందుకు వచ్చాడు. ఆయనలాంటి మనుషులు అరుదుగా పుడతారు. పుట్టినా వాళ్లు చేయవలసిన పనులను త్వరగా ముగించి వెళ్లిపోతారు. అలాంటివాళ్లు మొదలుపెట్టిన పనులను ముందుకు తీసుకువెళ్లడానికన్నట్లు ఆయన కనుమరుగైన నూరేండ్లకు ఈనాడు ఈ సమావేశంలో మనం కూర్చొని చర్చించుకొని కొన్నింటినైనా అమలుపరిచేందుకు ముందుకు కదులుదాం. కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు గారు దూరదృష్టితో నేటి అవసరాలకు అనుగుణంగా భాషోద్యమానికి అవసరమైన పునాది వేశారు.

ఆయన చేసిన రచనలలో తెలుగు భాషాతత్త్వము ఒక ప్రత్యేకత గలిగినది. 20 వ శతాబ్దపు పూర్వార్థంలో ఐరోపా ఖండంలో వస్తున్న సరికొత్త భాషావాదం నవవ్యాకర్తల ప్రయోగాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వేలాది భాషలను వర్గీకరించడానికి భాషలమధ్య జన్యజనకత్వాన్ని నిరూపించేందుకు వేల ఏండ్లకిందట ఉన్నట్లుగా మూలభాషలనుంచి సంక్రమించిన ఉమ్మడి లక్షణాలను ప్రతిపాదించి భాషలను కొన్ని భాషాకుటుంబాలకు చెందినవిగా వర్గీకరించటం అనే కొత్త సిద్ధాంతానికి తోడ్పడే విధంగా తెలుగుతోపాటు ఇతర ద్రావిడ భాషలు పంచుకొన్న ఉమ్మడి లక్షణాలను ఎన్నింటినో వర్ణ, పద, వాక్య విభాగాలలో ప్రతిపాదిస్తూ గ్రంథ రచన చేయటం, ఆనాటికి అది భారతదేశంలో భాషాశాస్త్ర పరిధిలో జరిగిన ఒక అద్భుతమైన ముందడుగే. అయితే, దాన్ని అచ్చువేయకుండా 65 ఏండ్లకు పైగా చలువగిడ్డంగిలో నిలువ ఉంచుకోవడం తెలుగువారికే చెల్లింది. అది బూదరాజు రాధాకృష్ణ గారి చేతిమీదుగా అచ్చై తెలుగువారికి ఆలస్యంగానైనా అందుబాటులోకి రావడం మన అదృష్టమే. కొమర్రాజుగారి రచనలలో ఉన్న అనేక విషయాలలో ఒకటి మాతృభాషలో విద్యాబోధన. ఇది ఈనాడు మనం మన ఆలోచనలను ఈ దిశగా గురిపెట్టవలసిన ఒక అత్యంత ముఖ్య విషయంగా తెలుగునాటా, భారత దేశమంతటా ప్రాముఖ్యత పొంది విపరీతంగా సామాజిక మాధ్యమాలలోనూ విద్యావేత్తలలోనూ చర్చకువస్తోంది. ఈ అంశమే ముఖ్యాంశంగా రెండు దశాబ్దాలనుండీ తెలుగు భాషోద్యమ సమాఖ్య అమ్మనుడి బోధనా మాధ్యమంగా ఉండితీరాలని అలుపెరుగని పోరాటం సలుపుతోంది. అమ్మనుడులే బోధనా మాధ్యమంగా ఉన్న దేశాలైన కొరియా, జపాను, చైనా, తైవాను, తదితర దేశాలు ప్రస్తుతం ప్రపంచ దేశాలలో ఆర్థికంగానూ సాంకేతికంగాను అత్యున్నత స్థానంలో

ఉండటం చూస్తున్నాం. వాటి విజయ రహస్యం ఆయా దేశాలలో వాడే అమ్మనుడులే. నేటి ప్రపంచ దేశాలలో జ్ఞాన సృష్టి జరుగుతున్న దేశాలలో ఉత్తమ స్థాయి దేశాల కొలమానంగా ఉన్న పేటెంట్ల సంపాదన పరంగా కొరియా, జపాను, చైనా– ఒకటి, రెండు, మూడవ స్థానాలలో ఉండగా ఆంగ్లమే మాతృభాషగా ఉన్న అమెరికా, బ్రిటను, కెనడా, ఆస్ట్రేలియాలు వెనకబడి ఉండటం మాతృభాషలలో విద్యాబోధన ఎంత అవసరమో మనందరం గుర్తించాలి. దీనికోసం మనం కలిసికట్టుగా ముందుగు వేయాలి. ఆంగ్లమే బోధనా భాషగా జరగబోయే సామాజిక విధ్వంసాన్ని ఆపాలి. సమయం తక్కువ ఉండటంతో నేను ఇంతటితో ముగిస్తున్నాను. నాకు ఈ అవకాసం ఇచ్చిన జితేంద్రగారికి నెనర్లు.



**మంత్రివర్యులు శ్రీ సింగిరెడ్డి నిరంజనరెడ్డి:**

ఈ నడిగూడెంకి రావడం ఇది రెండవ సారి. నడిగూడెంకి మాకు ఒక అనుబంధం ఉంది. నడిగూడెం వస్తే నేను మా మేనమామ ఇంటికి వచ్చానేమో అనిపిస్తుంది. కారణమేమిటంటే ఈ నడిగూడెం ఇంట్లో పెరిగినటువంటి సరళమ్మగారు మా సంస్థానానికి కోడలుగా వచ్చారు. కొమఱ్ఱాజు వారు ఇక్కడ దివాన్‌గా పని చేస్తూ భాష సాంస్కృతిక వికాసానికి, వందేళ్లకు పూర్వం ఈ నేలకు 40, 45 సంవత్సరాలు చేసిన కృషినే మనం ఈరోజు చర్చించుకుంటున్నాం. సురవరం ప్రతాపరెడ్డి గారు ఈ సంస్థానానికి పనిచేయలేదు కానీ నైజాం సంస్థానానికి వ్యతిరేకంగా పనిచేసిన వైతాళికులుగా ప్రస్తావించవలసిన, అర్థవైన అగ్రగాములుగా చెప్పుకోదగిన వ్యక్తులు అక్కడ సురవరం ప్రతాపరెడ్డి గారు ఇక్కడ కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణారావు గారు. భాషను బతికించుకోవడం, బలోపేతం చేయడం భావితరాలకు అందించడం అనేది ఒక కర్తవ్యంగా చూస్తాం. భాష యొక్క ప్రాధాన్యతను వందేళ్ళ క్రితమే గుర్తించినటువంటి మహానుభావుడు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారు. ఇందాక ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు చెప్పినట్టు 100 ఏళ్ళ తర్వాత పుట్టవలసిన మనిషి 100 ఏళ్ళు ముందు పుట్టి అంత గొప్పగా భాషకు సేవ చేశాడన్నది నిజం. మానవజాతి పరిణామ క్రమంలో ఒక అత్యద్భుతమైనటువంటి, విశిష్టమైనటువంటి సాధనం భాష. భాషను విస్తరించే క్రమంలో భాష పరాకాష్టకు చేరుకొని, వ్యాకరణాన్ని భాషా శాస్త్ర పరంగా అభివృద్ధి చేసుకుని, ఈరోజు ప్రతి భాష సామాన్యులకు అందే విధంగా పాండిత్యాన్ని అందించే విధంగా అభివృద్ధి చెందాయి. ఒకప్పుడు మనిషి ఏ ఖండంలో ఉంటే అదే ఖండంలో మరణించేవాడు. ఇంకో ఖండంలో జరిగే విషయాలు తెలిసేవే కావు. నేడు భాష ఖండాంతరాలకు మనిషితో పాటు చేరింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 7000 భాషలు అభివృద్ధిలోకి వచ్చాయి. ఆధునిక విజ్ఞాన శాస్త్రం పెరిగిన తర్వాతనే 100, 150 సంవత్సరాల క్రితం నుంచి ఇతర ఖండాలను ప్రజల భావ వ్యక్తీకరణ, వారి మూల భాషా అని, పలనా జాతి వారిది ఈ భాష అని గుర్తింపులోకి వచ్చాయి.




దక్కన్ ఆర్కైవ్స్ అండ్ కల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శ్రీమతి కన్నెగంటి హిమబిందు గారిని సత్కరిస్తున్న మంత్రివర్యులు, పెద్దలు.

పురాతన ప్రపంచీకరణ, నేటి ఆధునిక ప్రపంచీకరణ క్రమంలో భాషలు సంక్రమిస్తూ వస్తున్నాయి. భాషలు సంక్రమించడం వేరు, సంకరమవ్వడం వేరు. ఆ సంక్రమించిన భాషలను మన భాషతో అవసరమైన మార్పులు చేసుకుంటూ ఉపయోగించుకొంటూ మన భాషతో పాటు అభివృద్ధి చేసుకోవచ్చు. సంకరమయ్యేటటువంటి భాషతో ప్రమాదం ఏంటంటే ఉన్న భాషలు కనుమరుగయిపోతాయి. భాష విజ్ఞానార్జనకి ఒక సాధనం, ఒక పనిముట్టు. భాష లేకుండా విజ్ఞానాన్ని మనం ఆర్జించలేము. కానీ కాలానుగుణంగా భాషలు వాటిలోని నాణ్యత లోపించడం, పటుత్వాన్ని కోల్పోయి కొన్నాళ్లకి కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొన్ని తెగల భాషలు లిపిలేక అంతరించిపోయాయి. నేడు లిపి ఉండి, అధికార భాషగా ఉండి, ఉపయోగంలో ఉన్న భాషలు కూడా అంతరించిపోయే ప్రమాదపుటంచున ఉన్నాయని తెలుస్తుంది. దీనికి ఒక రకంగా సామ్రాజ్యవాదం కారణమైతే, మరో రకంగా ప్రపంచీకరణ కూడా కారణమే. ప్రపంచీకరణలో భాగంగా కేవలం రెండు మూడు ప్రధాన భాషలే అధిపత్య ధోరణితో ఇతర భాషలను అణిచివేస్తున్నాయి. ఆ రెండు మూడు భాషలే ప్రపంచ భాషలుగా పేరు సాధిస్తున్నాయి. కృత్రిమాభిలాషతో మనమే దానిని కాలరాస్తున్నాం. నేడు మనం మన మాతృభాషలో చదవడం, రాయడం వస్తున్నప్పటికీ తరువాతి తరాల వారు అంటే కొడుకులు, మనుమలు, మునిమనుమలు మాతృభాషలో చదవడం రాయడం చేయలేక పోతున్నారు. మాతృభాషలో విద్యను ఈ సమాజం అందించడం లేదు. అందువల్ల వారు ఆలోచించి తీరులోనే మిశ్రమ భాషలు వస్తున్నాయి.

అందువలన విద్యార్థులు ఒక భాషలో పూర్తిస్థాయిలో ఆలోచించలేకపోతున్నారు. అందువలననే భాష సంక్రమణం జరుగుతుందని చెబుతున్నాను. ఇది కూడా ఒక ప్రమాదకరమైన స్థితి. పాలకులు ఆంగ్లేయులు ఈ ప్రాంతంలో పరిపాలించారు. కాబట్టి వాళ్ల భాషను ప్రపంచ భాష అని ఒక భావనను మనకు కలిగిస్తారు. అది ఇప్పటికి కూడా నిజమని మనం అదే నమ్ముతున్నాం. కానీ ఇందాకే ఆచార్యులు ఉమామహేశ్వరరావు గారు మాట్లాడినట్టు ఏ భాషలో అయితే ప్రజలు వారి ఉనికిని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ మేధో సంపత్తి చేస్తారో ఆ భాషలే ఆ సమాజాన్ని అభివృద్ధిలోకి తీసుకొస్తున్నాయి. చాలామందికి ప్రపంచాన్ని కలుపుతున్నది ఆంగ్ల భాష అని ఒక భావన ఉండొచ్చు. కానీ అది నిజం కాదు. కానీ ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడే భాష చైనీస్ భాష. చైనాలో ఉన్నవారు చైనా వెలుపల ఉన్న చైనీస్ లు మాట్లాడే భాష చైనీస్ భాష ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడబడుతుంది. ఆంగ్లం కాదు. ఎక్కువ దేశాలు మాట్లాడే భాష స్పానిష్. ఆంగ్లం కాదు. తక్కువ దేశాలు తక్కువ ప్రజలు మాట్లాడే భాష ఆంగ్లం. కానీ ఇంగ్లీష్ వారు మా భాష అని నమ్మిస్తే అది మనం నమ్మి, పిల్లలకు అదే భావన కలిగించి మాతృభాషను ఘణంగా పెడుతున్నాం. కానీ మాతృభాష యొక్క ఉనికిని ఔన్నత్యాన్ని చాటడం కోసం ఇటువంటి సభను పెట్టి నినాదాలతో మాతృభాషను కాపాడులనుకోవడమనే ఒక దుస్థితిలో మనం ఉన్నాం. కాని ప్రపంచంతో పోటీ పడడానికి ఏ భాషనైనా నేర్చుకోవచ్చు కానీ మాతృభాషను మరువకుండా ఒక నైతిక బాధ్యత తోటి, చట్ట బాధ్యతతో అయినా పిల్లలకు మాతృ భాష నేర్పి, దానిపట్ల ప్రేమ గౌరవాన్ని కలిగేలా కృషిచేయాల్సిన అవసరం ఉంది. అలా మన భాషను మనం కాపాడుకోవాలి. ఎవరైతే పిల్లలు వారి మాతృభాషలో ఆలోచిస్తారో, వారు అద్భుతమైన ఫలితాలు సాధిస్తారు. పిల్లలకు మాతృభాషను అందించినప్పుడే మనం మాతృభాషకు న్యాయం చేసిన వారమవుతాము. వంద సంవత్సరాల క్రితమే భాష వికాసం, పరిరక్షణ, వ్యాప్తి కోసం కృషిచేసిన కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారి జీవితాన్ని గాని, రచనలను, పరిశోధనలను ఈ తరానికి భావితరానికి అందించినటువంటి ఒక గొప్ప ప్రయత్నాన్ని చేసిన జితేందర్ బాబు గారికి హృదయపూర్వక అభినందనలు. అందరికీ కృతజ్ఞతాపూర్వక అభినందనలు.

**శ్రీ సోము భరత్ కుమార్:(తె.రా.స రాష్ట్ర కార్యదర్శి**



సాహిత్యకారులు, సాహిత్య మిత్రులు సభలో పెద్దగా మాట్లాడేంత శక్తి నాకున్నట్లు నేను అనుకోవడం లేదు. కానీ, సమాజం చాలా మందిని పెద్దవాళ్ళని చేస్తుంది. ఆ పెద్ద వాళ్ళందరూ గొప్పవాళ్లు కారు. కొంతమంది మాత్రమే గొప్పవాళ్ళు అవుతారు. ఆ తోవలోకి చెందిన వారే కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారు. ఇంతకుముందు సురేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఆయన చనిపోయి వంద సంవత్సరాలు అవుతుంది, అంతకు ముందు 48 సంవత్సరాల క్రితం అంటే దాదాపుగా ఆయన వయసుకు 12, 13 సంవత్సరాలు నుంచి వారు పనిచేస్తున్నారు అంటే, ఆ కాలంలో ఇంత దూరదృష్టితోటి. ఒక సమాజాన్ని అణగారిపోయి ఉన్న సమాజాన్ని, అణచివేయబడ్డ సమాజాన్ని, జనాలకి ఉపయోగపడే పద్ధతుల్లో ప్రేరేపించాలి అంటే– సామాన్యమైన విషయం కాదు. వారు ఈ సంస్థానంలో దివాన్‌గా ఉద్యోగం చేస్తూనే సామాజిక ఉద్యమంతో ముందుకు వెళ్లారు. సమాజాన్ని మేల్కొల్పే కార్యక్రమం సాహిత్యం ద్వారా చేయడం అనేది ఎంతో గొప్ప విషయం. నాకు ఈ ప్రాంతంతో కొంత సంబంధం ఉంది. అదేంటంటే మా అమ్మగారి ఊరు ఇక్కడే.

సాహిత్య వారసత్వం ఈ ప్రాంతంలో నిరాఘాటంగా కొనసాగుతూ రావడానికి వారు వేసిన పునాది ఎంత గట్టిగా ఉందో మనకి తెలుస్తుంది. ఈ ప్రాంతంలో లక్ష్మణరావు గారి మరణానంతరం దగ్గరగా ఒక 40 సంవత్సరాల తర్వాత కెవిల్ రావు, నారాయణరావు గారు, కోదాటి నారాయణ రావు గారు దాన్ని ముందుకు తీసుకు పోవడం, ఆ తర్వాత జితేందర్ గారు 1986 లో మొదలుపెట్టారు. లక్ష్మణరావు గారి స్మృతిలో సంస్థని 1986 లో వారితోపాటు ఇద్దరు ముగ్గురు మిత్రులు కలిసి దాన్ని కొనసాగించడం, ఇవాళ వారు ఎక్కడి నుంచి అయితే అద్భుతమైన పనులు చేశారో, సాహిత్య రంగంలో, అదే భవనంలో ఈ రకమైన ఒక సభ ద్వారా వారిని స్మరించుకోవడం చాలా గొప్ప విషయం. ఇది నిరంతరాయంగా జరగాల్సిన ప్రక్రియ. అదృష్టమో దురదృష్టమో మనకి తెలియదు, కానీ ఈదేశంలో బ్రహ్మాండమైన చరిత్ర ఉన్న ఈ దేశానికి రాతపూర్వకంగా చరిత్ర అనేది

సరిగ్గా లేకపోవడం వలన ఒక ఆర్డర్లో చరిత్ర అనేది ఎక్కడ కూడా రాకపోవడం, ఈ మధ్యకాలంలో దానికి గత 100, 125 సంవత్సరాలు దానికి కృషి జరుగుతూ ఉంది. ఇది కూడా ఒక మెట్టు అని నేను భావిస్తున్నాను. ఇవన్నీ కూడా మనం న్యాయవాద వృత్తిగానే, దానికన్నా ఎక్కువగా ఈ సాహిత్య రంగం, తర్వాత చరిత్ర వీటన్నిటికీ కూడా నిక్షిప్తం చేయడానికి ప్రయత్నం చేస్తూ కార్యక్రమాలను కొనసాగిస్తున్న జితేందర్ బాబుకు నేను అభినందనలు తెలుపుతున్నాను.

**కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరాయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు శ్రీ కె.జితేంద్రబాబు (సభ ముగింపు ప్రసంగం)**



తెలుగుభాషా సాహిత్యాలకు, చరిత్ర పరిశోధనకు, విజ్ఞానసర్వస్వ రచనకు శ్రీకారం చుట్టిన మహనీయుడు శ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారు. వారు మరణించి నేటికి సరిగ్గా నూరేళ్ళు. ఈ భవనంలోనే దివానుగా 1900 నుండి 1923 వరకు పనిచేశారు. వారి తండ్రిగారు కూడా 1868 నుండి 1880 వరకు ఈ కోటలోనే దివానుగా పనిచేశారు. ఈ భవనం నుండే విజ్ఞానచంద్రికా పరిషత్తు స్థాపించి, 20వ శతాబ్ది ఆరంభంలో సాహిత్య, వైజ్ఞానిక, చారిత్రక విషయాల్లో పరీక్షలు నిర్వహించి, తెలుగువారిని విజ్ఞానపథంలో నడిపించాలనే సంకల్పంతో బాలబాలికలకు పోటీపరీక్షలను నిర్వహించి, ప్రోత్సహించింది, విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని 1906లో ఏర్పాటు చేసి, తెలుగువారికి సాంకేతిక విజ్ఞానాన్ని, ఆధునిక విజ్ఞానాన్ని, ఆధునిక శాస్త్రాల్ని మాతృభాషలో అందించాలని అనేక గ్రంథాలను ప్రచురించి తెలుగువారికి అందించింది ఇక్కడి నుంచే.

పింగళి వెంకయ్యగారు మన జాతీయ పతాకాన్ని రూపకల్పన చేసిన ఈ భవనంలోనే మనం కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారి శతవర్ధంతి సభను జరుపుకోవటం మనందరికీ మరపురాని జ్ఞాపకం.

1986లో కొందరు మిత్రులం కలిసి కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారి స్ఫూర్తితో 'కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరాయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య' పేరుతో ఒక సంస్థను ఏర్పాటుచేసి ఆనాటి నుండి అనేక కార్యక్రమాలు ఈ గ్రామంలోనూ, ఈ ప్రాంతంలోనూ నిర్వహిస్తూ వస్తున్నాం. ఈనాడు 'శతవర్ధంతి స్మృతి సంచిక'ను మా ఈ సంస్థతరపున ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. విజ్ఞానచంద్రికా గ్రంథమండలి తరపున 1906 నుండి 1933 వరకు దాదాపు 35 గ్రంథాలు ప్రచురించడం జరిగింది. ముఖ్యంగా లక్ష్మణరావుగారు రచించిన భాషా, చారిత్రక వ్యాసాలు, విజ్ఞానసర్వస్వ రూపకల్పనలో ప్రచురించిన మూడు సంపుటాలు, శివాజీచరిత్ర, హిందూమహాయుగం, మహమ్మదీయమహాయుగం లాంటి గ్రంథాలను పునర్ముద్రించాల్సిన చారిత్రక అవసరం ఉంది. ఇవేకాక, లక్ష్మణరావుగారు పరిష్కరించిన 'శివతత్త్వసారము'ను కూడా త్వరలో మా సంస్థనుంచి ప్రచురించబోతున్నాం. లక్ష్మణరావుగారి చివరి రచన అయిన 'తెలుగు భాషాతత్త్వం' పునర్ముద్రించి ఈ రోజు ఆవిష్కరించుకున్నాం. ఆయన వ్యాససంపుటాలు, ఇతర రచనల్ని కూడా మనం ప్రచురించాల్సిన అవసరం ఉంది. మరాఠీలో లక్ష్మణరావుగారి రచనలను లభ్యమైనంతవరకు సేకరించి, ఈ 'శతవర్ధంతి స్మృతి సంచిక'లో ప్రచురించాము. అదేవిధంగా ఆయన పరిష్కరించి, ప్రచురించిన శాసనాల ఆంగ్ల వ్యాసాలను కూడా ఈ సంచికలో పొందుపరిచాం. లక్ష్మణరావుగారి స్ఫూర్తితో మనందరం వారి రచనలతోపాటు ఇతర పరిశోధక గ్రంథాలను కూడా ప్రచురించి భవిష్యత్ తరాలకు అందించాలని ఆశిస్తున్నాం.

తెలుగునాట చారిత్రక పరిశోధనకు దిశా నిర్దేశం చేసి శాసన పరిశోధన, పరిష్కరణలతోపాటు, గ్రంథపరిశోధనా పరిష్కరణలకు లక్ష్మణరావు మార్గదర్శిగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో చరిత్రకారులుగా ప్రసిద్ధి చెందిన మల్లంపల్లి సోమశేఖరశర్మ, చిలుకూరి వీరభద్రరావు లాంటివారు తరువాతి తరాలకు ఆదర్శప్రాయంగా నిలిచారు. వారి స్ఫూర్తిని నేటితరాలకు అందించాల్సిన చారిత్రక బాధ్యత మనందరిపైన ఉంది. తెలుగునాట పరిశోధనా, విమర్శ ఈ రెండు రంగాలనూ మనం విస్మరించామని చెప్పవచ్చు.

తెలుగునాట గ్రంథాలయోద్యమాన్ని ప్రారంభించి 1901లో 'శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయా'న్ని హైదరాబాద్‌లోనూ, 1904లో 'రాజరాజనరేంద్రభాషానిలయా'న్ని వరంగల్‌లో, 1923 నాటికి నిజాం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో దాదాపు 120 గ్రంథాలయాలను ఏర్పాటు చేసిన ఘనత, తెలుగువారికి విజ్ఞాన పథంలో నడిపించడానికి జరిపిన కృషి కళాప్రపూర్ణ రాజా నాయని వేంకటరంగారావుగారు, కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగార్లదే. తెలుగువారికి స్ఫూర్తినినింపిన ఈ భవనంలో నేను సేకరించిన దాదాపు 2 లక్షల పుస్తకాలు, 30 వేల తాళపత్రాలు, లిఖితపత్రాలు ఇక్కడ విద్యార్థులకు అందుబాటులో ఉంచాలనే సంకల్పంతో ఈ భవనాన్ని పునరుద్ధరించి 'దక్కన్ ఆర్కైవ్స్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్' పేరున పరిశోధనా కేంద్రాన్ని ఇక్కడ నాలుగు సంవత్సరాల క్రితమే ప్రారంభించాము. ఈ కేంద్రం రెండు రాష్ట్రాల తెలుగువారికి అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. తెలుగు భాషా, సాహిత్యాలు, చరిత్ర అవిభాజ్యాలు. అవి విడదీయరానివి. మన గతం, మన భవిష్యత్తు, మన సంస్కృతి, మన చరిత్ర, మన మనుగడ కలిసే నడుస్తాయి. తెలుగువారందరం మన వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. మనందరం సమిష్టిగా తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షణకు ఉద్యమించాలని కోరుకుంటూ ఈ శతవర్ధంతి ఉత్సవాలకు సహకరించిన తెలుగు భాషోద్యమ సమాఖ్య వారికి, ఇతర పెద్దలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

వార్తా కథనం: కళ్యాణకృష్ణ, తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యదర్శివర్గ సభ్యుడు

తెలుగుజాతి మనదీ
నిండుగ వెలుగు జాతి మనదీ!!

# విశాఖపట్టణంలో కొమఱ్ఱాజు శతవర్ధంతి సభలు




**సహృదయ సాహితి ఆధ్వర్యంలో విశాఖపట్టణం స్థానిక ప్రిజం కళాశాలలో జులై 12వతేదీ సాయంత్రం 6 గం.లకు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు శతవర్ధంతి సభ ఘనంగా జరిగింది.**

సభకు అధ్యక్షత వహించిన సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు తెలుగుభాష, సాహిత్యం, సంస్కృతుల వికాసానికి ఎంతగానో కృషిచేశారు తెలుగు భాష పరిశోధనకే కాకుండా తెలుగు శాసనాల పరిశోధకులుగా విశేషమైన చరిత్ర సమాచారాన్ని లోకానికి అందించారు అని అన్నారు.

ప్రధాన వక్త, ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగుశాఖ, గౌరవ ఆచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న ఇలా ప్రసంగించారు. తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనంలో కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి పాత్ర శ్లాఘనీయం. తెలుగు భాషా సాహిత్యాల్లో విశేషమైన కృషి చేసి తనకంటూ విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకొన్న ప్రతిభామూర్తి లక్ష్మణరావుగారు. కొమఱ్ఱాజు భాషలో, సాహిత్యంలో, చరిత్రలో సంస్కృతిలో పరిశోధనలో రారాజు. ఎదురులేని మహారాజు అన్నారు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, విజ్ఞాన చంద్రికామండలి, విజ్ఞాన చంద్రికా పరిషత్తు, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర పరిశోధక మండలి మొదలైన ప్రముఖ సంస్థలద్వారా కొమఱ్ఱాజు సాహిత్యసేవ చేశారు.

లక్ష్మణరావుగారు శివాజీ చరిత్ర, హిందూ మహాయాగం, మహ్మదీయ మహాయాగం, హైందవ చక్రవర్తులు అనే నాలుగు చరిత్రగ్రంధాలు రాశారు. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం పేరుతో మూడు సంపుటాలను వెలువరించారు. లక్ష్మణరాయ వ్యాసావళి అనే రెండు వ్యాస సంపుటాలు ముద్రించారు. తెలుగు భాషాతత్వం గ్రంథం రాశారు. గౌతమ్ న్యాయ శాస్త్రం అనే గ్రంథాన్ని కొంత వరకు అనువదించారు. కొన్ని గ్రంథాలకు పీఠికలు రాశారు. మరికొన్ని గ్రంథాలను పరిష్కరించారు. ప్రత్యేకంగా కొన్ని వ్యాసాలు రాశారు. ఒక ప్రహసనం, రెండు కథలు రాశారు. గేయాలు, పద్యాలు కూడా వున్నాయి. కొమఱ్ఱాజు గొప్ప సాహితీ సంపన్నులు.

కొమఱ్ఱాజు వారి పాండిత్యం, ప్రతిభా అసాధారణం. వీరు తెలుగుజాతికి చేసిన సేవ చిరస్మరణీయం. వీరు తెలుగువారు కావడం మన భాగ్యం.. కొమఱ్ఱాజు మరణం తర్వాత కూడా జీవిస్తున్నారని మనం చెప్పవచ్చు. వీరి పరిశోధనాదృక్పథమే ఆయనకు మంచిపేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి. వీరి పరిశోధన అసమాన్యమైనది. అమూల్యమైనది. అనితరసాధ్యమైనది. కొమఱ్ఱాజు ఒక వ్యక్తికాదు,వ్యవస్థ. ఒక్కమాటలో చెప్పాలంటే కొమఱ్ఱాజు ఒక విజ్ఞాన సరస్వం. తెలుగుదేశంలో పుట్టి, రెండు దశాబ్దాలు మహారాష్ట్రంలో పెరిగి తెలుగులో అనేక ఉత్తమ సంస్థలను నిర్మించి, మంచి రచనలు చేసి, సమాజాభివృద్ధికి నిరంతర నిర్విరామకృషి చేసిన దీపధారి కొమఱ్ఱాజు. లక్ష్మణరావుగారి జీవితం ఒక సందేశం, ఒక స్ఫూర్తి, ఒక ఆదర్శం.

డాక్టర్ దామెర వేంకట సూర్యారావు కొమఱ్ఱాజును నేటికీ ఎందుకు స్మరించుకోవాలో ఈ తరానికి ఆయన గురించి ఏం తెలియాలో ఆ విషయాలన్నీ సవివరంగా వెలమల సిమ్మన్న తెలియజేశారన్నారు. కొమఱ్ఱాజు మహారాష్ట్రంలో చదువుకున్నా మాతృభాషపై మమకారంతో చేసిన సేవ, స్థాపించిన సంస్థలు, విజ్ఞాన సర్వస్వం అనే ఆలోచన మహత్తరమైనవని పేర్కొన్నారు.

అనంతరం జరిగిన చర్చావేదికలో డా.కె.వి.యస్.మూర్తి, కొత్తూరి రమణ, సిహెచ్.చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, విరియాల రామచంద్రరావు, రాంప్రసాద్, రామతాత, బి.రాధారాణి, మున్నగు సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాల్లో కొమఱ్ఱాజు పీఠాలను నెలకొల్పాలి: –డా. సిమ్మన్న

**విజ్ఞాన దీప్తి, సంస్కృతీ స్ఫూర్తి కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణ రావు గారి శత వర్ధంతి సభ ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ లో జులై13 న నిర్వహించారు. ఈ సభకు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కొమర్రాజు వారి మనవడు ఆచార్య కొమర్రాజు రవి విచ్చేశారు.**

సభాధ్యక్షులు ఆచార్య అప్పారావు మహాపురుషుల జయంతులు వర్ధంతులు తమ విభాగంలో నిర్వహిస్తుంటామని విద్యార్థులకు పరిశోధకులకు మంచి పరిజ్ఞానాన్ని స్ఫూర్తిని కలిగించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. ముఖ్య అతిధి ఆచార్య రవి ప్రసంగిస్తూ తమ కుటుంబ చరిత్రను వివరించారు. లక్ష్మణరావు గారి సోదరి బండారు అచ్చమాంబ సాహిత్యరంగంలోనూ, కుమార్తె కొమర్రాజు అచ్చమాంబ




**ఎడమనుండి డా. బూసి వెంకటస్వామి, ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య కొమఱ్ఱాజు రవి, ఆచార్య యోహాన్ బాబు, డా. దామెర సూర్యారావు, ఆచార్య సిమ్మన్న**

వైద్యురాలిగానూ అభ్యుదయ ఉద్యమాల్లోనూ, రాజకీయాల్లోనూ నిర్వహించిన పాత్రను తెలిపారు.ప్రధాన వక్త డా. దామెర వెంకట సూర్యారావు కొమర్రాజు వారి జీవితవిశేషాలను, వారు తెలుగు భాషా సంస్కృతులకు చేసిన సేవల్ని విపులంగా వివరించారు.

తెలుగు నాట పుట్టి మహారాష్ట్ర లో రెండు దశాబ్దాలు జీవించి మద్రాసు ప్రధాన కార్యస్థానంగా వ్యవహరించి ఆంధ్రావనిలో పలు సంస్థల్ని నిర్మించి సాహిత్య సృష్టికి సమాజాభివృద్ధికి తోడ్పడిన మహనీయుడు కొమర్రాజు లక్ష్మణరావు. 18. 5. 1876న కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో జన్మించారు. పూర్వీకులు మునగాల సంస్థానపాలనా వ్యవహారాలతో సంబంధం ఉన్నవారు. కొమర్రాజు వంశంలో 11 వతరం వాడైన లక్ష్మణరావు అనే ఆయన అమరావతి పాలకుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి వద్ద మంత్రిగా పనిచేశారు. ఆ తరంలో వెంకటప్పయ్య స్వయంగా కవి. ఆయన భార్య గంగమ్మ. ఆ దంపతుల మొదటి సంతానం అచ్చమాంబ తర్వాత కుమారుడు వేంకట లక్ష్మణరావు. లక్ష్మణరావు నాలుగో యేట తండ్రి మరణించారు. తల్లి పిల్లలతో నాగపూర్‌లో ఉన్న ఉద్యోగం చేస్తున్న తమ్ముడు బండారు మాధవరావు వద్దకు వెళ్ళింది. మాధవరావుకు భార్యావియోగం కలగడంతో తన కుమార్తె అచ్చమాంబను అతడికి ఇచ్చి వివాహం జరిపించింది. మాధవరావు మరాఠీ మాధ్యమంలో చదువుకుంటూ ఆ భాషా పత్రికల్లో చిన్న కవితలు కథలు రాసేవాడు. తాను పాఠశాలలో నేర్చుకున్నది అక్క గారికి చెప్పేవాడు. అచ్చమాంబ విద్యావంతురాలై కథారచయిత్రి కావడంలో లక్ష్మణరావు గారిది విశిష్టమైన భూమిక.

పట్టభద్రుడయ్యాక తల్లి కోరికపై లక్ష్మణరావు మునగాల సంస్థానానికి వచ్చి వారసత్వంగా ఆ కుటుంబానికి సంక్రమించే దివాన్ పదవి చేపట్టారు. మునగాలకు నాయని వేంకట రంగారావు పాలకుడయ్యారు. ఆయనకు లక్ష్మణరావుకు స్నేహం వర్ధిల్లింది. కోర్టు వ్యాజ్యాల నిమిత్తం లక్ష్మణరావు ఎక్కువ కాలం మద్రాసులో ఉండేవారు. అక్కడ ఆచంట లక్ష్మీ పతి, కాశీనాధుని నాగేశ్వరరావు, అయ్యదేవర మొదలైన వారితో సాంగత్యం ఏర్పడింది.1901లో హైదరాబాదులో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపించారు.1910 లో విజ్ఞాన చంద్రికా పరిషత్తు స్థాపించారు. హైద్రాబాద్‌లో ఆంధ్ర సారస్వతపరిషత్ నెలకొల్పడానికి సాయం అందించారు. దక్షిణ భారతదేశంలో విజ్ఞాన సర్వస్వం అనే ఊహే లేని రోజుల్లో ఆ దిశగా కృషి ప్రారంభించారు. ఆయన జీవిత కాలంలో 3 సంపుటాలు మాత్రం పూర్తయ్యాయి. లక్ష్మణరావు 35 వ్యాసాలు రాశారు.

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి నిర్వహణలో గాడిచర్ల హరి సర్వోత్తమరావు విశేషంగా తోడ్పడ్డారు. తెలుగు ప్రజానీకం లో విజ్ఞాన వీచిక ల ప్రసారంలో కొమర్రాజు వారిది అవిరళ కృషి. కొన్ని పరీక్షలు నిర్వహించి బహుమతులు ఇచ్చేవారు. పరీక్షాధికారులుగా కందుకూరి, కట్టమంచి, పనప్పాకం శ్రీనివాసాచార్యులు వంటి ప్రముఖులు ఉండే వారంటే ఆ సంస్థ ఏ స్థాయిలో పనిచేసేదో అర్థమవుతుంది.

లక్ష్మణరావు గారి 'తెలుగు భాషా తత్త్వం' విలువైన రచన. తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని ప్రతిపాదించారు. ఈ గ్రంథంలో సమాసాలను గురించిన ప్రకరణం ఉత్తమమైందిగా సంప్రదాయవ్యాకర్తలు గాని భాషా చరిత్రకారులు గానీ గుర్తించని అనేక విషయాలు చర్చించారని బూదరాజు రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ పుస్తకం లక్ష్మణరావుగారు మరణించిన 66 ఏళ్ళ తర్వాత ముద్రితమైంది.

కొమర్రాజు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి పక్షాన దేశ చరిత్రలు మహనీయుల జీవిత చరిత్రలు స్వీయ చరిత్రలు శాస్త్ర రచనలు నవలలు ప్రచురించారు. శాసనాల గురించి స్వయంగా పరిశోధన వ్యాసాలు వెలువరించారు. ఆంగ్లపదాలకు తెలుగు పరిభాషా పరికల్పన విషయం లోనూ కొంత కృషి సాగించారు. వారు సృజించిన పదాల్లో విశ్వవిద్యాలయం, సంపాదకుడు, నేటికీ ప్రామాణికంగా నిలిచి ఉన్నాయి.

రాజకీయ రంగంలో ఆయన పాత్ర మరీ ప్రముఖమైంది కాకపోయినా ఆయన వాటికి దూరంగా లేరు. కొమఱ్ఱాజు తిలక్ అభిమాని. బిపిన్‌చంద్ర పాల్ ప్రసంగాలను ఏర్పాటు చేశారు. బహుభాషావేత్త నిస్వార్థభాషా సేవకుడు ప్రచార విముఖుడు అయిన లక్ష్మణరావు 46 ఏళ్ళకే కన్నుమూయడం తెలుగుజాతి దురదృష్టం.

తర్వాత తెలుగుశాఖ గౌరవ ఆచార్యులు యోహాన్ బాబు, వెలమల సిమ్మన్న ప్రసంగించారు. కొమర్రాజు ఈ తరానికి గొప్ప స్ఫూర్తి మిగిల్చారని యోహానుబాబు అన్నారు. ఆచార్య సిమన్న మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల్లో కొమర్రాజు పీఠం నెలకొల్పి పరిశోధకుల్ని ప్రోత్సాహించడం ఆ మహనీయుడికి సరైన నివాళి అన్నారు ఈ సభలో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులే కాకుండా వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయం



**తెలుగు భాషకు ఆద్యులు- తెనుగోళ్ళు**

**రచన: తొలి తెలుగు దివ్వె**

పుటలు: 68, వెల 25/-

ప్రతులకు: తొలి తెలుగు దివ్వె

తెలుగు మూలాల అధ్యయన సంఘం

డోర్ నెం.31-9-22 ఎ, వీరయ్య వీధి

మారుతీనగర్, విజయవాడ - 520 004

ఫోన్:98492 19596

చదవవలసిన పుస్తకం

వెన్నెలకంటి రామారావు
9550367536

## దక్షిణ భారతదేశంలో ప్రథమ ప్రజా ఉద్యమకారుడు

# గాజుల లక్ష్మీనరసు చెట్టి




చరిత్రలో అగ్రగణ్య వ్యక్తులంటే, తాము ఎదిగి వచ్చిన యుగం, తామున్న ప్రజానమూహాల విశిష్ట లక్షణాలకు విస్పష్టమైన, నిశితమైన ప్రతిబింబంగా ఉంటూ, తమ కాలపు అవసరాలను, ఆకాంక్షలను వేరెవ్వరికంటే ప్రగాఢంగా వ్యక్తం చేసేవాళ్ళుగా పరిగణించాలి. అలాంటి చారిత్రక విశిష్ట వ్యక్తుల జీవిత చరిత్రలను రచించడం పైకి చాలా సులభసాధ్యమైన వ్యవహారంగా కనిపించినప్పటికీ, వాస్తవంలో అది అత్యంత సంక్లిష్టమైనది. మరీ ముఖ్యంగా చారిత్రక ఘటనల నమోదులకు అంతగా ప్రాముఖ్యత ఇవ్వని ఇండియాలో చారిత్రక వ్యక్తుల జీవిత కథనాలు పౌరాణిక కథనాలుగానే సాగాయి. అయితే చారిత్రక ఘటనాక్రమం గతిపై గణనీయమైన ప్రభావాన్ని నెరపిన అగ్రగామి వ్యక్తుల పాత్రను విశదపరచడానికి భౌతికవాద దార్శనికత అవసరం. అలాంటి దార్శనికత గల సమకాలీన తెలుగు చారిత్రకులలో వకుళాభరణం రామకృష్ణ గారు అగ్రగణ్యులు. వారి ఆచార్య మార్గదర్శకత్వంలో పరిశోధకులుగా ఎదిగి, అన్వేషణాత్మక వ్యాసాలు, గ్రంథాలు రచించిన కొంపల్లి సుందర్‌తో కలసి 'దక్షిణ భారతదేశంలో ప్రథమ ప్రజా ఉద్యమకారుడు గాజుల లక్ష్మీనరసు చెట్టి' (1806–68) అనే గ్రంథాన్ని (104 పేజీలు, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ) తెలుగు సమాజానికి అందించారు. 19 శతాబ్దిలో వలసపాలనా కాలంలో ప్రజా ఉద్యమకారుల గురించిన ఆధారాలు సేకరించడం కష్టసాధ్యమే. అయినప్పటికీ, 'గాజుల'వారి జీవిత చరిత్ర ప్రాముఖ్యతను, చారిత్రక అవసరాన్ని గుర్తించి, అనేక వ్యయ ప్రయాసలకోర్చి ఈ గ్రంథాన్ని తెలుగు పాఠకులకు అందించడంలో రచయితల పరిశోధన, కృషి ప్రశంసనీయం.

'ఇప్పుడే ప్రచురణ ఎందుకు?' అనే శీర్షికతో ఉన్న ముందుమాటలో ... 'గతాన్ని వర్తమానానికి వర్తింపచేయాలే కానీ, గతాన్ని కీర్తించడం కాదు, గతాన్ని విశ్లేషించాలి. వర్తమానానికి ముడివేయాలి. అప్పుడే చరిత్ర గమనం నిరంతరాయంగా, మంచి చెడులను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగుతుంది' అని రచయితలు 'గాజుల' వారి జీవిత చరిత్ర భవిష్యత్ తరాలకు ఎలా ఉపయుక్తంగా ఉంటుందో చక్కగా వివరించారు. ప్రజా ఉద్యమకారుడు, అనువాదకుడు, త్రిభాషా పత్రిక సంపాదకుడు అయిన 'గాజుల'వారి జీవిత చరిత్ర గ్రంథాన్ని తెలుగు భాషోద్యమ సారథి, 'అమ్మనుడి' తెలుగు మాసపత్రిక సంపాదకులు డాక్టర్ సామల రమేష్‌బాబుగారికి అంకితమివ్వడం 'గతాన్ని వర్తమానానికి ముడివేయడం'తో మంచి, చెడులను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగే నిరంతరాయ చరిత్ర గమనానికి సంకేతంగా నిలుస్తుంది.

'ఆసియా ఉత్పత్తి విధానం' (ఆసియాటిక్ మోడ్ ఆఫ్ ప్రొడక్షన్)లో కొనసాగుతూ శతాబ్దాల తరబడి చారిత్రకంగా కదంతాల్ (హిస్టారికల్ మార్కింగ్ టైమ్–పురోగమనరహిత చలనం) స్థితిలో ఉన్న భారతీయ సమాజం బ్రిటీష్, పోర్చుగల్, డచ్ వలసవాదుల ప్రమేయంతో 19వ శతాబ్దినాటికి క్రమంగా కదలబారింది. 'ఈస్ట్ ఇండియా కంపెనీ' పాలనలో భారతీయ సమాజం అనేక ఒడిదుడుకులకు లోనయ్యింది. క్రీ.పూ. నుంచి బ్రిటీష్ వలస పాలన దాకా ఇండియాలోకి వచ్చిన 'దురాక్రమణ'దారులంతా, ఇక్కడి సంస్కృతి కంటే వెనకబడిన సామాజిక వ్యవస్థకు చెందినవారు కాబట్టి, వారు 'యుద్ధంలో విజేతలే అయినా, సాంస్కృతికంగా పరాజితులుగా మిగిలారు'. ఇండియా కంటే చారిత్రకంగా ఉన్నత సామాజిక స్థితి (పెట్టుబడిదారీ వ్యవస్థ) లో ఉన్న బ్రిటీష్‌వారు ఈ సమాజ సామాజికార్థిక, సాంస్కృతిక మూలాలను గణనీయంగా పెకలించగల్గారు. బ్రిటీష్ వలసపాలనా, వ్యాపార, వాణిజ్య కేంద్రాలలో ఆంగ్ల విద్యను, సంస్కృతిని పుణికిపుచ్చుకున్న స్వదేశీ ఉదారవాద మేధో సమూహం ఆవిర్భవించింది. వారు ఉదారవాద ప్రతిఘటన (అహింస) బాట పట్టారు. అదే సమయంలో వలస దోపిడి తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో స్థానిక ఫ్యూడల్ శక్తులు, సామాన్య ప్రజలు ప్రతిహింసాత్మక ఉద్యమాలను చేపట్టారు. మద్రాస్ ప్రెసెడెన్సీలో 1906లోనే జన్మించిన గాజుల లక్ష్మీనరసు చెట్టి (చెన్నపట్నం/మద్రాస్), ఉయ్యాలవాడ నరసింహారెడ్డి (కోయిలకుంట్ల, కర్నూల్)లు శిస్తు/కొలు వసూలు కోసం రైతులను, ప్రజలను చిత్రహింసలు పాలుచేస్తున్న బ్రిటీష్ ఈస్ట్ ఇండియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేర్వేరు మార్గాల్లో ప్రజాఉద్యమాలు నడిపారు. 'అనుకూలత ఒకవైపు, ఘర్షణ మరోవైపు 19వ శతాబ్ది మధ్య నాటికి, ఘర్షణ పోరాట రూపాలను సంతరించుకుంది. హింసాయుత, అహింసాయుత పద్ధతుల్లో పోరాటాలు సమాజంలో చోటు చేసుకున్నాయి. హింసాయుత తిరుగుబాట్ల లక్ష్యాలు కొన్నిసార్లు స్థానికంగా, మరికొన్ని సార్లు పరిమితంగా ఉండేవి. అహింసాయుత పోరాటాలను విశాల సాంఘిక ధ్యేయాలు నడిపించేవి. సామాన్య ప్రజల కష్టసుఖాలు వీటిలో ప్రతిఫలించాయి. వీటి ప్రాతిపదికన చర్చలు, ఉద్యమాలు, పోరాటాలు నడిచాయి. వలసవాద ఆర్థిక దోపిడి, సాంస్కృతిక అరాచకాలు, సాంఘిక తప్పిదాలు ఎందరో ప్రజానాయకులను సృష్టించాయి. మద్రాసు ప్రెసిడెన్సీలో అలా ముందుకు వచ్చిన ప్రజాపోరాట యోధుడు

రాజకీయ వైతాళికుడు– గాజుల లక్ష్మీనరసు చెట్టి. 19వ శతాబ్ది మొదట్లో జన్మించి, శతాబ్ది మధ్య కాలానికి ప్రజానాయకునిగా ఎదిగాడు.' (పేజీ 14–15) 'భూమిక' వీర్షికలో వలసవాద కాలం నాటి హింసాయుత, అహింసాయుత పోరాట పద్ధతులను వర్గీకరిస్తూ, 'గాజుల'వారి అహింసాయుత ప్రజా ఉద్యమ నాయకత్వ స్వభావాన్ని రచయితలు గతితార్కింగా వివరించారు. 19వ శాతాబ్ది మద్రాసు ప్రెసిడెన్సీ గురించి వలస రచయితలు, చరిత్రకారులు వర్ణించినట్లుగా వికాసరహిత, నిరామయ ప్రాంతం కాదనీ, ఉత్తేజ, పురోగమన ప్రాంతంగా కొనసాగిన వైనాన్ని రచయితలు చక్కగా పేర్కొన్నారు. 'బౌద్ధ, జైనుల కాలం నుంచి సూఫీ, భక్తివాదుల వరకు భారతీయ సమాజం శాంతియుత పరిష్కారం వైపే మొగ్గు చూపింది. సామాజిక మార్పును శాంతియుతంగా సమన్వయం చేసుకొని, ముందుకు తీసుకెళ్ళింది... బెంగాల్ ప్రెసిడెన్సీలో రామ్‌గోపాల్ ఘోష్ ఎలాగో, బాంబే ప్రెసిడెన్సీలో నౌరోజీ ఫర్దూంజీ ఎలాగో, మద్రాసు ప్రెసిడెన్సీలో లక్ష్మీనరసు చెట్టి అలాంటి నాయకుడని చరిత్రకారులు పేర్కొన్నారు'. రచయితలు చేసిన ఈ రకమైన సాదృశ్యం విలువైనది. సమాజంలోని ప్రజా సమూహాలను పాలక వర్గాల రాజ్యం రెండు పద్ధతుల ద్వారా నియంత్రిస్తుంది. 1. బల ప్రయోగం, 2. భావజాలం. పాశ్చాత్య సమాజాల్లో బలప్రయోగం ప్రధానంగాను, భావజాల ఆధిపత్యం ద్వితీయ సాధనంగాను వినియోగిస్తే, ప్రాచ్య సమాజాల్లో భావజాలాన్ని ప్రధాన ఆయుధంగాను, బలప్రయోగాన్ని ద్వితీయ సాధనంగాను పాలకవర్గ రాజ్యాలు వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలకవర్గాల రాజ్య వ్యతిరేక పోరాటాలు కూడా స్థూలంగా భిన్న మార్గాల్లో (హింస, అహింస) ముందుకొచ్చాయి. అందుకే పాశ్చాత్య సమాజంలో బలప్రయోగం ద్వారానే రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే హింసాత్మక రూపంలో సామాజిక విప్లవాలు ఉనికిలోకి వస్తే, ఇండియాలో మొదటి గొప్ప సామాజిక విప్లవమైన బౌద్ధ వికాసం భావజాల ప్రాబల్యాన్ని సాధించే దిశగా సాగి విజయవంతమైంది. అంటే బలప్రయోగ ప్రయత్నాలేవీ లేవని కాదు. స్థల కాలాల్ని బట్టి హింస, అహింసాయుత ప్రజా ఉద్యమాలు చరిత్రలో ఉనికిలోకి వస్తాయేగానీ, స్వీయాత్మక ఎంపిక మనం ఎంచుకోలేమని గుర్తించాలి. రెండు పోరాట మార్గాలు హేతుబద్ధమైనవే, వాస్తవమైనవే. రైతాంగంపై బ్రిటిష్ వారి చిత్రహింసలకు వ్యతిరేక ప్రజా ఉద్యమం ఏకకాలంలో 'గాజుల'వారి పోరాటం అహింసా మార్గంలో జరిగితే, 'ఉయ్యాలవాడ'వారిది హింసామార్గంలో సాగింది. స్థల, కాలాలను బట్టి రెండు పోరాటాలు చారిత్రకంగా సమర్థనీయమైనవిగా నిలిచాయి. 'చారిత్రక నేపథ్యం' (ప్రకరణం 2)లో 'గాజుల'వారి ప్రజా ఉద్యమ దృక్పథం రూపొందిన చారిత్రక, సామాజిక, కుటుంబ నేపథ్యం గురించి, పరిణామ క్రమం గురించి అద్భుతమైన వివరణాత్మక విశ్లేషణ ఉంది.

'సమకాలీన సామాజిక పరిస్థితుల ప్రభావం వ్యక్తుల మీద, వారి ఆలోచన, ప్రవర్తనల మీద ఉంటుందనేది చారిత్రక సత్యం. స్పందన స్వభావం గల వారిపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ కోవకు చెందిన వాడే గాజుల లక్ష్మీనరసు చెట్టి' 'వ్యక్తిత్వ వికాసం' అనే శీర్షికన (ప్రకరణ–3) మద్రాసు (చెన్నపట్నం) వర్తక, పరిపాలన కేంద్రంగా అభివృద్ధి చెందిన తర్వాత స్వదేశీ వణికులు, అనేక వర్తక కుటుంబాలు ఆ ప్రాంతానికి వలస వచ్చి, ప్రముఖ పాత్ర పోషించనారంభించారు. అలాంటి కుటుంబాలలోని బలిజ కులంలో (శూద్ర కులం) జన్మించిన 'గాజుల వారు 11వ శతాబ్ది నాటి వైదిక మతంలోని కుల, మత, మహిళా వివక్షలతో విభేదించిన రామానుజాచార్యులు స్థాపించిన శ్రీవైష్ణవ మత సాంస్కృతిక నేపథ్యంలో పెరిగారు. దేశీయ పాఠశాలలో విద్యాభ్యాసం ముగిసిన వెంటనే వ్యాపారంలోకి ప్రవేశించి, కుటుంబ వారసత్వాన్ని కొనసాగించారు. క్రమంగా మద్రాసుపట్నంలో ఒక ముఖ్యమైన వ్యక్తిగా, స్వదేశీ వ్యాపారవేత్తగా ఎదిగిన 'గాజుల'వారు, విస్తృతమైన, సాంఘిక సంబంధాలను ఏర్పరచుకోవడంతో ప్రజలు, సమాజం, సామాజిక పరిస్థితులపై నిశిత దృష్టిని సారించగలిగారు. ఆ క్రమంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ, పలు ప్రజాసంఘాలను నిర్మించడమే కాకుండా ఇంగ్లీషు, తమిళం, తెలుగు భాషలలో 'క్రెసెంట్' అనే పత్రికను కూడా సమర్థంగా నడిపారు. ఆ క్రమంలో అమెరికాలో అంతర్యుద్ధ సమయంలో వ్యాపారంలో సంపాదించిన భారీ సంపదలన్నీ హారతి కర్పూరంలా హరించుకుపోయాయి. 'గాజుల'వారు జీవిత పరిణామ క్రమాన్ని, వ్యక్తిత్వ వికాసాల గురించి రచయితలు భావవాద దృక్కోణంలో తెలుగు సినిమా హీరోను పోలినట్లు కాకుండా వాస్తవంగా చిత్రీకరించారు.

'19వ శతాబ్దిలో పాశ్చాత్య సమాజ (ఆంగ్లేయ సమాజం) ఉదారవాదం ఒక దిగుమతి సరుకు, దిగుమతయ్యేది భావమైనా, సరుకైనా దానిపై/వాటిపై తయారీదారీ ముద్ర ఖచ్చితంగా ఉంటుంది. దేశీయ సమాజం ఆమోదం పొందటానికి వలస ప్రభుత్వం తన దగ్గరున్న అన్ని ఉపాయాలను అమలు చేసింది. ఈ క్రమంలో అనేక మంది దేశీయులు ఈ ధోరణికి ప్రభావితులైనారు.' బ్రిటీష్ వారి ఆర్థిక, సాంస్కృతిక జమిలి దోపిడి విధానాన్ని రచయితలు చక్కగా చెప్పారు. ఆ క్రమంలో పాశ్చాత్య విద్యా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభావితులైన విద్యావంతులు, ప్రజా ఉద్యమకారులు 1. పరిమిత ఉదారవాదులు, 2. అపరిమిత ఉదారవాదులుగా రూపొందారనే విశ్లేషణ బాగుంది. బ్రిటీష్ వారి సహకారంతో దేశీయ ఫ్యూడల్ బంధనాలు, కట్టుబాట్లను, అమానుషాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నవారిని 'పరిమిత ఉదారవాదులుగా'గాను, సమకాలీన ప్రభుత్వాలను ఇష్టం లేకపోయినా, తమ భావాలను అపరిమిత స్వేచ్ఛతో ప్రకటిస్తూ, అహింసాయుత పద్దతుల ద్వారా, మహజర్లద్వారా ప్రజా ఉద్యమాలను నడిపినవారిని 'అపరిమిత ఉదారవాదుదు'గాను వర్గీకరించడం గొప్పగా ఉంది. సమకాలీన సమాజంలో అనేకమంది విద్యావంతులు, ప్రభుత్వ, విద్యారంగాలలో పనిచేస్తున్న వారు శ్రీనివాస పిళ్ళే, వెంబాకం రాఘవాచార్యులు, వెన్నెలకంటి సుబ్బారావు, సామినేని ముద్దు నర్సింహం, ఏనుగుల వీరాస్వామి తదితరులు 'పరిమిత ఉదారవాదులు'. 'మాల్కం లెవిన్, హార్లే, గాజుల లక్ష్మీనరసు చెట్టి తదితరులు కొద్దిమంది 'అపరిమిత ఉదారవాదుల' కోవకు చెందుతారనే అంచనా బాగుంది. బ్రిటీష్ వలసవాదుల పాలన, వ్యాపార కేంద్రాలలో 'పరిమిత' 'అపరిమిత' ఉదారవాదులు దేశంలోని ఫ్యూడల్ సంస్కృతికి, వలసవాదుల అరాచకాలకు వ్యతిరేకంగా అహింసాయుత పద్ధతుల ద్వారా తమదైన శైలిలో ప్రజాఉద్యమాలు నడిపారు. 'అపరిమిత ఉదారవాది' 'గాజుల' వారు వేల మంది ప్రజలతో నిరసన సభలు,

సమావేశాలు, మహజర్ల ఉద్యమాన్ని నడిపిన ప్రజానాయకుడు. 1830-60 దశకం వరకు 'గాజుల'వారు పరిశోధనాత్మక జర్నలిజం ద్వారా ఈస్టిండియా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలను 'క్రెసెంట్' పత్రిక కేంద్రంగా సమన్వయించారు.

బ్రిటన్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం దక్షిణ భారత దేశంలో రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టి నిర్బంధ కౌలు, శిస్తు వసూళ్ళ ద్వారా సామాన్య రైతులను, చాలీచాలని భరణాలతో ఫ్యూడల్ జమీందార్లను తీవ్ర అణచివేతకు గురిచేసింది. అందుకు ప్రతిక్రియగా బ్రిటిష్ వాణిజ్య వ్యాపార కేంద్రాలలో అహింసాయుత ప్రజా ఉద్యమాలు, గ్రామీణ, సామంత రాజ్య ప్రాంతాలలో హింసాయుత తిరుగుబాట్లు చెలరేగాయి. మద్రాసు ప్రావిన్స్‌లోని చెన్నపట్నం ప్రాంతంలో అపరిమిత ఉదారవాది గాజుల వారి సారథ్యంలో అహింసాయుత ప్రజా ఉద్యమం చెలరేగితే, కర్నూల్ ప్రాంతంలో 'ఉయ్యాలవాడ' వారి సారథ్యంలో సాయుధ తిరుగుబాటు ఎగసిపడి, ఆయన ఉరితీతతో చప్పబడింది. అయితే బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి, ఇంగ్లాండ్‌లో బ్రిటిష్‌రాణి ప్రభుత్వానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని 'గాజుల'వారు చాకచక్యంగా వినియోగించుకునేందుకు వేలాది మంది ప్రజల భాగస్వామ్యంతో మహజర్లు, నిరసన ఉద్యమాలను నడిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 'వ్యాపార పెట్టుబడి' ఆధిపత్యం ముగిసి, పారిశ్రామిక పెట్టుబడి సర్వత్రా ఆధిపత్యంలోకి వస్తున్న కాలమది. బ్రిటన్‌లో వ్యాపార పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈస్ట్ కంపెనీ నిర్వాకాలను, అక్కడి పారిశ్రామిక పెట్టుబడి చట్టబద్ధంగా శాసన సభల ద్వారా కట్టడి చేసేందుకు ప్రయత్నాలకు 'గాజుల'వారి ప్రజా ఉద్యమాలు బాగా సహకరించాయి. దాంతో మహజర్ల ఉద్యమంతోనే ఆయన అనేక విజయాలను సాధించగలిగారు. మద్రాస్ ప్రెసిడెన్సీలోని ప్రజల కష్టాలను వివరిస్తూ, కంపెనీ ప్రభుత్వం సాగిస్తున్న చిత్రహింసలను ఏకరువు పెడతూ వేలాది మంది సంతకాలతో బ్రిటన్ పార్లమెంట్‌కు ఆయన తరచూ మహజర్లను, నివేదికలను సమర్పించేవారు. ఈస్ట్ ఇండియా ప్రభుత్వాన్ని తొలగించి, బ్రిటన్ రాణి ప్రభుత్వం అధికారం హస్తగతం చేసుకోవాలని కూడా డిమాండ్ చేసారు. ఆయన నడిపిన ప్రజా ఉద్యమం ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వాన్ని పూర్తిగా ఇరుకున పడేసింది. ఈ మహజర్ల నేపథ్యంలో బ్రిటన్ రాణి ప్రభుత్వం 'టార్చర్ కమిషన్'ను నియమించి, కంపెనీ ప్రభుత్వ పాలనను కట్టడి చేసేందుకు ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం రద్దు గావించబడి, దాని స్థానంలో 1860 నుంచి బ్రిటన్ రాణి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈస్ట్ ఇండియా పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దేశీయ ఉదారవాదులను బ్రిటన్ రాణి ప్రభుత్వం సత్కరించడమే కాక, తన పాలనాయంత్రాంగంలో అంతర్భాగం చేసుకుంది. ఈస్ట్ ఇండియా ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాన్ని నడిపిన 'గాజుల'వారు బ్రిటిష్ రాణి ప్రభుత్వ హయాంలో రాజ్యాధికారంలో అంతర్భాగమై మద్రాస్ ప్రెసిడెన్సీలో అనేక ప్రజా సంక్షేమ విధానాలకు రూపకల్పన చేయడంలో కీలక పాత్ర పోషించారు.

'గాజుల' వారి వ్యక్తిత్వం వికసించిన తీరు, పరిణామాన్ని మూడు ప్రధాన భాగాలుగా 1. అంకురం, (1806-40), 2. వికాసం (1840-50), 3. ఫలదీకరణం (1850-68) అని ఆ రచయితలు విభజించిన తీరు బాగుంది. ఈ గ్రంథం 4వ ప్రకరణం 'ప్రజా జీవితంలో గాజుల లక్ష్మీనరసు చెట్టి' అనే శీర్షికలో ఆయన ప్రజా ఉద్యమ ప్రయాణాన్ని రచయితలు లోతుగా విశ్లేషించారు. కంపెనీ ప్రభుత్వం క్రైస్తవ మిషనరీలను అడ్డం పెట్టుకుని మత మార్పిడుల ద్వారా విద్య, ఉద్యోగ, సాంస్కృతిక అణచివేతలకు పాల్పడుతుండడాన్ని బ్రిటన్ పార్లమెంట్‌కు నివేదికలు, మహజర్లు సమర్పించే రూపంలో ఆయన పోరాటం సాగించారు. పరిశోధక పాత్రికేయాన్ని, ప్రజాఉద్యమాన్ని సమన్వయించి అనేక ప్రజా వ్యతిరేక కంపెనీ విధాన నిర్ణయాలను 'గాజుల' వారు, ఆయన సహచర బృందం మొగ్గలోనే ఎదుర్కొని విజయవంతంగా తిప్పి కొట్టగలిగారు. పత్రిక కేంద్రంగా ప్రజాఉద్యమాలను విజయవంతంగా నిర్వహించారు. ప్రజా నిరసన సభలను వేలాది మందితో జయప్రదం చేయడంలో కృతకృత్యులయ్యారు. ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించడమే కాకుండా, 'మద్రాసు స్వదేశీ సంఘం' అనే ప్రజా సంఘ నిర్మాణాన్ని మద్రాసు ప్రెసిడెన్సీ అంతటా విస్తరింప చేసారు. క్రైస్తవ మతంలోకి మార్పిడులను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్మించిన కంపెనీ పాఠశాలలకు పోటీగా సార్వత్రిక విద్యను అందించే లక్ష్యంతో స్వదేశీ పాఠశాలల ఏర్పాటును ప్రోత్సహించారు. అదే సమయంలో బాలికల విద్య గురించిన భావన, పాఠశాలల కార్యాచరణ ప్రణాళికలు పూలే దంపతుల కంటే ముందే దక్షిణాదిలో గాజుల లక్ష్మీనరసు చెట్టి, ఆయన సహచర మేధావి బృందంలో ప్రబలంగా ఉండటం విశేషం.

'గాజుల'వారు 1840 దశకంల నుంచి క్రమం తప్పక బ్రిటీష్ శాసనసభ్యులతో ప్రజా సమస్యలపై కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపేవారు. 1854లో 14వేల మంది సంతకాలతో బ్రిటీష్ రాణికి సమర్పించిన మహజరుతో కంపెనీ నుంచి రాజ్యాధికారాన్ని బ్రిటీష్ రాణి ప్రభుత్వానికి బదలీ చేయాలని కోరడం ఆయన చాణక్యానికి తార్కాణంగా నిలుస్తుంది. వీటన్నిటి పర్యవసానంగా ఆ తర్వాత వచ్చిన బ్రిటీష్ రాణి ప్రభుత్వం ఆయనకు ఉన్నత పౌర పురస్కారం సి.ఎస్.ఐ. (కంపానియన్‌షిప్ ఆఫ్ ద స్టార్ ఆఫ్ ఇండియా) ని ప్రదానం చేసింది. ఆ తర్వాత కాలంలో స్థానిక కార్యవ్యవహారలకు సంబంధించిన అనేక సెలెక్ట్ కమిటీలందు సభ్యునిగా ఆయన నియమితులైనారు. కంపెనీ ప్రభుత్వాన్ని పడగొట్టడంతో 'గాజుల'వారి లక్ష్యం నెరవేరినట్లయింది. అదే సమయంలో 1863 నాటికే 'గాజుల'వారు ఆర్థికంగా చితికిపోయారు. 1863-68 మధ్య కాలంలో తంజావూరు రాణుల సమస్య, మైసూరు మహారాజు రాజ్య పరిరక్షణ వంటి ఇతరత్రా వ్యవహారాల్లోను ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వ పాలనను బ్రిటన్ ప్రభుత్వ శాసన సభ్యుల సహాయంతో, ప్రజా ఉద్యమాల రూపంలో ఎదుర్కొన్న నిబద్ధత గల సంస్కరణవాది గాజుల లక్ష్మీనరసు చెట్టి సదా స్మరణీయుడు. చివరగా 'ముగింపు' (ప్రకరణం 5) లో 19వ శతాబ్దిలో మద్రాసు ప్రెసిడెన్సీ ఒక నిశీధి, నిరామయ ప్రాంతం అని అభివర్ణిస్తున్న వలసవాద చారిత్రకుల వాదనలను

**తరువాయి 47వ పేజీలో.**




# చంద్రిక కథ

## అరవంలో వ్రాసిన అసంపూర్ణ నవలకు

## బంగోరె 'ముందుమాటలు'

(గత సంచిక తరువాయి)

**వీరేశలింగంగారు జరిపించిన చరిత్రాత్మకమైన వర్ణాంతర వివాహం**

1898 లో సరోజినీదేవి చటోపాధ్యాయ- గోవిందరాజులు నాయుడుగారల వివాహం వీరేశలింగంగారి అధ్యక్షతన జరిగింది. అది దక్షిణ భారతదేశంలో జరిగిన దాదాపు మొట్టమొదటి ముఖ్యమైన వర్ణాంతర రాష్ట్రాంతర వివాహమని చెప్పవచ్చు. ఒక బెంగాలీ బ్రాహ్మణ అమ్మాయిని వొక తెలుగు బలిజ అబ్బాయి పెండ్లి చేసుకున్న సంఘటన అది.

ఈ వివాహాన్ని వీరేశలింగంగారు జరిపించడానికేమో జరిపించారుగానీ, ఆయన స్వీయ చరిత్రలో దీన్ని ప్రత్యేకంగా పేర్కొనలేదు. దీన్ని గూర్చి తెలుగు వాళ్ళుకూడా ఎవరూ ప్రముఖంగా ప్రస్తావించనూ లేదు. అటు వీరేశలింగం జీవిత చరిత్ర విమర్శకారులుగానీ, ఇటు సరోజినీదేవి జీవిత చరిత్రకారులుగానీ పేర్కొనలేదు. సరోజినీదేవి జీవిత చరిత్రను నాకు తెల్సి ఇద్దరు తెలుగులో వ్రాసారు – ఒకరు గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు, ఇంకొకరు పుట్టపర్తి నారాయణాచార్యులు గారు. వీరిలో మొదటివారు సరోజినీదేవి పెండ్లిని వీరేశలింగంగారు జరిపించారని వూరకే వొక వాక్యం వ్రాసారుతప్ప, ఇంకేమీ వివరాలు ఇవ్వలేదు. రెండవవారు వివాహం ఫలానా తేది జరిగిందన్నారే తప్ప ఫలానావారు జరిపించారనైనా చెప్పలేదు.

సరోజినిదేవి వివాహానికి -వీరేశలింగం గారికీ సంబంధమేమిటి? అని పరిశీలిస్తుంటే పద్మినీ సేన్ గుప్త ఆంగ్లంలో వ్రాసిన సరోజినీదేవి చరిత్రగ్రంథంలో ఈ వివాహానికి సంబంధించి వొక బ్రిటీష్‌వనిత వ్రాసిన ఆంగ్లగ్రంథంలో నుండి పునరుద్ధరించిన భాగంలో కొన్ని వివరాలు లభించాయి.ఆ భాగాన్ని దిగువ ఇస్తున్నాను:

"Sarojini Chattopadhyaya returned to India in September 1898, and married Dr.Govindarajulu Naidu in December the same year. "

Dr. Naidu was in every way an eligible husband for the young nightingale. He was the son of Military Doctor and he had been married at the age of eighteen to a very young girl and had lost her in less than a year. He had then been sent to England for medical studies and had returned a successful Doctor. He soon proved to be invaluable in the service of the Nizam's Government and built himself a highly respectable name. His love for Sarojini was deep and sincere, and his regard for her had not changed at all during the three years of separation. No one could stop the marriage and it became a landmark in the progress of social reform when intercaste marriagies were almost unknown. Eighteen years earlier. when Pandita Ramabai Saraswati, a Konkanasth Chitpawan Brahmin had married a Bengali Kayastha, a furore had been created. When sarojini married, no such open opposition was voiced, except that the socio-traditional structure of Bengal and the South was slightly shaken. But Sarojini's marriage with Dr.Naidu laid the foundation for intercaste and interprovincial marriages.

"The question arose as to how the bride and bridegroom, of two different castes, could be united. Fortunately, Keshab Chandra Sen had introduced the Brahmo Marriages Bill which was passed through his own efforts on March 19,1872 (Act III of 1872 which legalized Brahmo marriages). It allowed a civil marriage between two Indians regardless of caste. But both the parties, had to deny that they were Hindu, Mohammedan, Christian, Parsee, Buddhist, Sikh or Jain. It was under this Act that Dr. Govindarajulu Naidu, M.B.C.M.(EDIN), Medical officer to His Highness the Nizam's Imperial Service Troops, was married to Sarojini Chattopadhyaya, on December 2, 1898. The Act of 1872 had been introduced in Hyderabad as one of Aghorenath's efforts to bring about reform and break up caste prejudices. Little did he imagine, perhaps, that his own daughter would be among the first to be married under this form of civil registrations.

"An interesting account of the Wedding which took place actually in Madras, appeared in an Indian news- paper: 'Mrs. Ram Mohan Roy, a Brahmo lady of culture and refinement., acted as the bridesmaid and added grace and beauty to the solemnity of the occasion. The ceremony opened with a prayer by

Mr.S.Somasundaram Pillai, B.A, and after the prescribed rituals had been gone through,Rao Bahadur Pandit Veeresalingam Pantulu Garu officiated as the Minister for the sacred occasion. After the Minister's charge to the happy couple regarding the responsibilities of life, Dr.Aghorenath gave away the bride and united the pair in holy wedlock in due form, the marriage being solemnized in the presence of Mr.FD.Bird, the Registrar of marriages of Madras Town. Rao Bahadur pandit Veeresalingam Pantulu Garu then pronounced the benediction. Before the several guests dispersed, some refreshments were served and partaken with great cheers amidst toasts and replies in perfect harmony without any distinction of caste. During the short time they spent in the Brahmo Mandir the couple received the congratulations of all friends present and drove off to the Capper House Hotel, where Dr.Govindarajulu Naidu had been staying.

"This interesting event must be regarded as unique in many respects, and as marking an epoch in the history of the reform movement in this country. The bridegroom belongs to the Balija community, whereas the bride is a Brahman by birth; the former is a Madrasi, where as the later is a Bengali; and both are England returned Hindus. Dr.Govindarajulu Naidu, M.B.CM, Completed his medical course in England, and his wife, a matriculate of the Madras University, spent a couple of years there to receive higher education'.(Quoted in 'wrongs of Indian Womanhood'- by Mrs. Marcus B.Fuller, Oliphart Anderson and Ferrier 1900, London and Edinburgh, pp. 219, 220)".

SAROJINI NAIDU
Biography: by Padmini Sengupta
Asia Publishing House, 1966

ఇదంతా చదివిన తర్వాత వొక సందేహం కలక్కపోదు. వధువు సరోజినీ దేవి తండ్రి అఘోరనాథచటోపాధ్యాయ నిజాం సంస్థానంలో పెద్ద విద్యావేత్తగాను, వరుడు గోవిందరాజుల నాయుడుగారు అదే సంస్థానోద్యోగంలో పెద్ద డాక్టరుగానూ వుంటున్నారు. అంటే ఇద్దరూ అప్పటికే హైదరాబాదు వాసులైనపుడు వారి వివాహాన్ని హైదరాబాదులో కాకుండా మద్రాసులో వీరేశలింగంగారి ఆధ్వర్యంలో ఎందుకు జరిపించాల్సి వచ్చింది? వీరేశలింగంగారి అనుకూలతకోసం గానా? వీరేశలింగంగారే ఎందుకు జరిపించాల్సి వచ్చింది?

అధిక ప్రసంగ మనుకోకపోతే అఘోరనాథ చటోపాధ్యాయగార్ని గూర్చి నాలుగుమాటలు. రవీంద్రుని 'క్షుదితపాషాణ్' (హంగ్రీ స్టోన్స్) కథలో 'రైల్లో మనిషి' పాత్ర ఈ అఘోరనాథుడేనని బెంగాలీ సాహిత్య చరిత్రకారులు సాక్ష్యాలు బయటకు తీసారు. 1877లోనే జగదీశచంద్రబోస్, ఆచార్య ప్రఫుల్ల చంద్రరేలకన్నా ముందే సైన్సులో విదేశీ విశ్వవిద్యాలయంనుండి డాక్టరేట్ పట్టాపొందిన మొదటి భారతీయుడు, మేధావి అఘోరనాథ్. ఎడింబరోలో, జర్మనీలో విద్యగరిపి వచ్చిన వ్యక్తి. విదేశాలనుండి తిరిగి వచ్చిన వెంటనే హైద్రాబాదులో వొక స్కూలు స్థాపించడం, తర్వాత ఇప్పటి నిజాంకాలేజి (అప్పటి హైదరాబాదు కాలేజి)కి ప్రిన్సిపాల్ కావడం జరిగింది. బహుభాషాకోవిదుడు, సంస్కృతీపరుడు. ఆయన సైన్సును వదిలి రాజకీయాల్లో అతివాదియై హైద్రాబాదు సంస్థానంలో కాంగ్రెస్ వుద్యమాన్ని ప్రవేశపెట్టిన మహనీయుడు. మద్రాసుతో అఘోరనాథ్‌కు సంబంధమేమిటంటే – అప్పటి ఆ హైదరాబాదు కాలేజి మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధింపబడి వుండడం.

అఘోరనాథ్ గారికి, తన కుమార్తె పెండ్లి జరిపించాల్సి వచ్చినపుడు – ఈ 'వింత' పెండ్లి ఎవరి ఆధ్వర్యంలో జరిపించాలనే ఆలోచన వచ్చి వుండాల. ఈ ఆలోచనల్లో రాజమండ్రి కాలేజి తెలుగు పండితుడుగా వుంటూ దాదాపు 30 విధవా వివాహాలు జరిపించి స్త్రీ జనోద్ధారకుడుగా ఎన్నో వుద్యమాలు నడిపి పెద్ద సంచలనాన్ని సృష్టించి అంతకుముందు సంవత్సరమే రెండేళ్ళ సెలవుమీద మద్రాసుకువచ్చి స్థిరపడివున్న వీరేశలింగంగారి పేరు స్ఫురించి వుండాల. స్ఫురించడానికి మరొకరులేరా? లేక అంతకుముందే వీరేశలింగంగారికీ అఘోరనాథ్‌గారికీ స్నేహితమేమైనా వుందా? (అఘోరనాథ్ గారి క్రింద కొంతకాలం రఘుపతి వెంకటరత్నంనాయుడుగారు శిష్యరికంచేసినట్లు ఎక్కడో చదివినగుర్తు). ఏమో? ఏమైనా దక్షిణభారతంలో ఆ రోజుల్లో ఈ రంగంలో అంతటి గురుతరమైన స్థానాన్ని ఆక్రమించివున్న వుద్యమనాయకుడు వీరేశలింగంగారు తప్ప మరొకరు లేరనే చెప్పుకోవాల. ఈ వివాహం జరిగిన సంవత్సరంలోనే 'దక్షిణ భారత విద్యాసాగర్' అనే బిరుదాన్ని రానడేగారిచేత పొందివున్న వ్యక్తికూడా గనుక వీరేశలింగంగారి పేరు అఘోరనాథ్‌గారి ఆలోచనకు రావడంలో ఆశ్చర్యం లేదుగదా? బహుశా వీరేశలింగంగారి అనుకూలత కోసంగానే ఈ వివాహాన్ని మద్రాసులో జరిపించాల్సి వచ్చిందేమో. లేక హైదరాబాదులోనే జరిగితే అక్కడ స్థానికంగా యీ అసంప్రదాయమైన వివాహాన్ని పురస్కరించుకుని ఎదురయ్యే ప్రత్యక్ష విమర్శలను తప్పించుకోడానికీ కావచ్చు. లేక మరెందుకైనా కావచ్చు.

ఇక్కడ మనం గమనించాల్సిన అంశం – బొత్తిగా పరిచయంలేని తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతిగారు నవల వ్రాస్తూ వొక పాత్రకు విధవావివాహం చేయించాల్సి వచ్చినపుడు వీరేశలింగంగార్ని కథలో వాడుకోవాల్సి వచ్చింది. అట్లనే తనతో పెద్దగా పరిచయంలేని వొక బెంగాలీ విద్యావేత్త అఘోరనాథ్ తన కుమార్తెకు వర్ణాంతర వివాహం చేయించాల్సి వచ్చినపుడు ఆ వివాహానికీ వీరేశలింగంగారే ఆధ్వర్యం వహించాల్సివచ్చింది. అంటే పెద్దగా పరిచయం లేనివారిలో, బొత్తిగా ముఖపరిచయం లేని పరభాషల వారిలో సైతం వొక మహాసంస్థ సదృశమైన వుద్యమనిర్మాతలైన వీరేశలింగంగారి వ్యక్తిత్వ వైభవం ఎంతగా ముద్ర వేసుకున్నదో ఈ రెండు సంఘటనలే చాలు వివరించడానికి. మరో వర్ణాంతర వివాహం కూడా వీరేశలింగంగారి అధ్వర్యాన్నే జరిగింది. నేటి కేంద్రమంత్రి మోహన్ కుమార మంగళంగారి తండ్రి కీర్తిశేషులు పి.ఎస్. సుబ్బరాయన్‌కూ రాధాబాయి గారికీ జరిగిన వివాహాన్ని కూడా మన వీరేశలింగంగారే జరిపించారు. దీన్ని గూర్చిన ఇతర విషయాలు ఇది వ్రాసేసమయానికి అందినవి కావు. భవిష్యత్తులో జరగబోయే

పరిశోధనలమీద ఆశ పెట్టుకొందాం.

కలకత్తాలో రమాబాయి వివాహం తర్వాత అంతటి చారిత్రక ప్రధానమైన వివాహాన్ని దక్షిణభారతంలో తన సొంత చేతులమీదుగా జరిపించినపుడు వీరేశలింగంగారు దాన్ని గూర్చి తన స్వీయచరిత్రలో ఎందుకు వ్రాసుకోలేదు? ఆ సంఘటనను గూర్చి ఎందుకు వివరించదల్చుకోలేదు? మర్చిపోయినందువల్ల వ్రాయలేదా? ఆ మాత్రం చారిత్రక స్పృహలేనివారా వీరేశలింగంగారు? ఆ వివాహ సన్నివేశాన్ని పేర్కొని ఆ రకం పెండ్లిండ్లపట్ల అప్పట్లో తనకున్న అభిప్రాయాలను నిష్కర్షగా చర్చించే మానసిక స్థైర్యం తనలో లేనందువల్ల దాటవేసారా? ఆ వివాహంతో మనస్ఫూర్తిగా identify గాకుండానే దాన్ని mechanical గా జరిపించారా? ఆ సంధియుగంలో వీరేశలింగంగారి మానసికస్థితిని గూర్చి అప్పటి ఆయన mental attitudeను గూర్చి మరింత గాఢంగా గూఢంగా నిర్దుష్టంగా అంచనా కట్టవల్సి వుంది.

కానీ ఈ వివాహాన్ని గూర్చి వీరేశలింగంగారు తన స్వీయచరిత్రలో బొత్తిగా ప్రస్తావించకపోలేదు. ఆ పెండ్లి జరిగిన 10 సంవత్సరాల అనంతరం 1909 లో హితకారిణీ సమాజానికి విరాళాలు పోగుచేసేందుకై వీరేశలింగంగారు బొంబాయి ప్రాంతాలకు యాత్రవెళ్ళినపుడు ఆ సన్నివేశాలను గూర్చి వ్రాస్తూ ఆ వేరే విషయాల మధ్య ఏదో యధాలాపంగా ఈ పెళ్ళిగూర్చి ఈ క్రింది విధంగా వ్రాస్తున్నారు:

…'మేము మఱునాడు సికిందరాబాదు చేరి నాటికక్కడ నిలిచిపోతిమి.అక్కడ డాక్టరు జీ.నాయుడుగారు నన్ను చూచి నేను పోవుచున్న పనిని దెలిసికొని మొదటిచందాను పదునేనురూపాయల నాచేతికిచ్చిరి. నేను వారియింటికి బోయినపుడు కవయిత్రియైన సరోజినీ నాయుడస్వస్థులయి మంచముమీద బరుండియుండి బిడ్డలను తన వద్దకు బిలిచి మీ తాతగారు వచ్చినారు చూడుడని నన్ను చూపెను. వారి వివాహమును చెన్నపట్టణములో నేను చేసియుండుట చేత నామె నన్నట్లు పిలిచినది. సరోజినీదేవిగారి తండ్రి తమ కొమారిత వివాహమును మా యింటనే చేయవలసినదని నన్ను కోరిరిగాని నే నట్లుచేయక సమాజమందిరములో జరిపితిని' ( **స్వీయచరిత్రము - రెండవ భాగము, మూడవ ప్రకరణము.)**

చారిత్రకంగా అంతటి ప్రముఖమైన వివాహాన్ని గూర్చి ఈ నాలుగుమాటలేనా వ్రాయాల్సింది? అంతకంటే సాదా అయిన 'మామూలు విధవా వివాహాలను గూర్చి ఎంతో విపులంగా వ్రాసిన ('నాయుడుశాఖలో ఇది మొదటివివాహం' అని అనేక విధాలుగా ప్రత్యేకంగా వివరంగా ఇతర వాట్నిగూర్చి పేర్కొన్న) వీరేశలింగంగారు దీన్ని గూర్చి ఇంతేనా వ్రాయాల్సింది? ఆ వివాహాలంటే తానే అన్నీ నిర్ణయించుకుని అన్ని ఏర్పాట్లుచేసుకుని స్వయంగా జరిపించినవి గావడం, ఇవంతా కేవలం అన్నీ ఇతర్లు నిర్ణయించుకుని తాను వూరకే పెద్దగా వివాహమప్పుడు లాంఛనంగా ఆధ్వర్యం వహించాల్సిరావడంవల్ల - వీరేశలింగంగారు ఇంతకంటే ఎక్కువ వ్రాయలేదనుకోవాలా? అంతేగాక, పైన పేర్కొన్నదాంట్లో ఆఖరు వాక్యం ఏదో సంజాయిషీ చెప్పుకున్న ధోరణిలో మళ్ళీ అనుమానాస్పదంగా ధ్వనిస్తున్నది. వీరేశలింగంగారి సొంత ఇంట్లో తన కూతురు పెండ్లి చేయమని సరోజినీ దేవి తండ్రి ఎందుకు కోరారు? అట్లా కోరడంలో ఆయన వుద్దేశ్యం? ఆయన కోరినట్లుగా వీరేశలింగంగారు తన సొంత ఇంట్లో జరిపించకుండా సమాజమందిరంలో ఎందుకు జరిపించారు? అట్లా జరిపించడంలో వారి వుద్దేశ్యం? సొంత ఇంట్లో చేయించే ధైర్యం లేకనా? లేక సమాజమందిరంలో జరిపిస్తే వొక social sanction' ఏర్పరచినట్లవుతుందనా? అయినా ఆ వాక్యాన్ని ఈ సందర్భంలో ఎందుకు చెప్పుకోవల్సి వచ్చింది? అఘోరనాథ్ అంతటివారు తనను పిల్చి తన కూతురు పెండ్లి జరిపించమని కోరినపుడు కాదనలేక తన నాయకత్వానికి ఎక్కడ బీటలు పడ్తాయోనని జంకి వొప్పుకోవల్సి వచ్చిందా? ఆ నాటికి వర్ణాంతర వివాహాల విషయమై వీరేశలింగంగారు ఇంకా పూర్తిగా reconcile కాలేదా? మరి ఇతర కారణాలేమైనా వున్నాయా?

వీరేశలింగంగారు తన కవుల చరిత్రలో వేమననుగూర్చి కవిగా మాట సామెతగానైనా ప్రస్తావించకపోవడాన్ని పేర్కొంటూ నార్లవారు తన 'వేమన' ఆంగ్ల గ్రంథంలో ఇట్లంటున్నారు:

"But why did Veeresalingam, himself a social and religious reformer, join the vicious crowd? His Cromwellian Puritanism might have violently repelled by the lewdness and obscenity of some of the verses foisted on vemana, partly by his rustic devotees and mostly by his devilishly clever detractors and denegators..."

ఆ 'క్రాంవెలియన్ ప్యూరిటనిజమ్' ను ఈ సందర్భంలో కూడా వీరేశలింగం గారికి వర్తింపజేసి అంచనా కట్టడం తొందరపాటవుతుందేమో.

తన మరణానికి 13 ఏళ్ల ముందు 1906లో తన కులాన్ని తెలియజేసే బాహిరి చిహ్నమైన జంధ్యాన్ని కూడా విసర్జించి పారేసి వర్ణభేదాన్ని త్యజించి సార్వజన సౌభ్రాత్వాన్ని వహించిన వీరేశలింగంగారి విషయంలో ఈ రకమైన అనుమానాలు పెట్టుకోవడం భావ్యంకాదేమో. అంత మహావ్యక్తులైన రాజారామమోహనరాయ్, దేవేంద్రనాథ ఠాగూర్ గారలు కూడా ఈ పని చేయలేకపోయారన్నప్పుడు, క్రిస్టియన్ మిషనరీ లిచ్చిన టీపార్టీకి వెళ్ళి విందారగించినందుకు రానెడేగారు ప్రాయశ్చిత్తం చేసుకోవల్సి వచ్చిందన్నప్పుడు విరూపాక్షపీఠం శంకరాచార్యులవారు వెలివేసినా కూడా జంకుగొంకుల్లేకుండా ధైర్యవిలసితంగా ఎదుర్కొన్న వీరేశలింగంగారిపట్ల ఈ రకమైన సందేహాన్ని వ్యక్తం చేయడం ఉచితం కాదేమో. ఆ రోజుల నాటికి బాలవిధవల దుస్థితి సంఘంలో వికృతరూపం దాల్చి వొక ఘోరమైన సమస్యగా తాండవిస్తున్నందువల్ల వారి పునరుద్ధరణకే కంకణం కట్టుకుని తన శక్తినంతా అందుకు కేంద్రీకృతం చేయాల్సివచ్చిందనీ; వర్ణాంతర వివాహాలనేవి అప్పటికి కేవలం intellectual పరిధిలో పైవర్గాల వారికి మాత్రమే పరిమితమై ఉండడంవల్ల వీరేశలింగంగారు ఆ రకం అవగాహనకు లోనయ్యారా? తన స్వీయచరిత్రలో వర్ణవ్యవస్థను గూర్చిన విమర్శలు, వ్యాఖ్యలు, తనకేర్పడిఉన్న అవగాహనలు - వీటన్నిటినీ సమన్వయించుకుని ఈ కోణం నుండి పరిశీలించి అంచనా కట్టవల్సి ఉంది.

ఆయన డైరీలు, లేఖలు మనకు పూర్తిగా దొరక్కపోబట్టి ఆయన సమగ్రమైన జీవితచరిత్ర మనకు ఇంకా లభించకపోబట్టి ఈ సందేహాలకు స్పష్టమైన సమాధానాలు లభించడం లేదు. బహుశా

భవిష్యత్పరిశోధనల్లో వీట్ని తేల్చి చెప్పగలగడం సాధ్యమవుతుందనే ఆశిద్దాం. రాజమంఁడిలోవున్న వీరేశలింగంగారి మ్యూజియంలో పోయినవి పోగా చేరివున్న కొన్ని లేఖలు వగైరా పత్రాలునుండి కొంత సమాచారాన్ని చూచి ఈ సందేహనివృత్తి చేసుకున్న తర్వాతనే వ్రాయడం మంచిదనుకున్నానుగానీ ఇప్పటికే ఈ గ్రంథముద్రణకు అప్పులపాలైవున్న నేను వెంటనే రాజమంఁడి వెళ్ళిరావడానికి స్తోమతలేకనే ఇప్పట్లో మానుకోవల్సి వచ్చింది.

ఈ విషయమై వీరేశలింగంగారిపై పరిశోధనచేసి డాక్టరేట్ పట్టా పొంది ఉన్న అమెరికన్ యువకుడు లియోనార్డ్‌గారికి జాబు వ్రాసినప్పుడు ఆయన వ్రాసిన ప్రత్యుత్తరంలో నుండి కొన్ని భాగాలను పేర్కొనలేకుండా ఉండలేకపోతున్నాను.:

"Your letter. Sri V.R. Narla also came by yesterday and mentioned your work. He brought up this question of inter-caste marriages. We recalled that Veeresalingam had, indeed, performed inter-caste marriages, but usually between different subsects, like the Niyogi and Vaidiki. Around 1897-1900 in Madras inter-caste marriages were promoted by social reformers there like K. Natarajan and B. Varada Rao. They initiated these because at that time Veeresalingam wanted to begin widow marriages in Madras, and they did not want to have their Madras Social Reform Association sponsor them. So, they began to promote inter-caste marriages, but only among different subsects.They did not promote real inter-caste marriages like the one of Sarojini Naidu. My own belief is that Veeresalingam did not emphasize that particular match because his diaries for that period are missing. I found that he was very hazy about dates in his autobiography unless he actually had before him something written at a particular time and bearing a date.

"To some extent Bharati was correct in thiking that Veeresalingam was a Brahmanical reformer. But this has more to do with the times than with his own inclinations. After all, widow marriages were carried out by Western-educated people, and Brahmans had 71% of the B.A.'s then. Also, the belief that social change occured through imitating examples of higher status people, that the elite in society first innovated and their changes then filtered down to the masses, was very powerful. At the end of the 19th century non-Brahman leaders were interested in jobs, not social reform.

"But Veeresalingam actually did change once he returned to Rajahmundry in 1904 and came under the influence of D. Pedabapayya. He shucked his sacred thread, promoted inter dining by inviting individuals of different religions, and also performed widow marriages for Telagas and Kammas. I discovered this by looking at his correspondence for the period 1910-1919 in the new Veeresalingam museum at Rajahmundry. So, even though his ideas of change through an elite, whether Brahman or Western educated, probably remained the same, he was forced to adopt to new patterns in order to retain his leadership of social reform in the early twentieth century.Actually, this is the main theme of my thesis.

"Veeresalingam was often criticized because he neglected the welfare of the married couples. True enough. He was concerned with the performance of the marriage ceremonies because they represented symobolic acts of defiance against orthodoxy and reaffirmed his reputation as the principal leader of reform. This was a constant pre-occupation of his-the need of recognition for his work and his leaderhsip. Much of his manueuvering consisted of trying to provide for a successor to himself, one who would carry on the work (Basavaraju Gavarrazu, Mritanjaya Rao in 1893, and D. Pedabapayya in 1906; ultimately, he came to rely on Raghupati Venkataratnam Naidu).

"I found that he seemed to be a very self-contained person who often disregarded the advice of friends. This is evident from the autobiography. But what he omits to say is how much his friends changed from decade to decade. For instance, his trustees for the Town Hall are compeltely different from his selections for trustees of the Hithakarini Samaj. He doesn't seem to have been very much attached to people if they happened to cross him. In Gogulapati's case, his love and expectations for the boy were equally great, but the latter won out when the boy refused to do what Veeresalingam demanded. A very prickly sort of person, and a very ambitious one...."

లియోనార్డ్ భావాలు కొన్నిటితో మనం ఏకీభవించలేకపోయినా, ఈ లేఖాంశాలను బట్టి చూస్తే వీరేశలింగంగార్ని గూర్చి ఎంత లోతుకు వెళ్ళి నిశితంగా వొక విదేశీకోణం నుండి పరిశీలించి పరిశోధించారో తెలుగు పాఠకులకు తెలివిడి చేద్దామనే వుద్దేశ్యంతోనే ఈ పై వాక్యాలను ఉదహరించాను. లియోనార్డ్ పరిశోధనా గ్రంథం త్వరలో ప్రచురణవుతుందనే ఆశిద్దాం.

...... తరువాయి వచ్చే సంచికలో

## గ్రంథాలయం



### విశ్వకవి వేమన యోగి

**రచన: భట్టరుశెట్టి పద్మారావు రాయలు**
పుటలు: 198,
ప్రతులకు: బూర్ల సంతోష
కరీంనగర్ సాహితి
ప్లాట్ నెం.403 వెంకటేశ్వర టవర్స్,
జ్యోతినగర్, కరీంనగర్-505 001
ఫోన్:94915 98040



### ఉపకారి

**రచన: బూర్ల వేంకటేశ్వర్లు**
పుటలు: 118, వెల 150/-
ప్రతులకు: బూర్ల సంతోష
కరీంనగర్ సాహితి,ప్లాట్ నెం.403
వెంకటేశ్వర టవర్స్,జ్యోతినగర్,
కరీంనగర్-505 001
ఫోన్:94915 98040

మధురాంతకం నరేంద్ర
9866243659

# మానవత్వానికి మల్లెమాల



ప్రపంచపు సామరస్యాన్ని ఏమాత్రం కల్లోల పరచకుండా, దాని పొందికనే వీలయినంత కృషి చేసి, మనుషుల్ని ప్రేమిస్తూ జీవించి, నిశ్శబ్దంగా ప్రపంచానికి వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయే అతికొద్దిమంది మంచి మనుషుల్లో డా.మల్లెమాల వేణుగోపాలరెడ్డిగారు తప్పకుండా ఉంటారు. జులై నెల 2 వతేదీన ఆయన లోకాన్ని వదిలిపెట్టి వెళ్లడంతో కడప సాహిత్య ప్రపంచమే కాదు, తెలుగు భాషా ప్రపంచం కూడా బోసిపోయింది.

తక్కువ ఫీజు తీసుకుని వైద్యం చేయడంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న వేణుగోపాలరెడ్డిగారి ప్రవృత్తి సాహిత్యంతో గట్టిగా ముడిబడిపోయింది. కథకుడిగా, నవలా రచయితగా, చివరి రోజుల్లో ఆధ్యాత్మికవేత్తగా ఆయన ఆ ప్రాంతం వాళ్ళకంతా సుపరిచితుడు. ప్రముఖ కవి, సినీ నిర్మాత మల్లెమాల సుందర రామిరెడ్డి గారికి ఆయన స్వయానా చిన్న తమ్ముడు. అన్నగారి సాహిత్యాభిమానం ఆయనలోనూ చిన్నప్పటినుంచీ మొగ్గతొడిగింది. స్వస్థలం నెల్లూరయినా ఆయన కడపకు చెందిన డా. వరలక్ష్మిగారిని పెళ్లిచేసుకున్నారు. కడపలోనే స్థిరపడిపోయారు. ఆ జిల్లా సాహిత్య యాత్రలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించారు.

గుంటూరు వైద్యకళాశాలలో చదువుకున్నాక ఆయన విశాఖపట్నంలో ఆంధ్రా వైద్య కళాశాలలో ఉపన్యాసకుడుగా పనిచేశారు. ఆ రోజుల్లో విశాఖలో నెలకొన్న గొప్ప సాహిత్య వాతావరణమూ, అక్కడి గొప్ప రచయితల సాహసమూ ఆయన సృజనాత్మకతను వెలిగించాయి. కడపకు బదిలీ మీద వచ్చాక, కొద్ది సంవత్సరాల తర్వాత ఆయన ఉద్యోగాన్ని వదిలిపెట్టి, భార్యతో కలసి స్వంత వైద్యశాలను ప్రారంభించుకున్నారు. పేదల వైద్యుడుగా పేరు తెచ్చుకున్నారు.

తన తొలినాళ్ళలో వేణుగోపాలరెడ్డిగారు 'శిరీష' అనే కలం పేరుతో రచనలు చేసేవారు. ఆయన రచనల్ని చదివితే ఆ కలం పేరు ఆయనకు అన్ని విధాలా సరిపోతుందన్న నమ్మకం కలుగుతుంది. ఆయనది నిజంగా శిరీష కోమలమైన హృదయం. పిల్లలు పెంచుకునే పూలతోటలా వేణుగోపాలరెడ్డి గారి కథానికా ప్రపంచం చాలా అందమైంది. ఆయన క్రమశిక్షణతో పెరిగి, బుద్ధిగా చదువుకుని, ఆదర్శవంతమైన వైద్యవృత్తిని చేపట్టి, తన తల్లిదండ్రులకూ, సోదరులకూ కీర్తి ప్రతిష్ఠలు పెంచుతూ జీవించిన వ్యక్తి. మనిషనేవాడు సత్యాన్ని చెప్పాలి, ధర్మాన్ని తప్పకూడదు, వృత్తినే దేముడుగా భావించాలి, మొదలైన మౌలిక విలువలను రక్తగతం చేసుకున్న మానవుడాయన. ఆయన విశిష్టవ్యక్తిత్వానికి పూచిన మంచి పువ్వుల్లా ఆయన సాహిత్య రచనలన్నీ రూపొందాయి.

తీరిక లేని వృత్తిలో వుండే మంచి మానవుడి జీవనయానపు ఉపనదిలా ఆయన సాహిత్యయాత్ర కొనసాగింది. తన అనుభవ పరిధిలోకొచ్చిన అరుదైన విషయాలనూ, తన మనస్సుకు తాకిన మధురానుభవాలను, తనను కలచివేసిన సంఘటనలనూ ఆయన కథలుగా మలుస్తూవచ్చారు. సాహిత్యసృజన ఆయనకు ఆత్మశోధనగానూ, దిశానిర్దేశంగానూ తయారైంది. పాఠకుల్లోకూడా అదే భావాలను రేకెత్తిస్తుంది. వేణుగోపాలరెడ్డిగారి దృష్టి అంతుపట్టని మానవ స్వభావంపైనా, అర్థంకాని జీవన సంక్లిష్టతలపైనా సోకదు. వృత్తిలో అంతగా మునిగిపోయిన వ్యక్తికి, అలాంటి చిక్కుముడులను తరచి చూసే తీరిక వుండదు. అయితే శాస్త్రీయ విద్య, దీక్ష లాంటి వృత్తే ఆయనలో సౌకుమార్యాన్నీ, దివ్యత్వాన్నీ ఏమాత్రం చేరలేకపోయాయి. ఆయన కథలన్నీ వేమన పద్యాల్లా, స్పష్టంగా, సూటిగా,నిక్కచ్చిగా వుంటాయి.

వేణుగోపాలరెడ్డిగారికి జీవితంపైన చెప్పలేనంత ప్రేమ వుంది. మనుషుల మంచితనాన్ని చవిచూసిన గొప్ప అనుభవాలున్నాయి. మంచిని మంచి అని, చెడును చెడు అని చెప్పగలిగే ధైర్యముంది. పాఠకుడ్ని తనంతటి విద్యావేత్తగా గుర్తించి, అతడి భుజంపైన చేయి వేసుకుని, ప్రేమగా కథలు చెప్పే కథా కవితార్థయుక్తి ఆయనలో చాలా వుంది. ఆయన పెంచిన సాహితీవనం ప్రశాంతంగా వుంటుంది. అక్కడ పాఠకులకు శాంతి, ఆనందం, అనుభవం, అవగాహన దొరుకుతాయి.

కడపజిల్లా సాహిత్య ప్రపంచానికంతా ఆయన చాలా దశాబ్దాలపాటు కేంద్ర బిందువుగా వున్నారు. కడపజిల్లా రచయితల సంఘాన్ని ఆయన ఆత్మీయ మిత్రులు జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారితో కలిసి స్థాపించి, దాదాపు పది మహాసభలను గొప్పగా నిర్వహించారు. కడపలో బ్రౌన్ స్మారక గ్రంథాలయస్థాపనకు జానమద్దిగారికి ఆయన పెద్ద అండగా నిలబడ్డారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో కార్యవర్గ సభ్యుడుగా కూడా పనిచేశారు. నండూరి రామకృష్ణమాచార్యగారు అధికారభాషాసంఘ అధ్యక్షుడుగా వున్న కాలంలో దాని సభ్యుడుగా వుండి తెలుగుభాషాభివృద్ధికి తనవంతు

**తరువాయి 47 వ పేజీలో**

పి. శివరామకృష్ణ 'శక్తి
94414 27977

# శంకరన్ గారి తరం ముందు-తరువాత

## అడవి సమృద్ధి - అన్న సమృద్ధి.



మార్క్సిస్టు విశ్లేషకుడు రాంభట్ల వేద భూమిలో తృణ కాష్ట జలసమృద్ధిఅనే పదబంధం తరచు వాడారు. అది కొండ/మెట్ట మీది ప్రాంతాలకు (ఆధిత్యక) చెందింది కాగా, కొండకింద (ఉపత్యక) పల్లంలో వాపీ కూప తటాకాలు ఏర్పరచి, పాలకులు అన్న సమృద్ధి చేకూర్చారు. పన్నులు వసూలు చేసారు. క్రమంగా వారు ఏర్పరచిన ఈ వనరులు సప్త సంతానాలతో (కూపం, తటాకం, ఉద్యానం, సత్రం, అశ్వత్థ ఆరోపణం, మండపం,పుత్రుడు.) విలసిల్లిన జానపదాలు పురాలుగా అభివృద్ధి అయినాయి. కానీ ముందు మాటరాసిన చరిత్రవేత్త బీ.యన్.శాస్త్రి గారు ఈ క్రమం గుర్తుచేస్తే బాగుండేది.

### రాజాశ్రయం-రాజోద్యోగం.

అభివృద్ధి చేయటానికి/చేసిన వనరులపై పన్ను వసూలు, లెక్కల కోసం- గ్రామస్థాయినుండి కరణాలను ఏర్పరిచారు. రాజప్రతినిధిగా శాంతి భద్రతలు చూసుకుంటూ, పన్ను వసూళ్ళకు సహకరిస్తూ మునసబు/మణియం రాజరికం కొనసాగడానికి కావలసిన మంత్ర తంత్రాలు, సంస్కృతీకరణం వైదికులు; కోశం నింపటం, హంగు ఆర్భాటం, రంజింపచేయటానికి కావలసిన కావ్య కళావినోదం నియోగులకు అలవడింది.

### రైత్వారీ విధానం ఈ అభినవ మన్రోలు, మెకాలేలు.

ఉద్యోగులను సంతృప్తి పరచి ,పన్నులు గుంజటంకోసం కావలసిన బలగం సమకూర్చుకోటానికి, తెల్లవాడు సార్వత్రిక విద్య బలపరిచాడు. ఈ మెకాలే చదువుద్వారా రాజాశ్రయం పొందిన భద్రలోకం, సగటు విద్యార్థికి రోల్ మోడల్ అయినారు.వారు కవులు కళాకారులుకూడా అయితే , అరచేతిలో తేనె, మోచేతినుంచి నాకిస్తారు. ఆ విధంగా ఉద్యోగ స్వామ్యం బహుముఖంగా ఊడలు దిగింది.

బాలగోపాల్ చెప్పినట్లు వలస పాలన పౌరహక్కులను ఎంత మన్నించినా.....ఈ ఉద్యోగ వ్యవస్థతో రాజీ పడింది. యూరోప్‌లో రాచరికాన్ని అంతంచేసి, చర్చి అధికారానికి తోక కత్తిరించి, బూర్జువా రాజ్యయంత్రాన్ని నెలకొల్పిన ప్రజాస్వామ్యం ఇక్కడ నియంతృత్వమయ భూస్వామ్య రాచరికంతో బ్రాహ్మణ్యంతో సహజీవనం చేసింది.(పుట 139) మా చట్టాలు మంచివే కాని, మీ రామప్ప పంతులు నియోగపు తెలివి తేటలు వాటిని భ్రష్టు పట్టించాయని తెల్లవాళ్ళు అంటారేమో కాని, ఆ చట్టాలకూ ఈ కంణీకపు తెలివి తేటలకు బాగాకుదిరింది (మరపురాని మనిషి బాలగోపాల్ పై నివాళి వ్యాసాలు (పుట 137) ఉద్యోగులుకూడా, రైత్వారీ విధానం ప్రవేశ పెట్టిన ఒకనాటి మన్రో దొర గారినుండి శంకరన్ గారిదాకా చేతనైనంత పని చేసారు. కరణం మునసబు పాత వాళ్లైనా, వాళ్ళ అక్రమాలచే తాము నియమించిన రెవెన్యూ, పోలీసు ఇనస్పెక్టర్లు, కోర్టులు అదుపుచేస్తారనుకున్నారు. ఇదే సమయంలో మహారాష్ట్ర లో రైత్వారీ విధానాన్ని జ్యోతిబా పూలే వ్యతిరేకించాడు. ముస్లింల కాలంలో గ్రామం స్వతంత్రంగా ఉండి, దేశం పరతంత్రమైంది.తెల్లవాడి హయాంలో గ్రామం పరతంత్రమే, దేశం స్వతంత్రం కాసాగింది అని ఈ మార్పును వినోబా బావే వ్యాఖ్యానిస్తాడు..

1830లలో పాలెగాళ్ళను తొలిగించి రైత్వారీ విధానం ప్రవేశ పెట్టినట్లే, అదే సమయంలో నేటి ఉత్తరాంధ్ర మన్యంలో పాలకొండ పితూరీని, ఇటీవలి దాకా విశాఖ జిల్లాలో ఉన్న గొలుగొండ- గూడెం పితూరీని అణచి వేసి, పాలకులను తొలగించి, రైత్వారీ విధానం ప్రవేశ పెట్టారు. అక్కడి రెవిన్యూ పోలీసు, కోర్టుల అరాచకానికి, వారిమీద జనం అపనమ్మకానికి 1 లో డేవిడ్ ఆర్నాల్డ్ వ్యాసం- గూడెం లో ఇచ్చిన ఉదాహరణ పేర్కొన తగినది. జాని కాకరి. అప్పుపడినందుకు అతనిపొలం లాక్కో వలసిందిగా కోర్టు డిక్రీ ఇచ్చింది. కాని అతని పొలం ముఖాసాలోఉంది.కాని సర్వేయర్లు రైత్వారీ పొలంగా చూపించి పొలంనుండి తొలగించారు. లంచం తిన్న అధికారులు సాహుకారు వైపు ఉన్నారని, తను అప్పీలు చేసినా లాభం లేదని, అప్పటికే ఈ అధికారుల అహంకారానికి మండిపడుతూ పితూరీకి దిగిన స్థానిక పాలకులు ముఠాదార్లతో కలిసి ఆ సాహుకారు ఇంటిమీద దాడి చేస్తాడు. తనను కచేరికి వచ్చి పించను తీసుకోమని తహసిల్దార్ అధికారమదం మీద ఒకనాటి పాలెగాడు ఉయ్యాల వాడ నరసింహారెడ్డి తిరగ బడ్డాడు.

### ఉద్యోగులు -పంతుళ్ళు

రైత్వారీ విధానంతోపాటు, సార్వత్రిక విద్య ద్వారా, తమలాంటి ఉద్యోగులు తయారు కావటానికి మెకాలేలాగా మన వాళ్ళు తెల్లవాళ్ళు పడ్డారు. ఆ ఉద్యోగులు సృష్టించే కవిత్వాలు కళలు, జానపద గిరిజన సాహిత్యాన్ని కనుమరుగు చేశాయి. ఇలా పాలకులుగా పంతుళ్ళుగా పక్షపాతంతో పనిచేసే ఉద్యోగ స్వామ్యాన్ని గాడిలో పెట్టే నేర్పు, నైపుణ్యాలు జనసామాన్యానికి నేర్పకపోతే అభివృద్ధి కల్పించే చైతన్యం, కవిత్వం కళాపోషణ వెర్రితలలు వేస్తుంది. సంస్కరణలు విఫలమై వెట్టి చాకిరీకి దారితీస్తాయి... మార్పుకోసం రాజకీయం ఒక్కటే దారి అవుతుంది.ఉద్యోగాలు మారుతున్న కొద్దీ అధికారుల ప్రాధాన్యతలు మారుతుంటాయి. అసంపూర్తి గా మిగిలిన పనులు పట్టించుకోనేవాళ్ళు లేక సామాన్యజనం నలిగిపోతుంటారు. ఒక పక్క శంకరన్ వంటి వారి భజన చేస్తూ, అటువంటి అధికారులను అవతార పురుషులుగా కీర్తిస్తూ, జనాన్ని పక్కదారి పట్టించే రాజకీయంతో, చేతులు కలిపే

దళారీలు నయవంచన చేస్తారు. మన స్వతంత్రోద్యమం ముందునుండీ ఇదే వరవడి కొనసాగుతుంది.

### చీకటి వాకిట్లో చిరు దీపం

సాహితీమిత్రులు తెచ్చిన శంకరన్ గారి స్మారక సంచికలో, నాటి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీలోని ఉట్నూరు రెవెన్యూ డివిజన్‌లో, ఒక ఏడాది లోనే 206 గ్రామాల భూమి రికార్డులను తాజా స్థితికి తెచ్చి 84,500 ఎకరాలను పంపిణి చేసారు. 5900ఎకరాలలో రక్షిత కౌలుదార్లకు యాజమాన్య హక్కు కల్పించారు. 1616 ఎకరాల మిగులు భూమిని పంచారు. 1636 ఎకరాల గిరిజన భూమిని గిరిజనేతరులనుండి స్వాధీనం చేసుకుని గిరిజనులకు అప్పగించిన వైనాన్ని చీకటి వాకిట్లో చిరుదీపంగా, శంకరన్ ఉదహరించిన రాష్ట్రంలో భూసంస్కరణల కథలో ఆంగ్ల వ్యాసాన్ని అనువదించి ఇచ్చారు.(పుట 213)..

### ఏజెన్సీ భూముల సర్వే

ఈ కృషి పూర్వాపరాలు తెలియాలంటే, దానికి పునాది వేస్తూ నక్సలైట్లు దేశభక్తులు అని మెచ్చుకున్న ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 1987లో 9 కోట్ల రూపాయలు మంజూరు చేసి నాటి సాంఘిక సంక్షేమ కార్యదర్శి శంకరన్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఏజెన్సీ భూముల సర్వే ( తెలుగు గిరిజన మాగాణి సమారాధన) గూర్చి తెలుసుకోవాలి. ఈ సొమ్ముతో ఏజెన్సీ లోని అన్ని రెవెన్యూ డివిజన్లకు, ఉట్నూరులో లాగే సర్వేబృందాలను ఏర్పరచారు. అంతకుముందే 1969,70 లలో ఏజెన్సీలో ముఠాలు, ఎస్టేట్లు, మహాళ్ళు రద్దుచేసి రైత్వారీ పట్టాలిచ్చారు. అడవులలో ఉండి విముక్తి పోరాటాలు చేస్తున్న రైతుకూలీ సంఘాలు (నక్సలైట్లు) ఈ పట్టా లివ్వటానికి వచ్చిన సిబ్బందిని తరిమేసారు (మహత్తర శ్రీకాకుళోద్యమం. డా. శివరామిరెడ్డి). ఆ సిబ్బంది అప్పటికే పల్లంలో భూములు వశం చేసుకున్న రైతులకు, అడవులు సాగులోకి తెస్తున్నట్లు బొంకిన కలప వర్తకులకు తమకు తోచినట్లుగా పట్టా లిచ్చారు. గిరిజనులు కొండలలోపలికి పోయి, పోడు వ్యవసాయం ముమ్మరం చేసారు. పోడు వారి జన్మహక్కు అంటూ వారికి ఈ సంఘాలు అండగా నిలబడ్డాయి. వెదురు, కలప వ్యాపారులు కూలీరేట్లు పెంచేందుకు కృషిచేస్తూ బలపడ్డాయి. ఆ పోడు భూములకు పట్టాలిచ్చేందుకు చేపట్టిన ఈ సర్వే కార్యక్రమం ఆయా అధికారులను బట్టి ఒకోచోట ఒకో విధంగా అమలు జరిగింది/లేదు.

### రైతు కూలీ సంఘాలు- ఉద్యోగ సంఘాలు. పౌరహక్కుల సంఘాలు.

రైతు కూలీ పోరాటాల వల్లనే మార్పు వస్తుందని నమ్మి ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ ఉద్యమాల్లో పాల్గొని నలిగి పోయిన కొండగాలి భూషణం మాస్టారి వంటివారు తరువాత ఉపాధ్యాయులైనారు. ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు పెట్టి, నక్సలైట్ ముద్ర నుండి బయట పడి. పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజక వర్గాల రాజకీయాలలో మునిగిపోయి, ఈ సర్వే గూర్చి పట్టించుకోలేదు.



ఉద్యమాల ఖిల్లా వరంగల్ జిల్లాలో రాజుకొంటున్న పౌరహక్కుల ఉద్యమంలో పాల్గొంటున్న యువతరం మేధావులు బాలగోపాల్ జనార్ధనరావు, వరవరరావు, ఇంద్రవెల్లి మారణ కాండమీద నిజనిర్ధారణ జరిపారు. ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో ప్రముఖ పాత్ర వహించారు. అనేక రైతుకూలీ సంఘాల ,వామపక్షాల మద్దతుతో నడిచే ఈ పౌరహక్కుల సంఘాలలో విభేదాలను, కనీస మర్యాద లేకుండా తనను సాగనంపిన వైనాన్ని. కన్నబిరాన్ తన ఆత్మకథ (24 గంటలు)లో వివరించారు. మొత్తానికి ఈ సంఘాలలో చురుకుగా పనిచేస్తున్న మేధావులుకూడా ఈ సర్వే గూర్చి పట్టించుకోలేదు.

### సంఘాలలో రాజకీయాలు.

పౌరహక్కుల సంఘాలను విస్తృత పరచటానికి తను చేసిన ప్రయత్నాలను కన్నబిరాన్ చెప్పుకొచ్చారు. ఆయన నెల్లూరు వాడు. నెల్లూరులో న్యాయ వాదిగా పనిచేసి, యానాది ఎరుకల తెగల విముక్తికోసం ఉద్యమస్థాయిలో పనిచేసిన వెన్నెలకంటి రాఘవయ్య ఆయనకు తెలిసే ఉంటారు. రాఘవయ్యగారు శ్రీకాకుళం పోరాటం తరువాత 1970 నవంబర్‌లో పర్యటించి జైలుపాలయిన వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, మరణ శిక్షలను యావజ్జీవ కారాగార శిక్షలుగా మార్చాలని ప్రకటించారు. కాంగ్రెస్ వాడు అని కావచ్చు, ఆయనను, ఆ ఉద్యమ బాధితులకోసం న్యాయ విచారణకై పాటుపడిన వారు ఆయనను కలుపుకోలేదు. నెల్లూరు జిల్లాలో పనిచేసిన శంకరన్ గారికి రాఘవయ్యగారు బాగాతెలుసు.

ఇక శంకరన్ మిగతా జిల్లా అధికారులతో నక్సలైట్లకు బందీ అయిన తూర్పుగోదావరిలో సర్వే బృందాలు పకడ్బందిగా రికార్డు తయారు చేసారు కాని, తాము వేయించిన జీడిమామిడి తోటలకు పట్టాలివ్వటానికే అధికారుల కృషి పరిమితమైంది. పైన చెప్పినట్లు ఉట్నూరులో ఈ సర్వే జరిపించిన అధికారి పి.వి. రమేశ్ తరువాత రంపచోడవరం గిరిజనాభివృద్ధి సంస్థ అధికారిగా వచ్చారు. అభివృద్ధిమీద దృష్టి పెట్టిన ఆయన, ఈ సర్వే మీద దృష్టి పెట్టలేదు. ఇక్కడ ఈ సర్వే రికార్డు కాపీ చేసుకుని అనుభవం సంపాదించిన శక్తి పశ్చిమగోదావరిలోకి విస్తరించినపుడు అటువంటి రికార్డు అక్కడ ఉండి ఉండాలని భావించింది. కాని అక్కడ ఎవరూ తయారుచేయలేదు. వేలాదిగా గిరిజనులు ఉద్యమించి జైలుపాలైన తరువాత ప్రభుత్వం అంతకు ముందు




**తరువాయి 47వ పేజీలో.**

ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
98485 98446

## అడుగుజాడలు-ఆనవాళ్ళు:25

# ఇనాంగూడ - బిజిలాపూర్ యాత్ర

తెలంగాణాలోని సూర్యాపేట జిల్లా, ఫణిగిరి వద్ద గల క్రీ.శ 1-3 శతాబ్దాల నాటి బౌద్ధారామాన్ని చూడటానికి మా ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఉద్యోగుల్ని అక్కడకు తీసుకెళ్ళాలని అనుకొన్నాం. రేపు ఉదయమే ప్రయాణం. ఆఫీసువారు, మాంచి క్రిస్టా కారు ఏర్పాటుచేశారు. ఉదయం 6 గంటలకు నేను, జితేంద్ర, సనాతన, దుర్గ, మైత్రేయ కలిసి బయలుదేరాం. నేనుండేది ఖాజాగూడా కాబట్టి ఔటర్ రింగ్‌రోడ్ మీదుగా పోతూ ఉన్నాం. ఘటకేసర్ దగ్గర రోడ్డు దిగి బోనగిరి, ఆలేరు, జనగామ నుంచి దేవరుప్పుల, తిరుమలగిరి మీదుగా ఫణిగిరికి వెళ్ళాలి. ఔటర్ రింగ్ రోడ్ నుంచి విజయవాడ జాతీయ రహదారికి దించాడు జితేంద్ర. రామోజీ ఫిలింసిటీ దాటక, అయ్యో ఇటుకాదే, దారి తప్పాం అనుకొన్నాం. సరే చౌటుప్పల్ మీదుగా పోవచ్చని బయలుదేరాం. రామోజీ ఫిలింసిటీ దాటాక ఇనాంగూడ వద్ద, జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. అక్కడ ఎడం వైపు, క్రీ.పూ.1000 సం.ల నాటి ఇనుపయుగపు సమాధులుండాలి చూద్దామా అని మా గ్యాంగ్‌ను అడిగితే, అందరూ ఆర్కియాలజిస్టులే కాబట్టి సరే నన్నారు. కారాపి, రోడ్డు ప్రక్కనున్న రాళ్ళ గుట్టలు దాటి కొంచెం పైకెక్కి చూస్తే 3 సమాధులున్నాయి. 20 అడుగుల వ్యాసంతో, అడుగున్నర ఎత్తుతో, చుట్టూ 15 గుండురాళ్ళను గుండ్రంగా అమర్చిన సమాధులు. హైదరాబాదు పరిసరాలు ఆదిమ మానవుని అడుగుజాడలు ఆనవాళ్ళని తెలిపే ఆధారాలు ఇవి. రేపో మాపో రోడ్డు విస్తరణలో చారిత్రిక అవగాహన లేని కాంట్రాక్టర్లు వాటిని నిర్ధాక్షిణ్యంగా బుల్‌డోజర్లతో లేపేస్తారని కనీసం ఫొటో అన్నా తీసుకుందామని మావాళ్ళకు వాటి చారిత్రక నేపథ్యాన్ని వివరించాను. జితేంద్ర ఫొటోలు తీశాడు.



మళ్ళీ కారెక్కి వెళుతున్నాం. టీ తాగాలనిపించింది. ఎడమవైపున ఆలీవ్‌గ్రీన్ రెస్టారెంట్ కనిపించింది. అందరం కాఫీ తాగాం. నాగు బాగా గుర్తు, ఒకసారి నేను, మేడసాని శుభాకర్ విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తూ, ఎందుకో ఆగిన మాకు ఒక దిగుడు బావి కనిపించింది. అప్పుడు ఫొటో కూడా తీసుకున్నాం. నేను ఇది బాటసింగారం శివారులో ఉందనుకొన్నాను. బాటసింగారం. ఎంత మంచి పేరు బాట. అంటే దండుబాట. కుతుబ్‌షాహీల కాలంలో గోల్కొండ నుంచి మచిలీపట్నానికి సైనికులు వెళ్ళే బాట. ఆ బాట పక్కనున్న సింగారం ఇలాంటి పేర్లు ఇప్పుడెవరు పెట్టుకుంటున్నారు. ఆ నగర్, ఈ కాలనీ అని అర్థం పర్థం లేని పేర్లని ఊళ్ళకు పెట్టుకుంటున్నారు. ఈ దిగువ బావిని గుర్తించి, రోడ్డు దాటి అక్కడికెళ్ళాం. ముళ్ళకంచె తొలగించుకుంటూ బావి దగ్గరకెళ్ళి చూశాం. 60/40/60 అడుగుల పొడవు, వెడల్పు, లోతులతో ఉన్న ఆ బావిలోకి దిగటానికి రోడ్‌వైపు నుంచి ఒక మీటరు వెడల్పుతోకగ కిందకి మూడు అంచెలుగా మెట్లు. ఒక్కో అంచె/ అంతస్తు చుట్టూ కలియదిరగడానికి అరుగు, ఎదురుగా ప్రతి అంతస్తులో నాలుగు గదులున్నాయి. బహుశా ఇవి అంతఃపుర కాంతలు, జలకాలాడిన తరువాత బట్టలు మార్చుకొనేందుకై ఉంటాయి. మూడో అంతస్తుపైన నీటి మోటార్‌ద్వారా తోడే ఏర్పాట్లు. ఈ బావి, తాగునీటికి, జలకేళీ, విలాసానికీ, ఇంకా సాగునీటి కోసం, దండుబాటలో వెళ్ళే సైనికుల కోసం కూడా ఇది ఉపయోగించి ఉంటారనిపించింది. నిర్మాణశైలిని బట్టి ఈ బావిని అసఫ్‌జాహీల కాలంలో నిర్మించారని చెప్పొచ్చు.



ఫొటోలు తీసుకుని మళ్ళీ కారెక్కాం. రహదారి వెంట కొంచెం ముందుకెళ్ళగానే మాకు తూప్రాన్‌పేట తగిలింది. ఈ ఊరి పేరు తుంపురానుపేట. మెదక్ జిల్లా, మేడ్చల్ (మేడిచలమ- మేడిచర్ల, మేడ్చల్ అయింది) ప్రక్కనే గల తూప్రాన్ పేరు శాసనాల్లో తూపురాను అని ఉంది. ఈ తూప్రాన్‌పేటలో కుడివైపున కుతుబ్‌షాహీల కాలపు మశీదు ఉంది. మీనార్లు వరకూ బాగానే వున్నాయి. ప్లాస్టరింగ్ చేసి గోడల్ని నాశనం చేయడమే కాకుండా, మశీదు ముందు ఆధునిక కట్టడాన్ని జోడించి దాని ప్రాచీనతకు భంగం కలిగించారు. కళ్ళముందు ఇలా వారసత్వం వరస తప్పుతుంటే, ఇలాంటి విపత్కర కాలం నుంచి నేను

శాశ్వతంగా తప్పుకుంటే బాగుంటుందేమో అనిపించింది. మరికొంత ముందుకు పోయాం. ఎడమ వైపున మరో అద్భుతమైన మశీదు కుతుమ్‌షాహీలదే. నోటీసు బోర్డులో మసీద్-ఆల్‌మాస్ అని ఆల్‌మాస్ పేట, చౌటుప్పల్ మండలమని ఉంది. కారు దిగాం. మా కుర్రకారు కూడా కారు దిగింది. వడివడిగా మశీదంతా తిరిగి ఫొటోలు దిగిన తరువాత, ఆ మశీదు నిర్మాణశైలి కాలం, అది ఎందుకు కట్టారో చెప్పాను. గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా (క్రీ.శ 1550-1580) తాను గోల్కొండ నుంచి మచిలీపట్నం వెళ్ళాలనుకున్నాడు. అందుకోసం ఏ సమయంలో ఎక్కడికి చేరుకుంటారో, రోజుకు ఐదుసార్లు నమాజు చేసే సమయాల్లో ఆయన ఏయే ప్రాంతాల్లో ఉంటారో తెలుసుకొని అక్కడ మశీదులు కట్టారు. రోడ్డు ప్రక్కన మైలు రాళ్ళు( కోసు మీనార్లు) పాతించారు. ఆ కోసురాళ్లు, జాతీయ రహదారి విస్తరణలో కనుమరుగైనాయి. అప్పుడు కట్టిన మశీదులే, తూప్రాన్‌పేటలోనూ. అల్మాస్‌పేటలోనూ ఉన్నాయని మా బృందానికి వివరించాను. వాళ్ళు కనుబొమ్మలు ఎగరేశారు. సార్, ఇక వెళదామా అని అడిగారు.

నేను ఆ చుట్టుప్రక్కల ఎక్కడైనా చారిత్రక ఆనవాళ్ళు



న్నాయేమోనని అనుకొనే లోపు నా కళ్లు అల్లంత దూరానున్న రాళ్ళపై వాలాయి. ఆశ్చర్యం అవి ఇనుప యుగపు సమాధులు. సమాధుల చుట్టూ అమర్చిన బండరాళ్లను కంకర కోసం ముక్కలు చేస్తున్నారు. ఘనమైన మన చరిత్రను, నామరూపాల్లేకుండా చేరిపేస్తున్నారు. నేను సనాతనను పిలిచాను. కొంచెం నిదానంగా నడుచుకొంటూ వచ్చాను. అక్కడ మధ్యలో గులకరాళ్ల గుట్ట, చుట్టూ బండరాళ్లను గుండ్రంగా అమర్చిన ఇనుప యుగపు సమాధులు దాదాపు పది వరకు కొన ఊపిరితో ఉన్నాయి. పరిశీలించి, ఫొటోలు తీసుకుని, ఇవి ఇంక ఎక్కువ కాలం బతకవని, నావంతు బాధ నేనుపడి, నిట్టూర్పుల సాయంతో అక్కడి నుంచి బయటికొచ్చి కారెక్కాం.

చౌటుప్పల్ దాటి వలిగొండ వైపు వెళ్లుతుంటే సంగంలో ఏదో విగ్రహం బయటపడిందట అని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ రామోజు హరగోపాల్ చెప్పారు. కష్టపడి ఆ ఊరెళ్లి అడిగితే, తెలియదన్న సమాధానం తప్ప, ఆ విగ్రహాన్ని చూడలేకపోయాం. మళ్ళీ ప్రయాణం. ఒకటే వర్షం. భోనగిరి దాటి మోత్కూరు చేరుకున్నాం. వర్షం కొంత కరుణించటంతో ఒక టీ అంగట్లో టీ తాగి, ఇక్కడొక ఆలయముండాలి కదా, ఎక్కడా అని అడిగాను. ఆ టీ అంగడి ఆవిడ, సార్ అది బుగ్గ రామలింగేశ్వర ఆలయం ఊరి బయట ఉంటుందని చెప్పింది. అక్కడికి చేరుకొన్నాం. దూరం నుంచి పాత ఆలయ దృశ్యం. ఎదురుగా ఒక తోరణం, ఒక్కసారి ఆనందం దక్కిందనిపించి,



ఆలయంలోకి ప్రవేశించాం. రోడ్డు కంటే రామ లింగేశ్వరాలయం 4 అడుగుల ఎత్తులో ఉంది. తోరణం సాదాగా ఉంది. అందుకనేమో రకరకాల రంగులు దట్టించారు. మెట్ల కిరువైపులా రెండు విరిగిపోయిన ఏనుగు బొమ్మలు, లోని కెళ్లగానే, ఎడమవైపు ఒక శిధిల వీరభద్రాలయం,పైన చక్కటి కాకతీయ ఇటుకరాతి విమానం, ఆలయ మహామండప ద్వారానికి అటూ ఇటూ నిలువెత్తు ద్వారపాలు శిల్పాలు, ఒంటి నిండా రంగులు పులుముకుని, ఎవరు కదుగుతారా అని ఎదురు చూస్తున్నాయి. లోనికెళ్ళాం. ఎడమవైపు గోడకు అస్పష్ట కాకతీయ శాసనం, చదవలేకపోయా. మధ్యలో స్తంభాలు, ద్వారాలూ, కప్పు,జాతీయ శిల్పుల పనితనానికి అర్థం పడుతున్నాయి. నంది నాజూగ్గా ఉంది. నాతో పోటీపడే మరో నంది ఉందా అని చూపరులకు సవాలు విసురుతుంది.

బయటకొచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షణ చేశాం. వాయువ్యంలో ఒక ఆలయం శిధిలమైంది. ప్రధానాలయ గర్భాలయంపై ఉన్న శిఖరం శోభాయమానంగా ఉంది. కొంచెం ముందుకు నడిచాం. మరో శిథిలాలయం మమ్మల్ని ఆహ్వానించింది. లోనికెళ్ళితే ఒక చక్కటి శివలింగం, కాకతీయ పనితనం వెనుక గోడ మధ్య అరుగుపైన సప్తమాతృక శిల్పం ఆ పక్క ఈ పక్క వినాయకుడు శివలింగం వీరభద్ర శిల్పాలున్నాయి. కుడివైపు కింది భాగంలో ఒక భక్తుని విగ్రహముంది. పసుపు కుంకుమల కలగలుపు రంగు పులిమి దేవతల్ని గుర్తు పట్టకుండా చేశారు భక్త శిఖామణులు. గర్భాలయం లోని శివలింగంపైన కప్పుబండ తొలగిపోయి, సూర్యకిరణాలు హారతినిస్తూ, వాన చినుకులు అభిషేకం చేస్తుంటే, లింగంలో నున్న శివుడు పరవశిస్తున్నాడు. చుట్టూ పెరిగిన చెట్లు ఆలయ శిఖరాన్ని అక్కున చేర్చుకున్నాయి. శుకరాసితో అలరారుతూ పకృతికే అందానిస్తున్నాయి. మళ్లీ చినుకులు పడుతున్నాయి. పరుగులతో కారెక్కాం.

మోత్కూరు చెరువుకట్ట మీదుగా ఫణిగిరి బౌద్ధారామం చేరుకున్నాం. వానలేదు. 16 ఎకరాల్లో వున్న బౌద్ధారామ కట్టడాల్ని ఫొటో తీసుకుని, కొండ దిగి, గ్రామంలో ఫణిగిరి అపురూప బౌద్ధ శిలాఫలకాల నుంచిన ఇంట్లోకి ప్రవేశించాం. 2002-04 మధ్య, 2009-10 మధ్య నేను ఫణిగిరి తవ్వకాల్లో పాల్గొన్న అనుభూతుల్ని నెమరువేసుకుంటూ, ఆ శిల్పాల గురించి మా బృందానికి వివరించి చెప్పాను. క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన 4 ఫణిగిరి శిల్పాలు, న్యూయార్కు మెట్రోపాలిటన్ మ్యూజియంలో ప్రస్తుతం ప్రదర్శనలో ఉన్నాయని, అవి మళ్లీ సియోల్ ప్రదర్శనకు తరలివెళతాయని వివరించాను.

ఇంతలో భోజనాలు సిద్ధమైనాయని ఫోను, మధ్యాహ్నం 3 గంటలు దాటింది. ఆకలి దంచుతుంది. వాళ్లింటికెళ్లి భోజనానికి కూర్చున్నాం. చక్కటి ఇల్లు, రేకుల షెడ్డే, అయితే ఏం, అరెకరంలో



కట్టుకున్నారు . ముందు వసారా, ఆపక్క ఈ పక్కా గులాబీ, మల్లె, బొప్పాయి, అరటి, మామిడి మొక్కలు చిటుక్కు చిటుక్కు మనుకుంటూ తిరిగే ఆయిదారు బాతులు 'రండి సార్! వాటిని తర్వాత చూద్దురుగాని' అని అన్నం, ఆవకాయ, పప్పు వడ్డించారు. కమ్మని పచ్చిపులుసు, మజ్జిగచారు, పక్కనే ఉంచారు. సకినాలు, సర్వపిండి వడియాలు ఆతిధ్యానికి అర్థం చెప్పాయి. హైదరాబాదు బయలుదేరుతుంటే, అందరితో ఆప్యాయంగా ఒక ఫొటో దిగారు. నా దృష్టి మాత్రం సంవత్సరానికి రెండు సార్లు కాచే మామిడి చెట్టుపై పడింది. గమనించిన సర్పంచి, రెండు కాయలు తెంపి, సాగనంపాడు. బయలుదేరామే కాని, పొద్దుట్నించి చూచిన ఆలనా పాలనా లేని చారిత్రక స్థలాలు, శిల్పాలు మమ్మల్ని పట్టించుకోండ్రా అని గడ్డం పట్టుకుని బతిమాలుతున్నట్లు అనిపించింది. అందుకు మరో మార్గం వెతకాలని, కాలమే అందుకు సహకరించకపోతుందా అని అనిపించింది. ఊరు, వాడా దాటి హైవే మీదుగా హైదరాబాదు చేరుకున్నాం. సేద దీరుతామంటే శిధిలాలయాల మౌన ఘోష మనసు చుట్టూ ముసురుకొంది. అ

42వ పేజీ తరువాయి.

## శంకరన్ గారి తరం

1933 సర్వే నుండి రికార్డులను నవీకరించి, వాటిని ముందే ప్రజలకిచ్చి, వారి సమక్షంలో కబ్జాదారుల తనిఖీ చేపట్టక తప్పలేదు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ తన సలహా కోసం పంపిన ఫిర్యాదుపై స్పందిస్తూ, శంకరన్, ఈ సర్వే సూత్రాలను ఉత్తర్వులుగా మార్చిన కోర్టు తీర్పును (పాయం గంగమ్మ వసుధా మిత్రా) అమలుచేయాలని తెలియ చేసారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న మూడు గ్రామాలమీద పరిశోధన చేసిన నాగేశ్వరరావు (నేడు హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ శాఖలో ఆచార్యుడు), శక్తి పనిచేసిన దర్భగూడెంలో గిరిజనులకు గిరిజనేతరుల భూమి కొంత పంచారని, సి.పి యం వారి నాయకత్వంలో రెడ్డి గణపవరంలో జరిగిన తనిఖీలో గిరిజనులకు, ఆ విధంగా భూమి దక్క లేదని, రైతుకూలి సంఘాల నాయకత్వంలోగల కోయనాగవరంలో ఈ తనిఖీ ప్రయత్నమే జరగలేదని పేర్కొన్న సిద్ధాంత వ్యాసం అని ప్రచురించింది.

తీవ్రవాదులు–ప్రభుత్వం మధ్య శంకరన్ వగైరాల మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చలు విఫలమైన తరువాత, పౌరహక్కుల సంఘాలలో కొందరు ఈ రికార్డుల సేకరణకు పూనుకొన్నారు. వారికి మార్గదర్శనం వహించిన నరెంద్రనాద్‌కు శక్తి ఉట్నూరు సర్వే నిర్వహించిన అధికారి రమేశ్ వ్యాసాన్ని తెలుగు చేసి ఇచ్చింది. నడుస్తున్న చరిత్ర దాన్ని ప్రచురించింది. (దున్నే వాడికి భూమి- భూమిలోకి దున్నేవాడు.) ఈ సంఘాల ప్రయత్నాలు ఏమైనాయో తెలియదుకాని అక్కడి ఇంద్రవెల్లి మండలంలో పట్టా పొంది, భూమి దక్కని వారి మీద పరిశోధన చేసిన, జెనివా విద్యార్థిని మీనాక్షి –చాలామందికి భూమి చూపించలేదని గమనించింది.

( ముగింపు తరువాయి సంచికలో)..

42 వ పేజీ తరువాయి

కృషి అందించారు.

సహజంగానే తర్వాతి రోజుల్లో మల్లెమాలగారి దృష్టి ఆధ్యాత్మికతవైపు మళ్లింది. చిన్మయ మిషన్, ఆరవిందో సొసైటీలలో కీలక బాధ్యతల్ని నిర్వహించారు. 'రాజ విద్యాకేంద్రం' అనే పేరున్న సంస్థకు దక్షిణ భారతదేశ శాఖకు అధ్యక్షులుగా వున్నారు. విదేశాల్లో జరిగిన చాలా ఆధ్యాత్మిక సమ్మేళనాల్లో ప్రసంగాలు చేశారు.

గత పదేళ్ళుగా సాహితీవేత్తలకు మల్లెమాల సాహితీసత్కారం ఇచ్చి గౌరవిస్తున్నారు. ఆ సభలను చిత్తశుద్ధితో గొప్పగా నిర్వహిస్తూ వస్తున్నారు. రచనకూ, జీవితానికీ మధ్య వ్యత్యాసాలు లేని నిష్కళంక జీవితం గడిపినవారు మల్లెమాల వేణుగోపాలరెడ్డిగారు. ఆయన్ని గతంగా, చరిత్రగా అనుకోవడమంత సులభం కాదు. ఆయన ఆత్మీయ పలకరింపులు లేని లోకమేమీ అందంగా వుండదు. తన జీవితాన్ని అంత ఫలవంతంగా మలచుకున్న వ్యక్తులు ఎందరో ఉండరు. ఎనభైఎనిమిది సంవత్సరాల వయస్సులో ఆయన లోకాన్ని హుందాగా వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయారు. మంచికీ, మానవత్వానికీ, ఆయన వేసిన మల్లెమాల యెప్పటికీ వాడదు. పరిమళాన్ని వీడదు.

37వ పేజీ తరువాయి.

క్రియాశీలక పాత్ర పోషించారు. ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వ పాలనను బ్రిటన్ ప్రభుత్వ శాసన సభ్యుల సహాయంతో, ప్రజా ఉద్యమాల రూపంలో ఎదుర్కొన్న నిబద్ధత గల సంస్కరణవాది గాజుల లక్ష్మీనరసు చెట్టి సదా స్మరణీయుడు. చివరగా 'ముగింపు' (ప్రకరణం 5) లో 19వ శతాబ్దిలో మద్రాసు ప్రెసిడెన్సీ ఒక నిశీధి, నిరామయ ప్రాంతం అని అభివర్ణిస్తున్న వలసవాద చారిత్రకుల వాదనలను రచయితలు చారిత్రక భౌతిక వాద దృక్పథంతో పూర్వ పక్షం చేసారు. గ్రంథంలో అనేక చోట్ల పునరుక్తి దోషాలున్నప్పటికీ, దక్షిణాదిలో ప్రథమ ప్రజా ఉద్యమకారుడు గాజుల లక్ష్మీనరసు చెట్టి గారి క్రియాశీలక చారిత్రక పాత్రను అత్యంత ఆసక్తికరంగా పాఠకుల ముందుంచారు. 'పౌరహక్కులకు, ఎన్నిక ద్వారా స్థాపితమయ్యే సంవిధాన సూత్రాలకు, ప్రజా పోరాటాలకు 19వ శతాబ్ది మద్రాసు ప్రెసిడెన్సీలో ఆయనొక (గాజుల లక్ష్మీ నరసు చెట్టి) చుక్కాని. ఒక సాంఘిక గీటురాయి. ఒక రాజకీయ వైతాళికుడు.' అనే ముగింపు వాక్యాలు సమకాలీన రాజకీయ యవనికలో 'గాజుల'వారి స్ఫూర్తిని పుణికిపుచ్చుకోవాల్సిన చారిత్రక అగత్యాన్ని సూచిస్తున్నాయి. చరిత్ర నిర్మాతలైన ప్రజా ఉద్యమకారులు, చరిత్ర పరిశోధకులు తప్పక చదవాల్సిన పుస్తకమిది.

పుస్తక సమీక్ష

# భావుకత నిండిన దీర్ఘకవిత – 'మట్టిబండి'

**మట్టిబండి: దీర్ఘకవిత రచన–డా. నాగభైరవ ఆదినారాయణ, వెల రూ.100/- 9849799711తో రచయితను సంప్రదించవచ్చు.**



'వ్యవస్థలపై రోత గలిగి/ అవస్థలతో నలిగి నలిగి/ హాలాలను విసిరికొట్టి/ పొలాలను విడిచిపెట్టి హాలికులందరూ/తలోదారికి/ తరలిపోతే రామరాజ్యంలో రేపు అన్నమో రామచంద్రా! " అనే అరుపులు వినిపిస్తాయేమో నాలుగు కాలాలపాటు నిలిచేలా నలుగురు మెచ్చుకొనేలా మంచి కవిత్వం వ్రాయాలంటే కవి సామాజిక సమస్యను వస్తువుగా ఎంచుకోవాలి. ఆ సమస్యకు సంబంధించిన అన్ని కోణాలు పరిశీలించాలి. ఆ వస్తువుతో ప్రగాఢమైన అనుబంధం ఏర్పరచుకొని, అనుభూతి చెందాలి. ఆ అనుబంధాన్ని, అనుభూతిని పాఠకులు సహానుభూతి చెందేలా చెప్పగలగాలి. అందుకు తగిన భాషను, భావుకతను, భావవైవిధ్యాన్ని, అలంకారాలను, ఎంపిక చేసుకోవాలి. సందేశం ఇవ్వాలి. అలాంటి ఉత్తమ కవిత్వానికి ఉదాహరణగా నిలిచే దీర్ఘకవిత. నాగభైరవ ఆదినారాయణ రచించిన – మట్టిబండి.

అప్పులపాలై అవస్థలుపడే రైతన్నలు వ్యవసాయాన్ని విడిచిపెడితే కలిగే పరిణామాల్ని కావ్యాంతంలో చెప్పి, భవిష్యత్తరాలు రైతును కాపాడుకోవలసిన అవసరాన్ని కవి ధ్వనిపూర్వకంగా తెలియజేశారు.

"మా పొలాన్ని అమ్మేశాను" అంటూ ప్రారంభమై ఈ దీర్ఘకవితలో పొలంతోపాటు దానితో అనుబంధం ఉన్న ఎడ్లను, బండిని అమ్ముతూ, రైతు దుర్భరమైన ఆవేదన పొందాడు. దానిని కవి కరుణరసాత్మకంగా వర్ణించాడు. నేలతల్లికి ఆత్మనివేదన చేసుకుంటూ పశ్చాత్తాపంతో కవితా సంతకం చేశాడు.

" అపురూపమైన/ ఆ వృషభాల రూపాలను చూస్తే / లేపాక్షి బసవన్న అయినా/ లేచి నిలబడాల్సిందే/" అంటూ ఎడ్లను వర్ణించిన తీరు " నా ఇల్లాలు ఈ బండిలోనే వచ్చి/నా ఇంటికి దీపమయింది/ నా ఆత్మకు రూపమయింది." అంటూ బండితో ఉన్న అనుబంధాన్ని వర్ణించిన విధానం అనన్యంగా ఉంది.

రైతు వాగుల్లో తిరుగాడిన వైనాన్ని, గొడ్లకాడి బుడ్డోళ్ళతో గడిపిన విధానాన్ని నీటిలో తిరిగే చేపల సౌందర్యాన్ని, ఆప్యాయంగా అన్నం తినిపించిన ఇల్లాలి జ్ఞాపకాలను, చేనుచుట్టూ నాటిన బంతినారును, నాన్న దున్నిన చాలు చక్కదనాన్ని ,ముత్యాల్లా మెరిసే మంచుబిందువులను–ఇలా ఎన్నెన్నో జ్ఞాపకాలను చెప్పి, కవి పాఠకులను స్వీయానుభూతిలో తడిపి, రసానందంలో ముద్దచేశాడు.

రైతు ఆకలి రాకాసి నుండి లోకాన్ని కాపాడేవాడు. సాగు యాగాన్ని ఆచరించే ఋత్విక్కు, అన్నప్రదాత. మట్టి నుండి పరబ్రహ్మ స్వరూపాన్ని రూపొందించే విధాత. ఏకవచనాన్ని బహువచనంగా మార్చగల మాంత్రికుడు. విత్తనాన్ని విత్తంగా చేయగల ఇంద్రజాలికుడు–ఇలా రైతు గొప్పతనాన్ని కవి అద్భుత వర్ణనతో ఆవిష్కరించాడు.

వాతావరణ పరిస్థితులతో, ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు గురవుతున్నారని బాధపడ్డాడు. ఆ సందర్భంగా కవి రైతును త్రిమూర్తులతోనూ, ఏసుక్రీస్తు, వెంకటేశ్వరుడు, అభిమన్యులతో పోల్చడం వారికి మాత్రమే సాధ్యమయ్యేపని.

ఆధునికకాలంలో యువకులకు వ్యవసాయం పట్ల ఏర్పడిన చిన్నచూపును రైతు పెద్దకొడుకు మాటలద్వారా వివరించాడు. ప్రస్తుత పరిస్థితులను విశ్లేషించి, నిస్సహాయుడైన రైతు సాగుకు దూరం కావడం మంచిదని చిన్నకొడుకు మాటలద్వారా తెలియజేశాడు.

అందమైన అర్థాలంకారాలు, సుందరమైన శబ్దాలంకారాలు, వ్యవసాయ సంబంధమైన పదాల ప్రయోగం, సందర్భోచితంగా జాతీయాలను వాడడం,భావసౌందర్యాన్ని ఇనుమడింపజేసే సామెతల ప్రయోగం–ఇత్యాది ఉత్తమ కవితా లక్షణాలతో సాగిన "మట్టిబండి" అందరూ చదవతగిన, చదవవలసిన పుస్తకం.

తేళ్ళ అరుణ
84669 08888

## గ్రంథాలయం



**వర్ణాలు లేని వాక్యాలు** (కవిత్వం)
**రచన: సరికొండ నరసింహరాజు**
పుటలు: 127, వెల 150/-
ప్రతులకు: సరికొండ నరసింహరాజు
ఇంటి నెం. ఎ–116,,పైలాన్ కాలనీ,
నాగార్జున సాగర్,–508 203
ఫోన్:94413 64022



**అమరావతి** నేడు-నాడు-రేపు
**రచన: దాసరి అళ్వార స్వామి**
పుటలు: 176, వెల 150/-
ప్రతులకు: దాసరి అళ్వార స్వామి
కుందేరు, (వయా) ఆకునూరు,
కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా
521 245
ఫోన్:93938 18199

పుస్తక సమీక్ష

# నా సీమ యాసే నా శ్వాస




**నా సీమ యాసే నా శ్వాస**
**రచన:యెలిచెర్ల గజేంద్రనాథ్‌రెడ్డి**
వెల:రూ. 150/-
ప్రతులకు:
యెలిచెర్ల చంద్ర ఓబుల్ రెడ్డి
అడ్వకేట్,యన్.జి.వో కాలనీ,
బద్వేల్,కడప
ఫోన్: 94411 12404

రాయలసీమ - అందునా కడపజిల్లాకు ఉన్న గొప్పవిశేషం- భాషా సారస్వత అభిమానం. చాలా మంది ఏ వృత్తిలో వున్నా సాహిత్య పరిచయం కలిగిఉంటారు. వారి భావవ్యక్తీకరణలో సారస్వత స్పర్శ ఉన్న భాష తొణికిసలాడుతుంది. ఆ కోవకి చెందినదే యెలిచెర్ల గజేంద్రనాథ్ రెడ్డి (1966-2021) స్మృతిచిహ్నంగా వారి కుటుంబ సభ్యులు ప్రచురించిన కథల, సంభాషణల సంకలనం - 'నా సీమ యాసే, నాశ్వాస'. మంచి ఉపాధ్యాయునిగా, సాహిత్యాభిమానిగా పేరుపొందిన గజేంద్రనాథ్ రెడ్డి, 'ఫేస్‌బుక్' మాధ్యమం విస్తృతమైన తర్వాత 'నా సీమయాసే నాశ్వాస' పేరుతో గ్రూప్ సృష్టించి కథలు, కథనాలు రాసి సాహిత్యకారుల ప్రశంసలను పొందారు. ముఖ్యంగా కరోనా సమయంలో- రాసిన కథలలో, సంభాషణలలో కరోనా మహమ్మారి ప్రస్తావన, నేపథ్యం సమకాలీనతకు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఇంకా, వర్తమాన రాజకీయాలు, అర్థికావసరాలు, మద్యపానం, జూదం, దుబారా ఖర్చులు, వ్యవసాయంలో వెతలు- ఇలా ప్రస్తుత సమాజంలో కనిపించే అన్ని విషయాలపై రచన సాగింది. అన్నింటికన్నా ప్రధానంగా కనిపించేది తను శ్వాసగా భావించిన సీమ యాస - జనాల నోళ్లలోంచి ఎలా బయటకు వస్తాయో ఆమాటల్నే అక్షరబద్ధంచేసి రాయలసీమ-అందునా-కడపజిల్లా ప్రాంతీయ పదపరిమళాలను గుబాళింపచేశారు. మానవ సంబంధాల పట్ల ఎంతో ఆదరం, మనషులంటే ప్రేమ, పల్లెల్లో కానవచ్చే నిర్మల పరమ సాత్విక ప్రేమసంబంధాలు, అనుబంధాలు తొంగిచూస్తాయి. ఆ కథలలో సంభాషణలలో.

ఈ పుస్తకంలో 15 కథలు, 21 సంభాషణలు ఉన్నాయి. 15 కథలలో 3 పెద్దకథలు,- మ(నీ)న బంధాలు; మేనరికం; బతుకుబండి;మిగతావి చిన్నవి. ఈ కథలు కథలుగా అనిపించవు. కడపజిల్లా బద్వేలు తాలూకా కాశినాయన మండలంలోని సాలిశెట్టిపల్లి గ్రామానికి సంబంధించిన - - ఊరినీ, ఇళ్ళనీ, ప్రజలనీ పొలాల్ని- అక్కడ ప్రజల జీవన విధానాలు-అన్నీ దృశ్యప్రయోగం, ప్రతిఒక్క సామెత, ప్రతి పలుకుబడి బద్వేలు ప్రాంత మాండలికాల సొగసు, యాస మనకు అర్థం అవుతాయి.

ఇక 21 సంభాషణలలో, 'సుబ్బమ్మ' పాత్రను సృష్టించి, వరుసకు అల్లుడైన 'సుబ్బారెడ్డి'తో జరిపిన సంభాషణలు సమాజంలో నెలకొని ఉన్న అన్ని రుగ్మతలను చీల్చి చెండాడతాయి. అయితే కథలలోను సంభాషణలలోను ఆ ప్రాంతీయ యాసతోబాటు, కొంత మొరటుగాను, ఇతర ప్రాంతీయులకు కొరుకుడుపడని కొన్ని పదాలు- అక్కడక్కడ దర్శనమిస్తాయి. రాయలసీమ యాస తన శ్వాసగా జీవించిన గజేంద్రనాథ్‌రెడ్డి స్మృతి చిహ్నంగా వెలువడిన పుస్తకం ఇది- సీమ ప్రాంతీయ, భాషాభిమానానికి దర్పణంగా నిలుస్తుంది.

ఎమ్వీశాస్త్రి
08072023

## కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహిత్యసేవాపురస్కార ప్రదానం



జులై 16న ఆదివారం విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కుసుమ ధర్మన్న సాహిత్యసేవాపురస్కార ప్రదానోత్సవ సభ ఆహ్లాకర వాతావరణంలో జరిగింది. వ్యాఖ్యాన కళాశిరోమణి వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించిన ఈ సభలో నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీకి 11,116/-ల నగదు, శాలువా, సన్మానపత్రం, జ్ఞాపికతో ఈ పురస్కారాన్ని అందజేశారు. సుప్రసిద్ధ సినీ గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ రాధా కుసుమ, నవభారత్ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు సూరేపల్లి రవికుమార్, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకులు ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, బుద్ధభూమి ఎడిటర్ బొర్రా గోవర్ధన్, మానసిక వైద్యనిపుణులు డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ ఘంటా విజయ్ కుమార్, కవి డాక్టర్ సి.నారాయణస్వామిలతోపాటు పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, కార్టూనిస్టులు, జర్నలిస్టులు పాల్గొన్నారు

జి.వి.పూర్ణచందు
9440172642

# తాళాధ్యాయం

**హస్త ద్వయస్య సంయోగే వియోగే చాపివర్తతేప**
**వ్యాప్తి మాన్యో దశప్రాణ స్సకాలస్తాళసంజ్ఞిక:**

హస్తద్వయం అంటే రెండు అరచేతుల సంయోగ వియోగాలు. అంటే ఒకసారి కలిసి విడిపోయేందుకు పట్టే కాలాన్ని దశప్రాణాలుగా విభజించారు. పాడేప్పుడు, ఆడేప్పుడు ఈ దశప్రాణాల కాలపరిమాణమే తాళం. దరువు వేయటం, చప్పట్లు కొట్టటం తాళాలే! తాళం యొక్క కాలాన్ని'లయ' అంటారు. చేత్తో తాడిస్తూ వేసే తాళాన్ని'చేతాళం' అని, నాట్యానికి వేసే తాళాన్ని గిరగిటలు(గిర్గటలు) అంటారు.

గాయకులు వేరొకరి సహకారం లేకుండానే తాళం వేసుకుంటూ పాడగలరు. కానీ వాద్యకళాకారులు, నర్తకులు స్వయంగా తాళం వేసుకునే అవకాశం ఉండదు. తాళం వేసేవారు లేనప్పుడు 'దక్షిణేతాళధారీచ పార్శ్వ ద్వంద్వే మృదంగిక' సూత్రానుసారం మృదంగాన్ని అనుసరిస్తారు. నర్తకులకైతే 'హస్తేనార్థం ప్రదర్శయేత్' సూత్రం ప్రకారం చేతులు ఆ గీతంలోని భావాన్ని ప్రదర్శిస్తాయి కాబట్టి, మృదంగ వాద్యాన్ని అనుసరించి పాదంతో తాళం వేయాలని 'సంగీతమార్తాండము' 'తాళాధ్యాయం'లో ఉంది. పుచ్చా వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఈ గ్రంథానికి వ్యాఖ్యానం వ్రాశారు. చేత్తో తాళం వేసేప్పుడు కలిగే శబ్దం కంటే పాదంతో తాళం వేసేప్పుడు ఎక్కువ శబ్దం పుడ్తుంది కాబట్టి, కాలికి గజ్జెలు కట్టుకోవాలన్నారు. తాళహీనుల గురించి ఈ గ్రంథం కఠినంగానే వ్రాసింది.

చేత్తో తాడిస్తూ వేసే తాళం, దాని గురించి చెప్పే తాళాధ్యాయం రెండూ అర్థవిపర్యయం చెంది, కొట్టడం అనే అర్థం వ్యాప్తిలోకి వచ్చింది.'ఆంధ్రవాచస్పత్యం' తాళాధ్యయం అంటే తన్నటం, కొట్టటం అనే అర్థాలు కూడా ఇచ్చింది. 'ఇవాళ ఈ పాఠం అప్పచెప్పకపోతే తాళాధ్యాయం తప్పదు' అంటే వీపు విమానం మోత మోగుతుందనటమే! తాళం లేదా తాళాధ్యాయం అంటే తాటిమట్ట ప్రయోగం అని!

కన్యాశుల్కం నాటకంలో గిరీశం అగ్నిహోత్రావధానులు ఇంట్లో చేరాక వెంకటేశంతో అంటాడు: 'యీవాళో పెద్ద పెళ్లి నీకు తల వెంట్రుకంత వాసి తప్పిపోయింది. యీ శలవులాఖర్లోగా తాళాధ్యాయం కాకుండా తప్పించుకుంటే నువ్ పూరా ప్రయోజకుడివే, యిహ నిజమైన పెళ్లా? యింత చదువూ చదువుకుని నీ తండ్రి కుదిర్చిన యేవీఁ యరగని చిన్న పిల్లకా పుస్తె కడతావ్? మాంచి యెఱ్ఱగా బుఱ్ఱగా వున్న యంగ్విడోని నువ్ పెళ్లాడకపోతే ఐ షుడ్బి యషేమ్డాఫ్యూ!' అని! వెంకటేశం పరీక్షలో తప్పిన సంగతి తెలిస్తే అతగాడి తండ్రి తాళాధ్యాయం ప్రయోగిస్తాడు కాబట్టి, పాసయ్యాడని బొంకి గండం గట్టెక్కించాడు గిరీశం.

బ్రౌన్ నిఘంటువు తాళం వెయ్యటం అనే పదానికి ఎగగొట్టడం, తప్పించుకోవటం అనే అర్థాలిచ్చింది. 'ఆ సంగతికి మబ్బు తాళము వేసినాడు' అనే ఒక ప్రయోగాన్ని( He eluded or evaded the question) కూడా ఉదహరించాడు. వాడికి అప్పిచ్చావంటే ఆ డబ్బుకు మబ్బుతాళం వేసినట్టే లాంటి ప్రయోగాలుండేవి. 'వాడు మబ్బుతాళం వేశాడు' అంటే జంప్ జిలానీ అయ్యాడని అర్థం. అరుడికి మబ్బుతాళం వేసి, రికమెండేషనుకు అధిక పీఠం వేశారు లాంటి పదబంధాల వలన భాష పువ్వులా (Flowery) పరిమళభరితం ఔతుంది.

కొందరు జీడిపాకోపన్యాసకులుంటారు. వాళ్లు ప్రసంగించేప్పుడు ప్రేక్షకులు లేదా శ్రోతలు చప్పట్లు కొట్టటం మొదలు పెట్టారంటే ఇంకచాలు బాబో...అని అన్వయార్థం. తెలుగు వ్యుత్పత్తి పదకోశం తాళాధ్యాయంలో చప్పట్లు చరుస్తూ గేలిచేయటం ఉంది! తాళాధ్యాయాన్ని ఎదుర్కొంటున్నా పట్టిన మైకుని జలగలా వదలని వారికి ఝంపతాళం వెయ్యాల్సిందే! తెలుగులో జంప అంటారు. అంటే దూకుడు అని!

'ఇనుప పెట్టిని చూచి యూటలూరుచు, కాగితపు కట్టలను' లెక్కించుకొనుచు, రూపాయి దొంతరలను మోగించుకొనుచు, వెట్టి కాపలా కాయుచు, నితడు జీవయాత్ర గడుపుచుండును, ఇంతలో కొడుకులు తిరుగబడి తాళాధ్యాయముచేసి యతని కళ్లెదుటనే యావదాస్థిని తుడిచి వేసిరి' అని ముదిగంటి జగ్గన్నశాస్త్రిగారు ఓ కథ చెప్పారు. 'త్యాగరాజులు శాశ్వతులు కాని భోగరాజులు కాదు' అంటారాయన. పిసినారి సొమ్ము నక్కలపాలు కాక తప్పదు. కొడుకులో, దొంగతొత్తుకొడుకులో తాళాధ్యాయమో, తట్టితాళమో వేస్తారు.

సంగీత నాట్యశాస్త్రాల పరమైన ఈ తాళాధ్యాయం, తాళం వేయటాలు చివరికి చావకొట్టి చెవులు మూయటంలోకి మారిపోయాయి. మొన్నటిదాకా ఈ పదాన్ని వ్యంగార్థంలో బాగా వాడేవారు కూడా! ఇటీవలి రచనల్లోగాని, వార్తాపత్రికల్లోగానీ ఈ పదం కనిపించట్లేదు.

లాకప్పులో పెట్టి పోలీసులు మూడో డిగ్రీ ప్రయోగించి, నిజం చెప్పించారని వ్రాయటానికి, 'పోలీసుల తాళాధ్యాయంతో నిజం కక్కేశాడు' అనవచ్చు. ఫలానా పార్టీకి ప్రజలు తాళం వేశారంటే ఆ పార్టీని తిరస్కరించారని అర్థం. ఇక్కడ తాళంవేయటం అంటే locked అని కాదు, blocked అని! గిరగిటలు (పాదతాళాలు) పడతాయన్నమాట.

'చప్పట్లోయ్ తాళాలోయ్...దేవుడి గుడిలో బాజాలోయ్' అని బాలల గేయంలో చెప్పినట్టు, ఎన్నికల దాకా చప్పట్లే కొట్టినా, జనం ఎన్నికల రోజున తాళాలు వేస్తారు. ఓటరు దేవుడికి తెలుసు బాజా భజంత్రీల్ని ఎలా ఉపయోగించాలో! అధికారం శాశ్వతం అనుకునేవారు పగ్గాలు తమ చేతుల్లో ఉన్నాయనుకుంటారు. కానీ, తాళాలు ప్రజల చేతుల్లోఉంటాయి. అ

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# దక్కన్ ఆర్కైవ్స్ అండ్ కల్చరల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, నడిగూడెంలో భద్రపరిచిన చెరగని తీపి గురుతులు










## శతవర్ధంతి సభలో కొన్ని దృశ్యాలు



సభాప్రాంగణంలోకి వస్తున్న అతిథులు



సభావేదికపైకి అతిథులను ఆహ్వానిస్తూ ప్రసంగిస్తున్న శ్రీ వేముల వెంకటేశ్వర్లు......





'రెండు రాష్ట్రాలలో భాషా సంక్షోభం' పుస్తకాన్ని, 'అమ్మనుడి' జులై సంచికను నిశితంగా పరిశీలిస్తున్న తెలంగాణా మంత్రివర్యులు శ్రీ జగదీష్‌రెడ్డిగారు, పక్కన శ్రీ కె.జితేంద్రబాబు

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
AUGUST2023 Vol :9, Issue 6

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

స్వాతంత్ర్యదినోత్సవ మరియు తెలుగుభాషా దినోత్సవ శుభాకాంక్షలతో...

# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532 స్థాపితం : 2001

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, తెనాలి – 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 – 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) అంగలకుదురు ఫోన్ : 08644 – 233299
2) కొల్లూరు ఫోన్ : 08644 – 243788
3) బాపట్ల ఫోన్ : 08643 – 224051
4) కొల్లిపర ఫోన్ : 08644 – 245399
5) రేపల్లె ఫోన్ : 08648 – 222388
6) మంగళగిరి ఫోన్ : 08645 – 231255
7) చెరుకుపల్లి ఫోన్ : 08648 – 294422
8) పొన్నూరు ఫోన్ : 08643 – 294400
9) గుంటూరు ఫోన్ : 0863 – 3500785

**అప్పులు**

బంగారు వస్తువుల హామీపై
ప్రతిరోజూ గ్రాముకు రూ. 3,500/-లు
చొప్పున 11.5% తక్కువ వడ్డీకి అప్పునివ్వబడును
ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, ఇతర స్థిరాస్తుల హామీపైన
మరియు పర్సనల్ లోన్స్ 15%
వడ్డీకి ఇవ్వబడును

## ఖాతాదారులకు మా సేవలు

| | |
|---|---|
| సేవింగ్స్ ఖాతాలపై | 5.0% |
| 30 రోజుల నుండి 45 రోజుల వరకు | 5.0% |
| 46 రోజుల నుండి 90 రోజుల వరకు | 6.5% |
| 91 రోజుల నుండి 180 రోజుల వరకు | 7.0% |
| 181 రోజుల నుండి 1 సంవత్సరము వరకు | 7.5% |
| 13 నెలల పై కాలము నుండి 24 నెలల వరకు | 9.0% |

సీనియర్ సిటిజన్స్‌కు
ఒక సంవత్సరం పై కాలపు
డిపాజిట్స్ పై ఒక శాతం
అదనపు వడ్డీ
ఇవ్వబడును

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం – డైలీ డిపాజిట్

లాకర్స్ సదుపాయం కలదు



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ.శే. దావులూరి సోమశేఖరరావు

**పాలక మండలి**

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ కలారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ అంబటి పోతురాజు, డైరెక్టర్
శ్రీ దావులూరి చక్రధర్ చౌదరి, డైరెక్టర్
శ్రీ వి.వి.వి. శివప్రసాదరావు, డైరెక్టర్

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి
చరవాణి : 93478 96473



అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.
డిపాజిట్స్ చేయండి – అధిక లాభం, విలువైన సేవలు పొందండి.

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244